
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
epaper.vaartha.com WWW.VAARTHA.COM
: fb.com/vaartha Digital



భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్
హైస్పీడ్ 'ఇవోల్గా' రైలు
5.05 కి.మీ పొడవైన
టేబుల్ గిన్నిస్ రికార్డు
5



Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 226 పేజీలు: 10+4 వెల: 6.50


## వినాయకచవితి శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు వినాయకచవితి శుభాకాంక్షలు.

**-డా॥ గిరీష్ కుమార్ సంఘీ**
**'వార్త' సిఎండి & మేనేజింగ్ డైరెక్టర్**



## సెలవు

**పండుగ సందర్భంగా 14-9-2026 సోమవారం వార్త కార్యాలయానికి సెలవు. కావున15-9-2026న సంచిక వెలువడదు. పునర్దర్శనం 16వ తేదీ బుధవారం.**

### రూ.18 కొనడం 80 రూపాయలకు విక్రయం

### ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా నిలిపివేత

### అక్రమార్కులకు సిరుల పంట

### చోద్యం చూస్తున్న పౌరసరఫరాలశాఖ


రేషన్ బియ్యం అక్రమదందా!

# పాలిష్ కొట్టు

## బ్రాండ్ పేరు పెట్టు

**హైదారబాద్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** తెలంగాణలో పౌరసరఫరాలశాఖ సరఫరా చేసే సన్నబియ్యంకు సింగిల్ పాలిష్‌చేసి కొందరు మిల్లర్లు, వ్యాపారులు కొత్త తరహా మోసాలకు తెరలేపుతున్నారు. ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా నిలిపివేయడంతో రేషన్ బియ్యంను సులభంగా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారు. మూడునెలకోటా ఒకేసారి ఇవ్వడంతో బ్లాక్ దందాకు ఆజ్యంపోసినట్లవుతోందనీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 616806 రేషన్‌షాపుల నుంచి 99.30 కోట్లమందికి 6.17లక్షలమెట్రిక్ టన్నులు బియ్యం సెప్టెంబరు 5వరకు పంపిణీ చేశారు. మూడునెలలకు గాను 6.48లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కేటాఇయంచగా 95శాతం బియ్యం పంపిణీ జరిగింది. బ్రాండ్ పేరు ముద్రించిన బస్తాల్లో నింపి ఇటు ప్రభుత్వానికి అటు వినియోగదారులకు టోకుగా శఠగోపం పెడుతున్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసి కాకినాడకు తరలించి బయటి దేశాల్లో అమ్ముకొనే అక్రమార్కులు సన్న బియ్యం సరఫరాతో రూటు మార్చి స్థానికంగానే వివిధ బ్రాండ్ పేర్లతో విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో బియ్యం మాఫియా వేళ్లూనుకుంది. గ్రామస్థాయిలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని రేషన్ లబ్ధిదారుల నుంచి పిడిఎస్ సన్న బియ్యం సేకరించి వాటిని కొన్ని మిల్లుల్లో పాలిష్ చేసి వివిధ రకాల బ్రాండ్ల పేరుతో

>>2

## రూల్స్ ఫాలో అవ్వడం కాదు..

# సెట్ చేయాలి

### గ్లోబల్ సౌత్ బలమైన వాణికి వేదిక బ్రిక్స్


బ్రిక్స్ సభ్యదేశాధినేతల గ్రూప్ ఫొటో

### సమ్మిళిత ఆర్థికవృద్ధికి బ్రిక్స్‌దేశాల పరస్పర సహకారమే ప్రధానం

### బ్రిక్స్ ముగింపు సభలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని బలంగా వినిపిస్తున్నామని, అందుకే ఆ దేశాలకు ఈ కూటమిపై విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ బలానికి మూలమని ఆయన ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. రూల్స్ ఫాలో కావడం కాదని, రూల్స్ మనమే సెట్‌చేయాలని ప్రధాని

>>2





బ్రిక్స్ సదస్సుపై విదేశీ మీడియా ప్రశంసలు
2


## కాంగ్రెస్‌ను వీడం

### పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి: కొండా మురళి



**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. పదవులు

>>2

### హైదరాబాద్ -విజయవాడ హైవే ఆరు వరుసల విస్తరణకు

## భూసేకరణ

### నోటిఫికేషన్‌తో వేగం పెంచిన కేంద్రం



**హైదరాబాద్,సెప్టెంబరు13,ప్రభాతవార్త:** హైదరాబాద్ -విజయవాడ మధ్య కీలక రహదారిగా

>>2

## విస్తారంగా వర్షాలు

### అత్యధికంగా మహబూబాబాద్‌లో 19.13 సెం. మీ వర్షపాతం


### రోజుకు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి బ్రేక్



**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాయువ్య, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన

>>2


NPCI ALWAYS FORWARD
भारतीय राष्ट्रीय भुगतान निगम
NATIONAL PAYMENTS CORPORATION OF INDIA
Bharat Connect




మీకు తెలంగాణ విద్యుత్ బిల్లు వచ్చిందా?
మీకు ఇష్టమైన యాప్‌ను ఓపెన్ చేసి,
కేవలం కొన్ని క్లిక్స్‌లోనే బిల్లు చెల్లించండి.

సులభం • వేగం • సురక్షితం

It's super easy. **Done in 2 minutes.**

**Open** Any of your favourite app
**Select** Bills & Recharges
**Choose** Your Biller
**Pay** Using your preferred payment mode
**Anthe!**

Pay electricity bill through your trusted app.

amazon pay | CRED | HDFC BANK | ICICI Bank | Paytm | PhonePe

*T&C Apply



న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సరదా సంభాషణ దృశ్యం

# బ్రిక్స్ సదస్సుపై విదేశీ మీడియా ప్రశంసలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో సభ్య దేశాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి, ఒక బలమైన ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక దౌత్య విజయం సాధించారు. భారత్ చొరవతో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు విజయవంతంగా ముగిసింది. సదస్సులో 10 పూర్తిస్థాయి సభ్య దేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా పాల్గొంది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా సంయుక్త తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ తీర్మానంలో ఏ దేశం పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు పాల్పడవద్దని పిలుపునిచ్చాయి. పౌర మౌలిక సదుపాయాలు, అణు కేంద్రాలపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు జపాన్ టైమ్స్ తన కథనంలో హైలైట్ చేసింది. ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన ప్రవాహానికి అంతరాయం కలగకుండా చూసేందుకు సమష్టి కృషి అవసరమని ఈ ప్రకటన నొక్కి చెప్పిందని అల్ జజీరా పేర్కొంది. సదస్సు ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోడీ, బ్రిక్స్ కూటమికి రాబోయే 20 ఏళ్లకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక విజన్‌తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తీసుకున్న నిర్ణయాల అమలుకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ నివేదించింది. గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ ప్రపంచ వేదికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి అభిప్రాయాలను ఒకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. ఎవరితోనూ ఘర్షణ ద్వారా కాకుండా, అందరినీ కలుపుకొని అభివృద్ధిని కోరుకుంటున్నాం" అని మోడీ అన్నారు. మరోవైపు, బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ కూడా ఈ సదస్సులో కీలక పాత్ర పోషించింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక, సాంకేతికత, అభివృద్ధి సవాళ్లపై వ్యాపార ప్రముఖులు, మంత్రులు, దేశాధినేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు యురేషియా రివ్యూ నివేదించింది. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ప్రమాణాల సహకారం వంటి అంశాలపై ఈ ఫోరమ్ సిఫార్సులు సదస్సు ప్రకటనలలో ప్రతిబింబిస్తాయి. ప్రముఖ అమెరికన్ వార్తాపత్రికలు సైతం ఈ సదస్సును మారుతున్న ప్రపంచ క్రమానికి ఒక సూచికగా అభివర్ణించాయి.

# విస్తారంగా వర్షాలు

>> ప్రభావంతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా మహబూబాబాద్‌లోని కేశముద్రంలో 19.13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే మంచిర్యాల, యాదాద్రి, భువనగిరి, వరంగల్, జనగాం, నల్గొండ జిల్లాల్లో కూడా భారీ వర్షపాతం నమోదవ్వగా, హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. కొన్ని మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో, ఆ మండలాలు అతి భారీ వర్షపాతం కేటగిరీలో నిలిచాయి. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో 9.35 సెంటీమీటర్లు, ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెంటీమీటర్లు వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ గణాంకాలు వెల్లడించాయి. అలాగే వరంగల్ జిల్లా రాయపర్తిలో 9.55 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వర్ధన్నపేటలోనూ దాదాపు 8.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీమ్ ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. మరోవైపు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

**వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**

రామగుండం తదితర ప్రాంతాల్లోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులలో విస్తృతంగా వర్షాలు కురుస్తుండటంతో గనుల్లో బొగ్గు తీత పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. సింగరేణికి చెందిన రామగుండం, భూపాలపల్లి తదితర ప్రాంతంలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులలో వర్షాలతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు రోజుకు 50 వేల టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తికి నిలిచిపోయింది. ప్రాజెక్టులలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రోడ్లన్నీ పూర్తిగా బురదమయంగా మారిపోయాయి. దీనివల్ల గనుల్లో ఉపయోగించే భారీ యంత్రాలు, ఎక్స్‌కవేటర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయి కదల్లేని పరిస్థితి నెలకొంది. అయితే ప్రస్తుతానికి గనుల్లో ముందుగా నిల్వ ఉన్న బొగ్గును మాత్రం రామగుండంలోని ఎన్టీపీసీ విద్యుత్ పరిశ్రమకు నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే అలాగే మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కల్యాణిఖని ఓసీపీ, శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ, ఇందారం ఓసీపీల్లో సుమారు 30 వేల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, 2 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ వెలికితీతకు అంతరాయం ఏర్పడింది. గనుల యార్డుల్లోకి చేరిన వర్షపు నీటిని పంపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. వర్షం పూర్తిగా తగ్గితే కానీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం లేదని ఆఫీసర్లు చెబుతున్నారు. ఇక భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 2, 3, మంచిర్యాల జిల్లా పరిధిలోని మూడు ఓపెన్ కాస్ట్ గనుల్లోకి నీరు చేరింది. దీంతో బొగ్గు ఉత్పత్తితో పాటు ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు నిలిచిపోగా, డోజర్లు డంపింగ్ యార్డులకే పరిమితమయ్యాయి. వర్షం కారణంగా కేటీకే 1 గనిలో 4,500 టన్నులు, కేటీకే 2 గనిలో 5,500 టన్నుల ఉత్పత్తికి బ్రేక్ పడింది. ఈ రెండు గనుల్లో 10 వేల టన్నుల ఉత్పత్తి నిలిచిపోవడంతో సుమారు రూ. 40 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఆఫీసర్లు అంచనా వేశారు.

## వారం - వర్జ్యం

**14-09-2026, సోమవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,**
తి.తదియ ఉ.7.08, న.చిత్త మ.1.59
వ.రా.7.55 - రా.9.36
దు.మ.12.27 - మ.1.16
2) మ.2.55 - మ.3.43
రాహు ఉ.7.30-ఉ.9.00.
శుభ స. ఉ.6.00-ఉ.7.00

## వార్తాఫలం

**మేషం :** చాలా వరకు మీ అంచనాలకు అనుగుణంగానే నేడు కాలం గడుస్తుంది. వస్తువులను కొనుగోలు చేస్తారు.

**వృషభం :** ఉల్లాస భరితంగా కాలం గడుపుతారు. కష్టించి పనిచేసే తత్త్వం వలన లాభపడతారు.

**మిథునం :** మీ పరోక్షంలో మీపై నేరారోపణలు చేస్తున్న వారిని గుర్తించగలుగుతారు. స్వల్ప ధనలాభ సూచన.

**కర్కాటకం :** గృహోపకరణ వస్తువులను కొనుగోలు చేస్తారు. కాంట్రాక్టుదారులకు లాభసాటిగా ఉంటుంది.

**సింహం :** ప్రశాంతత కలిగి ఉంటారు. వాయిదా వేయకుండా పనులను సానుకూల పరచుకోవడం చెప్పదగినది.

**కన్య :** సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ధను కనబరచవలసి ఉంటుంది. రాయబారాలు సాగిస్తారు

**తుల :** రహస్య సంప్రదింపులు జరుపుతారు. ముఖ్యమైన అగ్రిమెంట్లలోని కీలకమైన లోపాలు మీ దృష్టికి వస్తాయి.

**వృశ్చికం :** క్రమబద్ధమైన ప్రణాళికలను రూపొందించుకుంటారు. ద్రవ పదార్థాలను అధికంగా స్వీకరిస్తారు.

**ధనుస్సు :** ఆత్మీయ వర్గానికి సహాయ పడతారు. ఉన్నత విద్యాభ్యాసానికి మార్గాలు సుగమం అవుతాయి.

**మకరం :** ఇరువర్గాల మధ్యలో సయోధ్యను కుదర్చగలుగుతారు. ప్రశాంతత కలిగి ఉంటారు. దైవదర్శనం చేసుకుంటారు.

**కుంభం :** ఆర్థికంగా చెప్పుకో దగిన ఇబ్బందులు చోటు చేసుకోవు. సంగీత సాహిత్యాలపట్ల శ్రద్ధను కనబరుస్తారు.

**మీనం :** కఠినమైన మనస్తత్వం కలిగిన వారితో కలిసి పనిచేయవలసి వస్తుంది. హాస్య ప్రియత్వం కలిగి ఉంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

**15-09-2026, మంగళవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,**
తి.చవితి ఉ.7.45, న.స్వాతి మ.3.24
వ.రా.9.29 - రా.11.13
దు.ఉ.8.22 - ఉ.9.11
2) రా.11.03 - రా.11.52
రాహు మ.3.00-4.30
శుభ స. ఉ.7.55-ఉ.8.15

## వార్తాఫలం

**మేషం :** ఉపాధి మార్గాలు కలిసి వస్తాయి సహోదరీ వర్గం పట్ల మంచి అభిమానం కలిగి ఉంటారు.

**వృషభం :** ఉన్నత విద్యాభ్యాసానికి మార్గాలు సుగమం అవుతాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడుపుతారు.

**మిథునం :** రాజకీయ, వ్యాపార రంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. సంగీత సాహిత్యాలపట్ల శ్రద్ధను కనబరుస్తారు.

**కర్కాటకం :** ఒకానొక విషయంలో మీది కేవలం భ్రాంతేనని తేలిపోతుంది. మీ కోరిక నేడు నెరవేరే సూచనలున్నాయి.

**సింహం :** ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించి విషయాలను అవగతం చేసుకోవడం మంచిది. దైవదర్శనం చేసుకుంటారు.

**కన్య :** మంచి ఆశయంతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడుపుతారు.

**తుల :** విదేశీయాన వ్యవహారాలు సానుకూల పడతాయి. కీలక వ్యవహారాలలో ఏర్పడిన ప్రతిబంధకాలు తొలగిపోతాయి.

**వృశ్చికం :** హాస్య ప్రియత్వం కలిగి ఉంటారు. చతుర సంభాషణలు సాగిస్తారు. స్నేహితులకు అండదండలుగా ఉంటారు.

**ధనుస్సు :** సంతాన పురోభివృద్ధి మనసు సంతోషానికి కారణం అవుతుంది. అగ్రిమెంట్స్ వాయిదా పడతాయి. శుభవార్తా శ్రవణం.

**మకరం :** పరోపకార బుద్ధి కలిగి ఉండటం వలన మీ ఔన్నత్యం మరింతగా పెంపొందుతుంది. ఆరోగ్యపరంగా జాగ్రత్తలు అవసరం.

**కుంభం :** చిన్నచిన్న విషయాలు తరచుగా మరచిపోతారు. ఆధ్యాత్మిక సంబంధ మైన కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం :** ఆలోచనలలో స్పష్టత ఏర్పడుతుంది. అలంకార సంబంధమైన వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం బ్రిక్స్ దేశాధినేతల గ్రూప్ ఫొటో

# రూల్స్ ఫాలో అవ్వడం కాదు.. సెట్ చేయాలి

>> పిలుపునిచ్చారు. పాటించడం పక్కనపెట్టి నిబంధనలు రూపొందించేస్థాయిలో మనం కొనసాగాలని అన్నారు. ఈ కూటమిలో గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలు, అనుభవాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నందునే వాటి నమ్మకాన్ని చూరగొన్నామని తెలిపారు. నా వ్యక్తిగత అనుభవం నుంచి చెబుతున్నాను, బ్రిక్స్ పట్ల గ్లోబల్ సౌత్ దేశాల విశ్వాసం పెరిగింది. ఎందుకంటే వారి గొంతు ఇక్కడ వినిపిస్తుంది, వారి అనుభవాలను గౌరవిస్తాం. పరిష్కారాలను కేవలం వారి కోసం మాత్రమే కాకుండా, వారితో కలిసి రూపొందిస్తాం. మా భిన్నత్వం, సహకారమే బ్రిక్స్ అసలైన బలం" అని ప్రధాని మోడీ వివరించారు. ఈ వేదికపై విభిన్న దేశాల మధ్య సహకారం ప్రపంచ పురోగతికి, మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ప్రాముఖ్యతను ప్రధాని నొక్కిచెప్పారు. భారతీయ నాగరికతలో ప్రకృతికి తల్లి స్థానం ఇచ్చాం. శతాబ్దాలుగా, అభివృద్ధి, పర్యావరణం అనేవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలు అనే బలమైన నమ్మకం మాది అని మోడీ అన్నారు. భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతను గుర్తిస్తూ మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను పాటించడంపై బ్రిక్స్ దృష్టి సారించిందని తెలిపారు. బ్రిక్స్ ఫ్రేమ్‌వర్క్‌లో చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించారు. "స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను మరింత విశ్వసనీయంగా, సమర్థవంతంగా, అందుబాటులోకి తెచ్చేందుకు స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వల కోసం బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అదేవిధంగా, వ్యవసాయం, వాతావరణ మార్పుల అనుసరణ, పర్యావరణ సుస్థిరత వంటి రంగాల్లో సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో అనుసంధానించడం ఎంతో ముఖ్యమని అన్నారు. "వ్యవసాయ పర్యావరణం, పునరుత్పాదక వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో కలుపుతాయి" అని పేర్కొన్నారు. మనమంతా విభిన్న వాస్తవికతలతో ముడిపడి ఉండవచ్చు, కానీ సహకారంతో కలిసికట్టుగా ఎదుగుతాం, మానవాళి కోసం వికసిస్తామన్నారు. బ్రిక్స్ స్టార్టప్ ఇన్నొవేషన్‌ఫండ్ ఏర్పాటుచేయాలని ప్రధాని ప్రతిపాదించారు. సాంకేతికతను, సంక్లిష్ట ఖనిజాలనుచూపి బెదిరింపులకు పాల్పడటాన్ని వ్యతిరేకించాలని చైనానుద్దేశించేపరోక్షంగా ప్రస్తావించారు. ప్రత్యేక స్టార్టప్ నిధులు ఉంటే బ్రిక్స్ దేశాల్లోని పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు ఆవిష్కర్తలమధ్య పరస్పర సహకారం మరింతపెరుగుతుందని సూచించారు. ప్రపంచంలోని అరుదైన ఖనిజాల్లో సుమారు 90శాతం చైనాయే శుద్ధిచేస్తోంది. సోలార్ ప్యానెళ్లనుంచి స్మార్ట్‌ఫోన్లవరకూ అన్నింటిలోనూ వీటిని ఉపయోగిస్తారు. కఠినచర్యలు వృద్ధికి అవరోధాలుగా నిలుస్తాయని చెప్పినమోడీ మన భిన్నత్వమే మన గుర్తింపుగా, మన సహకారమే మన స్ఫూర్తిగా నిలవాలి. మన పురోగతి సమస్త మానవాళికి సేవ చేయాలి అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

**బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం కీలక: ప్రధాని మోడీ**

ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి, సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమనిప్రధాని నరేంద్రమోడీ నొక్కి చెప్పారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీమాట్లాడుతూ సదస్సుకు హాజరైన సభ్య దేశాల అధినేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో, ఆ దేశానికి ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. పపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఘర్షణల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికత, కీలకమైన ఖనిజాలను కొన్ని శక్తులు ఆయుధాలుగా మార్చుకోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, ప్రపంచం ఈ కూటమి నుంచి కేవలం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ఉపయోగకరమైన ఫలితాలను ఆశిస్తోందని మోడీ స్పష్టం చేశారు.

ఈ సదస్సులో ఆమోదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కూటమి భవిష్యత్ దార్శనికతకు, పరస్పర సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్‌సిసి, ఇథియోపియా ప్రధాని అబీయ్ అహ్మద్ అలీ, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి పలువురు దేశాధినేతలు పాల్గొన్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.



గణేశ్ చతుర్థి సందర్భంగా బెంగళూరులో ఆదివారం పర్యావరణ అనుకూల గణేశ విగ్రహాలతో మహిళలు

# తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా సాముల రామ్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 13:** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కొత్త కార్యవర్గం ఎన్నికైంది. చైర్మన్‌గా సాముల రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా చలకాని వెంకట్ యాదవ్ ఎన్నికయ్యారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా జి.కిరణ్ కుమార్ ఎన్నికైనట్లు బార్ కౌన్సిల్ కార్యదర్శి వి.నాగలక్ష్మి వెల్లడించారు. ఆదివారం హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాగా, దాదాపు రెండు దశాబ్దాలుగా అధ్యక్షుడిగా ఉన్న ఎ. నర్సింహారెడ్డి స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు 8ఏళ్ల తర్వాత తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలయ్యాయి. బార్ కౌన్సిల్ సభ్యులుగా రామ్‌రెడ్డి, కిరణ్‌కుమార్ మొదటిసారి ఎన్నికయ్యారు. వెంకట్ యాదవ్ కౌన్సిల్ సభ్యులుగా రెండోసారి ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర బార్‌కౌన్సిల్ ఎన్నికలు ఈ ఏడాది జనవరిలో ఎంతో ఉద్రిక్తంగా జరిగాయి. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 24 వరకు జరిగాయి. మార్చి 26న 23 అడ్వకేట్లు బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైనట్లుగా ప్రకటించారు.



నిబంధనల ప్రకారం ఆగస్టులో ఇద్దరు అడ్వకేట్లను బార్ కౌన్సిల్ సభ్యులుగా కోఆప్ట్ చేసుకున్నారు. 2018లో బార్ కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి, ఈసారి ఎన్నికలకు అత్యంత పోటీ ఏర్పడింది. 205కు పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు.

# కాంగ్రెస్‌ను వీడం

>> వస్తుంటాయని, పోతుంటాయని.. కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వరంగల్ లో ముఖ్య నాయకులతో, అనుచరులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కొండా దంపతులు కలిసి మాట్లాడారు. వరంగల్ కాంగ్రెస్ లో కొండా జోష్ నింపి వారికి దిశా నిర్దేశం చేసారు. రాబోయే కాలం మనదే అని వారిని ఉత్సాహపరిచారు. తమలో కృతజ్ఞత భావం రక్తంలోనే ఉందని, రాజకీయాల్లో ఎలా బతికామన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. తుపాకీ బుల్లెట్లు ఉన్నప్పటికీ తాను ఇంకా బతికే ఉన్నానని కొండా మురళి వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా కష్టాల నుంచి వచ్చిన వారేనని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలను గుర్తించి వారికి టికెట్లు అందిస్తామని కొండా మురళి తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతో తమకు ఉన్న అనుబంధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తెంచుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

# పాలిష్ కొట్టు బ్రాండ్ పేరు పెట్టు

>> ముద్రించిన సంచుల్లో నింపి మార్కెట్లకు తరలిస్తున్నారు. తనిఖీలు, నియంత్రణ లేకపోవటంతో మిల్లర్ల జేబులు నిండుతుండగా వినియోగదారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. తెలంగాణలో రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ ప్రస్తుతం మార్కెట్లో సన్న బియ్యం ధర రోజు రోజుకు పెరుగుతూ రూ.80కి పైగా చేరింది. బియ్యం వద్దంటే లబ్ధిదారులు వేలిముద్ర వేస్తే చాలు కిలోకి రూ.18 చొప్పున ఇస్తామనీ రేషన్ దుకాణాల డీలర్లు ప్రలోభాలకు గురిచేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో అందిస్తున్న సన్న బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటికి సింగిల్ పాలిష్ చేసి వివిధ బ్రాండ్ల పేరిట విక్రయిస్తున్నారు. సిరిసిల్ల పట్టణం రగుడులో కనకదుర్గ రైస్ మిల్లులో సెప్టెంబరు 9న పౌర సరఫరాల శాఖ దాడుల్లో 458 క్వింటాళ్ల బియ్యం గుర్తించారు. అప్పటికే అక్కడి నుంచి కొన్ని క్వింటాళ్ల బియ్యం కరీంనగర్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాకు తరలించినట్లు గుర్తించారు. గతంలోనూ వేములవాడ పట్టణ శివారులోని రైస్ మిల్లులో 500 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. మిర్యాలగూడలో ఇటీవల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి బ్రాండ్ ముద్రించిన బస్తాల్లో నింపుతుండగా పోలీసులు దాడులు చేసి 21 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసుపెట్టారు. వరంగల్, పెద్దపల్లి సుల్తానాబాద్, మిర్యాలగూడ, హుజురాబాద్, వనపర్తి , ములుగు, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేట, సూర్యాపేట తదితర అనేక కేంద్రాల్లో కొన్ని రైసుమిల్లులు రేషన్ బియ్యం పెద్ద ఎత్తున కొనుగోలు చేసి ఇదే దందా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యం దందా కోసమే ప్రత్యేకంగా రైసు మిల్లులు ఏర్పాటు చేశారనే అనుమానాలు ఇటీవల రేషన్ బియ్యం రవాణా చేస్తు పట్టుబడుతున్న నిందింతులు నిఘా బృందాలకు ఇచ్చే సమాచారంతో బలపడుతున్నాయి. రేషన్ బియ్యం దందాలో దళారులు, మిల్లర్లతో పాటు రేషన్ దుకాణాల డీలర్లు, ఎంఎల్ఎస్ పాయింట్స్ నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు కూడా పాలుపంచు కొంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీసులు 31 టన్నుల రేషన్ బియ్యాన్ని ఇటీవల పట్టుకొని ఆరా తీస్తే మిర్యాలగూడకు తరలిస్తున్నామని పట్టుబడినవారు తెలపడంతో కేసులు నమోదు చేశారు. రేషన్ దుకాణాల్లోని సన్న బియ్యానికి సింగిల్ పాలిష్ చేసి ప్రముఖ బ్రాండ్ల బస్తాల్లో నింపి ప్యాకింగ్ చేసి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యం కిలోకు రూ.15 నుంచి 18 వరకు లబ్దిదారునికి చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. రంగురంగుల ఆకర్షణీయ బస్తాల్లో నింపిన తరువాత ఫ్రీ బియ్యం విలువ అమాంతంగా రూ.70 నుంచి 80 రూపాయలకు పెంచి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం ధరలు పదేళ్ల వ్యవధిలో ఎన్నడూ లేని విధంగా పెరగడంతో రేషన్ బియ్యం సింగిల్ పాలిష్ చేసి సులభంగా సొమ్ము చేసుకొంటున్నారు. క్వింటా బియ్యం ధర నాలుగు నెలల కిందట రూ.5 వేల లోపు ఉండగా ప్రస్తుతం రూ.7,200 వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో మిల్లర్లు, వ్యాపారులు అక్రమ దందాకు తెరలేపారు. పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్నబియ్యం కింద బహిరంగ మార్కెట్లోకి తరలించి అమ్మేస్తున్నారు. ఈ సారి వరిసాగు సైతం ఆశించిన మేరలేదు. దీంతో దిగుబడులు తగ్గడం, వ్యాపారుల కృత్రిమ కొరత తదితరాలతో బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సూపర్ఫైన్ క్వాలిటీ రకం పేరిట రూ.72 వరకు కిలో సన్నబియ్యం విక్రయిస్తున్నారు. ఇక ఎలాంటి అనుమతి లేని ఇష్టమొచ్చిన బ్రాండ్ల పేరును సంచులపై ముద్రించి అమ్ముతున్నా పరిశీలించే అధికార యంత్రాంగం కరవైంది. దేశవ్యాప్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఐరన్, పోలిక్ ఆసిడ్ విటమన్ బి12వంటి సూక్ష్మపోషకాలతో ఫోర్టిఫైడ్ రైస్ లబ్దిదారులకు అందించేవారు. వ్యాపార వర్గాల ఒత్తిడి మేరకు కేంద్ర పౌరసరఫరాలశాఖ ఫోర్టిఫైడ్‌రైస్ సరఫరా చేయడం నిలిపివేసిందని ప్రచారం జరుగుతోంది. ఫోర్టిఫైడ్ రైస్ కలపడం వల్ల పిడిఎస్‌రైస్‌గా సులభంగా గుర్తిస్తారని ఇథనాల్, బీర్లు, ఇతర వినియోగం కోసం బడా పారిశ్రామికవేత్తలు కొనుగోలు చేయడానికి జంకేవారు. మధ్యప్రదేశ్ చత్తీస్‌ఘడ్ ,మహారాష్ట్రాలో అనేక పారిశ్రామిక వేత్త ఒత్తిడి మేరకు కేంద్రం వెనక్కి తగ్గడంతో తెలంగాణలో కూడా సన్నబియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కలపడంలేదు. రేషన్ బియ్యం దందాపై గతంలో పోలీసులు, విజిలెన్స్ సంస్థలు నిఘా ఏర్పాటు చేసి. పలువురు అక్రమార్కులపై పిడి యాక్టులు, రౌడీ షీట్లు సైతం తెరిచారు. దీంతో కొంత మేర వారి ఆగడాలు తగ్గాయి. అయితే సన్న బియ్యం పంపిణీ జరుగుతుండటంతో వినియోగదారులు సైతం విక్రయించారని భావించారు. మూడు నెలల బియ్యం ఒకే సారి పంపిణీ చేస్తుండటంతో అక్రమార్కులకు కలిసి వస్తోంది. ఇలా సేకరించిన బియ్యాన్ని వ్యాపారులకు, హోటళ్లు, కోళ్లఫారాల నిర్వాహకులకు, రైస్ మిల్లర్లకు టోకుగా అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారుడికి ప్రభుత్వానికి చెవిలో పువ్వులు పెడుతూ రంగురంగుల బస్తాల్లో ఆకర్షణీయంగా నిండిన సన్నబియ్యం ధరలకు రెక్కలొచ్చాయి.

## ఆరు వరుసల విస్తరణకు భూసేకరణ

>> ఉన్న ఎన్‌హెచ్65ను ఆరు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయడానికి కీలకమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా నల్గొండ జిల్లాలోని ఒక కీలక సెక్షన్‌కు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది.

జాతీయ రహదారుల చట్టం1956లోని సెక్షన్ 3ఏ(1) కింద ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. నల్గొండ జిల్లాలో 62.20 నుంచి 126.800 కిలో మీటర్ వరకు రహదారి విస్తరణకు భూములు సేకరించను న్నారు. చిట్యాల, నార్కెట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల్లోనివెలిమినేడు, వట్టిమర్తి, చిట్యాల, నార్కెట్‌పల్లి, యల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు, పామనగుండ్ల, దుగ్నేవల్లి, అయిటిపాముల, చందంపల్లి, నకిరేకల్, కొర్లపహాడ్, ఇనుపాముల తదితర పదమూడు గ్రామాల్లో 70 సర్వే నంబర్ల పరిధిలో 6.32 హెక్టార్ల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. భూసేకరణకు సంబంధించి భూ యజమానులు, ఇతర హక్కుదారులకు అభ్యంతరాలు ఉంటే నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లో ఆర్‌డీవోకు తెలియజేయవచ్చు. పరిశీలన అనంతరం తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు.

# రోశయ్య దూరదృష్టి వల్లే మిగులు బడ్జెట్

## ఆర్యవైశ్యులకు ఆత్మగౌరవం ఎక్కువ
## ఐక్యంగా మీ వాటా సాధించుకోవాలి
## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ (ఉప్పల్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త: మాజీ సీఎం రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, ప్రకాష్ గౌడ్, మల్ రెడ్డి రంగా రెడ్డి, నవీన్ యాదవ్, డి. సూర్యనారాయణ గుప్త, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, మాజీ ఎంపీ మధు యాష్కీ, బొల్లెటి దామోదర్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, సుధీర్‌రెడ్డి, ఉప్పల్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్, ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణగుప్తా, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్య ఇచ్చారు. ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారని.. పేదరికం ఉన్నా కడుపులో దాచుకుంటారని కొనియాడారు. గతంలో సీఎంలు ఎంత మంది మారినా ఆర్థికమంత్రిగా రోశయ్యనే ఉండేవారని, సుదీర్ఘకాలం నేను రాజకీయాల్లో రాణిస్తానని ఆయన గుర్తించారు. అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడుతుంటే ఆవేశం తగ్గించుకోవాలని చెప్పేవారని, ఆవేశానికి ఆలోచన తోడయితే.. భవిష్యత్ ఉంటుందని సలహా ఇచ్చారు. రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారు. కానీ, దూషించరు. హైదరాబాద్ తోనే నా అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య ఎప్పుడూ చెప్పేవారు. అందుకే ఆయన విగ్రహం హైదరాబాద్‌లో ఉండాలని నిర్ణయించామని సీఎం స్పష్టం చేశారు. ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారు. ఆర్థిక లావాదేవీల్లో సలహాల కోసం వారినే అడుగుతారు. ఆర్యవైశ్యులంతా కలిసికట్టుగా ఉండి రాజకీయాల్లో మీ వాటా సాధించుకోవాలి అని సీఎం అన్నారు. మాజీ శ్రీమంతులకే కాదు, పేద ఆర్యవైశ్యుల బిడ్డలకు కూడా ఈ భవనం ఉపయోగపడాలన్నారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం భవిష్యత్ తరాలకు పునాదులు వేయాలని ఆకాంక్షి ంచారు. భవన నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సీఎం హామీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ కేబినెట్‌లో గల్లాపెట్టె నిర్వహణ బాధ్యతను ఆర్యవైశ్యులకే ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోయినా రోశయ్య గౌరవాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ నడిబొడ్డున ఆయన విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. ఆర్యవైశ్యులను వివిధ ప్రాంతాల్లో రకరకాల పేర్లతో పిలుస్తారు. ప్రపంచ స్థాయి నాయకుడు ఒకే ఒక్కరు మహాత్మా గాంధీ.. ప్రపంచంలో ఏ దేశం పోయినా మహాత్మా గాంధీ గొప్పతనం తెలియని వారు ఉండరని తెలిపారు. పొట్టి శ్రీరాములు పోరాటం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది..దేశ సమగ్రత కోసం మహాత్మాగాంధీ ప్రాణాలు ఇస్తే, పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఆర్య వైశ్యులకు రావాల్సిన గుర్తింపు రాలేదని, ఆర్యవైశ్యుల పట్ల మా ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు.పేద ఆర్యవైశ్య బిడ్డలకు ఆత్మగౌరవ భవనం సంపూర్ణంగా ఉపయోగ పడాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణం కోసం సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యులందరూ కలిసి ఉంటేనే మీకు బలం. సమైక్యంగా ఎన్నికలపై నడిస్తే అందరూ గౌరవిస్తారని స్పష్టం చేశారు. ఆర్యవైశ్యులకు ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చామని, కొడంగల్‌లో ఒక మున్సిపాలిటీలో ఆర్యవైశ్య కులానికి చైర్మన్ పదవి ఇచ్చామని గుర్తు చేశారు. రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోవాలి.. కలిసి కట్టుగా ఉన్నప్పుడు ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి టిజి వెంకటేష్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి గట్టిగా ఉంటే కొండరు జైలుకు వెళ్లే వారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉప్పల్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

## ఆయుధాల చోరీ కేసు..
## మల్లేశ్ కస్టడీకి కోర్టు అనుమతి

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: బొల్లారం మద్రాస్ రెజిమెంట్‌లో జరిగిన ఆయుధాల చోరీ కేసులో నిందితుడు, మాజీ ఆర్మీ అధికారి మల్లేశ్‌కు రెండు రోజుల కస్టడీకి మల్కాజ్‌గిరి కోర్టు అనుమతించింది. దీంతో మంగళ వారం నిందితుడిని పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. కేసులో నిందితుడి పాత్ర, ఘటనకు దారితీసిన పరిస్థితులు, అతడితో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల వివరాలపై పోలీసులు ఆరా తీయనున్నారు. ఇప్పటికే దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా మల్లేష్‌ను ప్రశ్నించి, మరిన్ని కీలక విషయాలను రాబట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. కస్టడీ సమయంలో నిందితుడి నుంచి పూర్తి సమాచారం సేకరించి దర్యాప్తును మరింత ముందుకు తీసుకెళ్లాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో మల్లేశ్‌కు ఎవరెవరు సహకరించారు, వీరిద్దరూ కుట్ర ఉందా, గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డాడా అనే కోణాల్లోనూ పోలీసులు విచారణ జరిపే అవకాశం ఉంది. నిందితుడి వెనుక ఎవరైనా ముఠా ఉందా అనే విషయంపై కూడా దృష్టి సారించనున్నారు. కస్టడీ విచారణ పూర్తయిన అనంతరం మల్లేశ్ అలియాస్ రాజును తిరిగి కోర్టులో హాజరుపరచనున్నారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న దళిత నేతలు

## కుల వివక్షపై సుమోటాగా కేసులు
## నమోదు చేయాలి: ఎంపి మల్లు రవి

హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త: కుల వివక్ష ఘటనలపై పోలీసులు సుమోటాగా కేసులు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే తాత మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన మల్లు రవి మాట్లాడుతూ దళితులపై వివక్ష, అవమానాలను సహించబోమని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయ పరిరక్షణకు ఎస్సీ ఎస్టీ ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, ఎస్సీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, చట్టసభల్లో టీలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా జిల్లాల వారీగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి దయాకర్, వేముల వీరేశం, నాగరాజు, వారణాసీపాల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల ఉల్లంఘనకు పాల్పడితే సహించం
## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: సిబ్బంది నియామకాలు, పదోన్నతులలో రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ల నిబంధనలను విధిగా అమలు చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల అమలులో ఎలాంటి ఉల్లంఘనను సహించబోమని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) నియామకాలను సమీక్షించారు. ఈ సందర్భంగా వెంకటయ్య, యాజమాన్యంతో పాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన అనంతరం, వెంకటయ్య బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకాలను ఎలాంటి జాప్యం లేకుండా చేపట్టాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కల్పించిన హక్కులను యాజమాన్యం కచ్చితంగా అమలు చేసేలా చూడాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరించాలని బీహెచ్ఈఎల్ యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వరరావు, టి. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపిసిలో తెలంగాణ ప్లాంట్ స్టేజ్2 నిర్మాణానికి శ్రీకారం

## భూమి పూజ చేసిన ఎన్టీపిసి ఇడి చందన్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: రామగుండం ఎన్టీపీసీలో తెలంగాణ ప్లాంట్ స్టేజ్-2 నిర్మాణం పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత భూమి పూజ చేసి ప్రధాన ప్లాంట్ ఏరియాలో సైట్ లెవలింగ్ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ బాధ్యతలను ప్రధానంగా మెయిన్ ప్లాంట్ (బాయిలర్, టర్బైన్, జనరేటర్ (బీటీజీ) పనుల కాంట్రాక్టును భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) సంస్థ దక్కించుకున్నట్లు ఎన్టీపీసీ అధికారవర్గాలు వెల్లడించాయి. తెలంగాణ ప్లాంట్‌స్టేజ్-2లో ఒక్కో యూనిట్ 800 మెగావాట్లతో మూడు యూనిట్లకు సంబంధించిన టర్బైన్, బాయిలర్, జనరేటర్ బీహెచ్ఈఎల్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.13,500 కోట్లతో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు ఉత్పత్తి సామర్థ్యం స్టేజ్-2 కింద ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యంతో మొత్తం మూడు యూనిట్లను 2400 మెగావాట్ల మేర సామర్థ్యంతో నిర్మించనున్నారు. ఈ పనులను 300 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం రామగుండం ఎన్టీపీసీలో తెలంగాణ ప్లాంట్ స్టేజ్ 1 కింద ఇప్పటికే 800 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లలో రెండేండ్లుగా విద్యుత్‌ఉత్పత్తి జరుగుతోంది. రామగుండం ప్లాంట్లో ఇప్పటికే ఏడు యూనిట్ల ద్వారా 2,600 మెగావాట్ల విద్యుత్, తెలంగాణ స్టేజ్1 ద్వారా 1,600 మెగావాట్ల విద్యుత్, రిజర్వాయర్లపై 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్, సర్వేస్ పై 10 మెగావాట్ల సోలార్ విద్యుత్ కలిపి మొత్తం 4,300 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. కాగా ప్రస్తుతం రామగుండం ఎన్టీపీసీ ద్వారా 4300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, ఈ స్టేజ్-2 పూర్తి అయితే మొత్తం సామర్థ్యం 6710 మెగావాట్లకు చేరుకుంటుంది, దీంతో ఇది దేశంలోనే అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌గా అవతరించనుంది.

# పటేల్ దృఢ సంకల్పం, అమరవీరుల త్యాగమే హైదరాబాద్ విముక్తి

## ఆపరేషన్ పోలో అమరవీరులకు బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు
## నివాళి, మాజీ సైనికులకు సన్మానం
## సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలి
## పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్రను చేర్చాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: భారతదేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన ఆపరేషన్ పోలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆత్మబలిదానాల వల్లే నేడు మనం భారత యూనియన్‌లో అంతర్భాగమై గర్వంగా జీవిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఆపరేషన్ పోలో ప్రారంభ దినోత్సవం (సెప్టెంబర్ 13) సందర్భంగా ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న చారిత్రక యుద్ధ ట్యాంక్ వద్ద తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించి, మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ, ట్యాంక్‌బండ్‌పై కొలువై ఉన్న యుద్ధ ట్యాంక్ తెలంగాణ ప్రజలకు ఒక నిరంతర స్ఫూర్తి కేంద్రమని కొనియాడారు. "ఒకవేళ ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ నిర్ణయం, కే.ఎం. మున్షీ గారి చొరవ, ఆపరేషన్ పోలో సైనిక చర్య లేకపోయి ఉంటే నేడు మనం మాస్కుల్ని హైదరాబాద్ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించడానికే భయ మేస్తుంది. దేశ సమగ్రతకు అడ్డంకిగా మారిన నిజాం శక్తులను అంత మొందించేందుకు 1948 సెప్టెంబర్ 13న పటేల్ గారు ఆపరేషన్ పోలోకు శ్రీకారం చుట్టారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ పోరాటంలో ఎంతోమంది సైనికులు ప్రాణాలర్పించి, సెప్టెంబర్ 17 నాటికి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించారని ఆయన గుర్తుచేశారు. సెప్టెంబరు 17వ తేదీ తెలంగాణ ప్రజలందరికీ అత్యంత పవిత్రమైన విమోచన దినోత్సవమని, ఈ రోజును ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా ఉద్యమి స్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి, మజ్లిస్ (ఎంఐఎం) పార్టీకి భయపడి వెనకడుగు వేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గాంధీ భవన్‌లో పార్టీ కార్యక్రమంగా జరుపుకుంటోందే తప్ప, ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో నిర్వహించకుండా బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. దీనిని పరుస్తోందని విమర్శించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం అమరవీరుల త్యాగాలను విస్మరించడం క్షమించరాని నేరమని ఆయన మండిపడ్డారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ స్వాతంత్ర్య పోరాట చరిత్ర, వందేమాతరం విలువలు తెలియ జేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పాఠశాల పాఠ్యపుస్తకాల్లో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన పోరాట చరిత్రను సమగ్రంగా పొందు పరచాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సైనికుల త్యాగాలను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దనున్న చారిత్రక యుద్ధ ట్యాంక్ వద్ద అమరవీరులకు నివాళి అర్పించిన బిజెపి రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు, లక్ష్మణ్ తదితరులు

# రూ.7,500 కోట్ల రుణానికి ఇండెంట్

## 16న తీసుకోనున్నట్లు రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదన
## 2026-27లో రూ.46,400 కోట్లకు చేరనున్న రుణాలు

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 కోట్ల మేర రుణాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. రిజర్వ్ బ్యాంక్ బహిరంగ మార్కెట్‌లో ఈ నెల 16న నిర్వహించే ఈవేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించనుంది. ఇందుకు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయనుంది. ఈ వేలంలో 7.53 శాతం వార్షిక వడ్డీ ప్రాతిపదికన 13ఏళ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్లు, 7.64 శాతం వార్షిక వడ్డీకి 18 ఏళ్ల కాల పరిమితితో రూ.2 వేల కోట్లు, 7.65 శాతం వార్షిక వడ్డీకి 23 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.2 వేల కోట్లు, 7.65 శాతం వార్షిక వడ్డీ కింద 29 ఏళ్ల కాల పరిమితితో ఇంకో రూ.2 వేల కోట్లు చొప్పున మొత్తం రూ.7,500 కోట్ల రుణాన్ని తీసుకోనుంది. సెప్టెంబర్ 16న ప్రతిపాదించిన రూ.7,500 కోట్లతో కలిపితే ప్రస్తుత 2026-27 లో ఇప్పటివరకు రిజర్వ్ బ్యాంక్ వేలాల ద్వారా రూ.38,900 కోట్ల మేర రుణం సేకరించింది. ఇందులో ఏప్రిల్‌లో రూ.6,900 కోట్లు, మే లో రూ.6 వేల కోట్లు, జూన్‌లో మరో రూ.6 వేల కోట్లు, జులైలో రూ.13,500 కోట్లు, ఆగస్టులో రూ.4,500 కోట్ల మేర అప్పు చేసింది. ఈ నెల 1వ తేదీన రూ.2 వేల కోట్లు, ఈ నెల 16న తీసుకోనున్న రూ.7,500 కోట్లతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి ఈ నెల 16 వరకూ రూ.46,400 కోట్లకు రుణాలు చేరుకున్నాయి. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నిర్దేశించిన రాష్ట్ర వార్షిక రుణ పరిమితి రూ.58,458.71 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6 నెలలు కాకుండానే రూ.46,400 కోట్ల రుణాన్ని సేకరించడంతో మిగిలిన 6 నెలల కాలానికి కేవలం దాదాపు రూ.12 వేల కోట్ల మేర తీసుకునే అవకాశం మాత్రమే ఉంటుందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

# చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే జీవిత లక్ష్యం

## రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య
## ఆర్. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని మోడీ



బిసి భవన్ వద్ద జరిగిన సభలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య జన్మదినం సందర్భంగా ఆదివారం పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ... 'పేద వర్గాల అభ్యున్నతి కోసం ఆర్. కృష్ణయ్య చేస్తున్న పోరాటం నిరంతరంగా కొనసాగాలని ఆకాంక్షి ంచారు. ఆ దిశగా ఆయన నిండు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. పలువురు ప్రముఖుల శుభాకాంక్షలపై ఆర్. కృష్ణయ్య స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. గత 50 సంవత్సరాలుగా నిరంతరం ఉద్యమిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం హాస్టళ్లు, గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలను సాధించుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను సాధించడమే తన జీవిత ధ్యేయ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రజలందరికీ
## వినాయకచవితి పర్వదిన శుభాకాంక్షలు
## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రం
## సుభిక్షంగా ఉండాలి: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే గణేశుని అనుగ్రహంతో రాష్ట్రం శాంతి, ఐక్యత, ప్రగతి, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆకాంక్షించారు. పవిత్రమైన వినాయక చవితి పర్వదిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గణేశుడిని విఘ్నవినాశకుడిగా, శుభప్రదుడిగా ఆరాధించడం భారతీయ సంస్కృతిలో విశిష్టమైన సంప్రదాయమని గవర్నర్ పేర్కొన్నారు. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణేశుడిని ప్రార్థించడం ద్వారా కార్యసిద్ధి కలుగుతుందని విశ్వసిస్తారని తెలిపారు. తెలంగాణ జాతిపాటు దేశ ఐక్యత, శాంతి, అభివృద్ధి, సౌభాగ్యానికి అడ్డుగా నిలిచే అన్ని విఘ్నాలను విఘ్నేశ్వరుడు తొలగించి, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సును ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వినాయకచవితి పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, సామరస్యం, సుఖసంతోషాలను నింపాలని గవర్నర్ ఆకాంక్షించారు.

## మండపాలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం
## ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ముఖ్యమంత్రి విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. వాడ వాడల వెలిసే గణేశ మండపాలలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని చెప్పారు.

## ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కెసిఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: వినాయక చవితి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి, విజయాలను అందించే దైవంగా, వినాయకుణ్ణి హిందూ సమాజం కొలుచుకుంటుందని అన్నారు. దైవ పూజలను,ధార్మిక క్రతువులు విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభించడం ద్వారా హిందూ సంప్రదాయాల్లో గణనాయకునికి తొలి ప్రాధాన్యతనిస్తామని కేసీఆర్ తెలిపారు. వాడ వాడలా మండపాలు ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజుల పాటు గణేశ్ నవరాత్రులు జరుపుకుంటాం, పిల్లలు పెద్దలు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహిస్తారని తెలిపారు.రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం దినదినాభివృద్ధి చెంది, పాడి పంటలతో తెలంగాణ రైతు కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ, ఏకదంతున్ని కేసీఆర్ ప్రార్థించారు.

## విఘ్నాలను తొలగించి ప్రజల జీవితాల్లో
## సుఖసంతోషాలు నింపాలి : పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే వినాయక చవితి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మహేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. సహజ సిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పండుగను కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం ద్వారా సోదరభావం, సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని అన్నారు.

## నవరాత్రులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి
## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబరు 13,ప్రభాతవార్త: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'బుద్ధికి, జ్ఞానానికి, విజయానికి అధిపతి వినాయకుడు అని కొనియాడారు. మనం ఏ పని ప్రారంభించినా ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండాలని మొదట గణపతిని పూజిస్తామని తెలిపారు.ఆ లంబోదరుడి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రజలందరూ ఆయురా రోగ్యా లతో, అష్టఐశ్వర్యాలు కలగి ఉండాలని, ప్రజలు ప్రారంభించే అన్ని పనులలో మంచి జరగాలని మంత్రి ఆ వినాయకుడిని ప్రార్థించారు. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అత్యంత పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని, ఈ వినాయక చవితి నవరాత్రులు ప్రజలంతా సమిష్టిగా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 10 యేళ్ల వరకూ
## జైలు శిక్షతోపాటు జరిమానాకు అవకాశం
## సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 292 మందిపై కేసులు

హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 292 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 240 మంది బైకర్లు, 12 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కారు డ్రైవర్లు ఉన్నారు. అధిక మోతాదులో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. 14 మంది వాహనదారులకు 301 నుంచి 550 మధ్య బీఏసీ పాయింట్లు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 292 మందిని చట్టపరమైన చర్యల్లో భాగంగా కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ కారణంగా ప్రమాదం జరిగి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగితే.. బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేరానికి గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత వారం డ్రంకెన్ డ్రైవింగ్‌కు సంబంధించిన 681 కేసులను కోర్టులు పరిష్కరించగా, 18 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారు. మరో ఏడుగురికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్ శిక్ష విధించగా, మిగిలిన 656 మందికి జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.


hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
పట్టణ అటవీ శాఖ
HGCL కార్యాలయ భవనం, నానక్‌రాంగూడ, హైదరాబాద్-500 032

Rc. No. 55/UF/HMDA/2026 సంక్షిప్త టెండర్ ప్రకటన తేది: 13.09.2026

HMDA ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌పై టెండర్లను ఆహ్వానిస్తోంది: 1. ఔటర్‌రింగ్‌రోడ్‌లో (గ్రీన్‌ల్యాండ్స్ గెస్ట్ హౌస్ వద్ద ల్యాండ్‌స్కేప్ పనులు) ... 2. (గ్రీన్‌ల్యాండ్స్ గెస్ట్ హౌస్ వద్ద ...) ... తేది 16.09.2026. మరిన్ని వివరాల కోసం దయచేసి ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://tender.telangana.gov.in ను సందర్శించండి.

సం/- డైరెక్టర్, పట్టణ అటవీ శాఖ, HMDA

DIPR.No.9930-PP/CL/Advt/1/2026-27, తేది: 13.09.2026

వార్త

మానవునికి తెలిసిన అతి ప్రాచీనమైన దివ్య ఔషధం ఊరట కలిగించే మాటలు నేర్పుగా చెప్పడమే.

- లూయిస్ నైజర్

# కృత్రిమ మేధ మింగేస్తుందా?


మానవ మేధస్సును మించింది లేదనుకునే పరిస్థితి నుంచి దానికి సమాంతరంగా ధీటుగా వచ్చిన 'కృత్రిమ మేధ'ను కనిపెట్టగలిగాం. అంటే సృష్టికి విశ్వామిత్ర సృష్టి కన్నా మిన్నగా 'ఆంత్రోపిక్' ఒకటుందని అన్వేషణలో బయటపెట్టాం కానీ ఇప్పుడా కృత్రిమ మేధను కళ్లారా చూసి అదేమీ కనికట్టు కాదని ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం అద్భుతః అని గొప్పగా చెప్పుకుంటున్నాం. తాజాగా మనం సృష్టించిన మేధస్సు ఎప్పటికయినా మనల్ని కాటేస్తుందని చెప్పే విశ్లేషణలు కూడా వస్తున్నాయి. శాస్త్రం ఎంత అభివృద్ధి చెందితే అంత మేలే కానీ అదే మనకు ముప్పుగా పరిగణిస్తుందని వినగానే జనంలో కొంత గాభరా బయలుదేరింది. కళ్లెదుట రోబోలు, డ్రోన్‌ల విన్యాసాలు చూసి టెక్నాలజీ అభివృద్ధిని ఎంతగానో పొగుడుకుంటున్నాం. అలాంటిది కృత్రిమ మేధ మనుషులను చంపడానికి కూడా వెనుకాడదని అనగానే గుండెల్లో గుబులు కాక మరేమిటి? కృత్రిమ మేధ జపం జీవం గురించి మరెన్ని విశ్లేషణలొస్తాయో భవిష్యత్తే చెప్పాలి. కృత్రిమ మేధ (ఎఐ) రంగంలో ఆకాశానికి చేరుకున్న టెక్నాలజీ సంస్థలు సూపర్ ఇంటెలిజెన్స్ దిశగా ఎఐ అభివృద్ధికి నిచ్చెనలు వేస్తూ రానున్న పదేళ్లలో కృత్రిమ మేధ, మానవాళి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని ఓపెన్ ఎఐలో పనిచేసిన జాకబ్ కాక్సన్ అనే పరిశోధకుడు ముందుగానే హెచ్చరించాడు. తను పనిచేసే కంపెనీలో మంచి జీతం తీసుకుంటూ కూడా కృత్రిమ మేధ భవిష్యత్తులో చేయగల వికృత విన్యాసాలను పరిశీలించిన అనంతరం ఆకస్మికంగా రాజీనామా చేశారు. కృత్రిమ మేధ వల్ల కలిగే నష్టాలను తెలిసీ చెప్పకపోయావో, 'నీ తల వేయిముక్కలవుతుంద'ని భేతాళుడు విక్రమార్కుడిని అన్నట్లుగా అతడినిఎవరూ హెచ్చరించలేదు. గత మూడేళ్లుగా జాకబ్ కాక్సన్ ఎఐతో మమేకమై కృత్రిమ మేధకు సంబంధించిన పరిశోధనలే చేస్తున్నాడు. ఓపెన్ ఎఐ, ఆ తర్వాత ఆంత్రోపిక్ కంపెనీల్లో పనిచేసి అక్కడ జరుగుతున్న పరిశోధనలను పరిశీలించాడు. కృత్రిమ మేధ కంపెనీలు పరస్పర పోటీ కారణంగా ఎలాంటి ముందు జాగ్రత్తలు లేకుండానే తమ పరిశోధనల్లో వేగం పెంచుతున్న మాట నిజమే. అదే మానవాళి కొంప ముంచుతుందని విశ్లేషించడానికి అతనికి ఎంతో కాలం పట్టలేదు. దీని ఫలితంగా 'దేన్నయినా హ్యాక్ చేయగలం, రాత్రికిరాత్రే ఏ రంగాన్నయినా, ఏ వ్యవస్థనయినా విధ్వంసం చేయగలం' వనరులను స్వాధీనం చేయగలమంటూ కృత్రిమ మేధ కట్టడికి మాత్రం ఎలాంటి ప్రమాణాలు ప్రామాణికంగా ఏర్పాటు చేసుకోకపోవడమూ ఇబ్బందికరమే. ఏ కృత్రిమ మేధ కంపెనీ బాధ్యతాయుతంగా పనిచేయకపోవటమే దీనికంతకూ కారణమని ఆ మాజీ ఉద్యోగి ఆరోపించాడు. ఇదే పరిస్థితి ఆ రంగంలో కృత్రిమ మేధ అభివృద్ధిలో ఎదురౌతుందని అందుకే సరైన ప్రమాదాల పాటింపు ఉండదని వివరించారు. టెక్నాలజీతో పోటీ పడటమే కాదు. దానిని అభివృద్ధి చేసే దిశలో మానవ సమాజానికి నష్టం కలిగించే అంశాలను గుర్తించడంలో విఫలమవుతున్నామని చెప్పారు. ఆంత్రోపిక్ వేగం ఓపెన్ ఎఐ మరింత వేగం అనే ధోరణిలో సాగుతున్నందున తారతమ్యాలు తెలియని పరిస్థితి ఉందని ఆ పరిశోధకుడు చెప్పారు. అనియంత్రిత టెక్నాలజీ భయాందోళనలు కలిగిస్తోంది. నిజానికి ఈ విషయం ఆ ఉద్యోగి బయటకు చెప్పకపోయినా ఎప్పుడో అప్పుడు కృత్రిమ మేధ ఆందోళన కలిగించేదే. మానవాళిని నిర్వీర్యం చేసి చంపగల ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ పదేళ్లలో బయటపడ్తుందని ఆయన అంచనా వేశారు. మనిషి ఆలోచనలను దాటే స్థాయికి కృత్రిమమేధ ఉంటుందని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఎంతో కాలం క్రితమే హెచ్చరించినా చాలా మంది మేధావివర్గపు టెక్ దిగ్గజాలు కొట్టిపారేశారు. మనుషుల కన్నా ఎఐ పేరిట మరో మేధావివర్గం ఆవిర్భవిస్తుందంటే నమ్మలేకపోవడం తప్పేకాదు. అది మన మీదమనకున్న ఆత్మవిశ్వాసం. కానీ ఎదురయ్యే పరిస్థితులను అంచనా వేసుకోలేకపోతే మన గొయ్యి మనం తవ్వుకున్నట్లే. ఇప్పటికే 'కృత్రిమ మేధ' శక్తియుక్తులు మనకు అర్థమవుతున్నాయి. విద్యుత్ గ్రిడ్‌లను హ్యాక్ చేయడం, నీటి సరఫరాల నిలిపివేత, ప్రమాదకర జీవాయుధాల రూపకల్పనలో ఎఐ పాత్ర మనకు తెలిసిందే. ఈహెచ్చరికలనేపథ్యం 'కృత్రిమ మేధ' మరికొంత అభివృద్ధి జరిగి 'ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్'గా మారినప్పుడు దాని వలన కలిగే ప్రమాదాన్ని అంచనా వేయడం సాధ్యం కాదని ఎలాన్ మస్క్ అభిప్రాయపడి ఉండవచ్చు. ఎఐ రంగంలో పెట్టుబడులు పెడ్తున్నందున వీటి విషయాల్లో ఆయనకే ఎక్కువ ప్రణాళికలుంటాయి కనుక అధ్యయన అనుశీలనఎక్కువగానే ఉంటుంది. ఒకప్పుడు 'ఎఐ' రంగానికి గాడ్‌ఫాదర్‌గా ఉన్న జెఫ్రీ హింటన్ కూడా ఇలాంటి హెచ్చరికలే చేశారు. ఎజిఐ మేధస్సు మనుషులను మించితే వినాశనం అన్న అధ్యయనం చేసిన ఆయన ఎఐ మోడళ్ల శిక్షణను నియంత్రించాల్సిన ఆవశ్యకత గురించి చెప్పేవారు. ఈ నేపథ్యంలోనే ఆయన సహాధ్యాయిలు గూగుల్ డీప్ మైండ్ సిఇఒ డెమిస్ హసాబిస్ వంటివారు ఎజిఐస్థాయిలో వచ్చే అంతరాయాలను నిరోధించడం మేలని హితవు చెప్పేవారు. మనిషికి తాను సృష్టించిన దానిని నియంత్రించలేని పరిస్థితి ఉంటే అదే భస్మాసుర హస్తం కాగలదు. తప్పుడు సమాచారవ్యాప్తి, ప్రమాదకర లక్ష్యాలతో ఎఐఅభివృద్ధి మానవులే తలపెట్టడం కూడా వాంఛనీయం కాదని మేధా సంపన్నులైన శాస్త్రజ్ఞులు, నిపుణులు ఎఐమోడళ్లను నియంత్రించి ముందడుగు వేయాలి. అంతకన్నా ముందుగా ఎఐమీద నియంత్రణతో ఉండే పరిస్థితిని అధ్యయనంచేసి అందరూ దానికే కట్టుబడి ఉండాలి.

మాటలతో నీ శక్తిని వ్యర్థం చేయక, కార్యరూపంలో సాధించి చూపెట్టు.



స్వామి వివేకానంద

ప్రపంచాన్ని మార్చదలచినవాడు ముందుగా తనను తాను మార్చుకోవడం నేర్చుకోవాలి.



సోక్రటీస్

## ప్రజావాక్కు

### పునఃనైపుణ్య శిక్షణ అవసరం

**భారత** ఉద్యోగ మార్కెట్‌లో సాంకేతికపరిజ్ఞానం వేగంగా మారుతున్న కొద్దీ నైపుణ్యాలవిలువ కూడా మారుతోంది. కృత్రిమ మేధస్సు ఆధారిత ఉద్యోగాల్లో వేతన వృద్ధి వేగంగా ఉండగా, కొన్ని సంప్రదాయ సాంకేతిక ఉద్యోగాల్లో వేతనాల పెరుగుదల మందగించడం ఈ మార్పుకు సంకేతం. ఇదికేవలం వేతనాల అంశంకాదు, విద్యార్థులు, ఉద్యోగులు భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. ముఖ్యంగా అనుభవంతో పాటు ప్రత్యేక నైపుణ్యం, సమస్య పరిష్కార సామర్థ్యం, కొత్త సాంకేతికతలను నేర్చుకునే సన్నద్ధత వేతనాలను నిర్ణయించే ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాల విద్య కేవలం సిద్ధాంత పరిజ్ఞానానికే పరిమితం కాకూడదు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను నవీకరించడంతో పాటు, ఆచరణాత్మక కృత్రిమ మేధస్సు శిక్షణ, ప్రాజెక్టులు, పరిశ్రమలతో కలిసి ఇంటర్న్‌షిప్‌లు అందించాలి. సంస్థలు కూడా సంప్రదాయ సాంకేతిక విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పునఃనైపుణ్య శిక్షణ అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఇదేం ప్రచారం

**యాక్టర్‌లకి** సింగర్‌లకి స్పీచ్‌లు ఇచ్చేవారికి ఆడిటోరియంలో వేదికలు ఎలా ఉపయోగపడుతున్నాయో సోషల్ మీడియా మోడికి అలానే ఉపయోగపడుతోంది. సోషల్ మీడియా ద్వారా తన రాజకీయ ప్రత్యర్థులను తనను వ్యతిరేకించేవారిని దేశద్రోహులుగా, విచ్ఛిన్నకర శక్తులుగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలలో గెలుపొందడానికి ఈ సోషల్ మీడియా మోడీకి ప్రధాన అస్త్రం అవుతోంది. మోడీ ప్రధాన మంత్రి పదవి నుంచి తప్పుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్స్‌గా మారాలి.

- మిథునం, హైదరాబాద్

### 'సర్' అనుమానం

**ప్రత్యేక** ఓట్ల సంవరింపు ముసుగులో అసలు భారతీయుల ఓట్లు గల్లంతు అవ్వడం విడ్డూరం. భారత రత్న అందుకున్న ప్రొఫెసర్‌రావ్ ఓటు కెఅనుమానితుడు అనే ముద్ర పడడం ఈ పద్ధతిలో ఉన్న డొల్లతనం బయటపడుతుంది. ఆధార్ తయారు చేసిన నందన్ నిలెకని కూడా అనుమానితుల జాబితాలో చేరడం ఇక్కడ గమనించదగిన విషయం. సార్ అనేది అనుమానితులను గుర్తించడానికి ప్రవేశ పెట్టిన విధానం. ఇది ఎంతవరకు సమంజసం?

- భారత అవినాష్, జనగామ

### ఉచిత కరెంటు రాజ్యాంగ విరుద్ధం

మననాయకులకు రాజ్యాంగం అంటే ఏమిటోతెలుసా. మనది సెక్యులర్‌దేశం. సెక్యులర్ దేశంలో ప్రభుత్వపరంగా, అధికారికంగా మతపరమైన వాటినిప్రోత్సహించరాదు. దేవుడు మతం వ్యక్తిగతం. మరి ఈనెల 14 తేదీ నుండి 22 తేదీ వరకు 9 రోజులు వినాయక పందిళ్ళకు ఉచిత కరెంటు ఇస్తున్నట్లు సిపిడీసీఎల్ సిఎండి పుల్లారెడ్డి గారు నిన్న ఒక ప్రకటన చేశాడు. మీ సొంత డబ్బు ఇవ్వండి. చందా ఇచ్చుకోండి. మా కరెంటు మీరు ఉచితంగా ఎలాఇస్తారు? రాజ్యాంగం తెలియదా! సెక్యులర్ విధానాన్ని అమలుపరచటంలో ప్రధాని నుండి అందరూ విఫలమైనారు. రాజ్యాంగం ప్రకారం పాలన చేస్తామని ప్రమాణ చేశారు గదా. మరి అందులో ఏముందో తెలుసుకోవలసిన బాధ్యత లేదా! మేము చెప్తున్నాం వినండి. భిన్న మతాలు, భిన్న ఆచారాలు, భిన్న సంస్కృతులు కలిగిన మనదేశంలో ప్రభుత్వ పరంగా మతపరమైన ఆచారాలూ పాటించకూడదు. పాటించాలనుకుంటేఅది మీ వ్యక్తిగతంగా ఉండాలి. ప్రభుత్వానికి సంబంధం లేదు. అందుకే సెక్యులర్ అని రాసుకున్నాం.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కె.సి.ఆర్ పథకాలు రద్దు

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్న పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేయలేదు. ఆర్థికపరిస్థితి ఆశాజనకంగా లేకపోయినా అదనంగా మరికొన్ని సంక్షేమ పథకాలను ప్రారంభించి అమలు చేస్తోంది. ఈపథకాలు లక్షలాది మందికి ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడు పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీయే కాదు భవిష్యత్తులో ఏపార్టీ ప్రభుత్వం ఏర్పాటయినా ప్రజాసంక్షేమం దృష్టిలో పెట్టుకుని పనిచేయాలి. ప్రజలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయాలి. వెంటనే కాకపోయినా దశలవారీగా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి. అలా చేయకుంటే ప్రజావ్యతిరేకత వస్తుంది.

- శాస్త్రి, హైదరాబాద్

### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం

**భారత్‌లో** సైబర్ నేరాలు రోజురోజుకూ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల సైబర్ నేరాల నియంత్రణ ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టంగా పేర్కొనడం అత్యంత సమయోచితమైన పరిణామం. 2024లో దేశవ్యాప్తంగా 65.9లక్షల సైబర్ ఫిర్యాదులు, సుమారు రూ.55,493కోట్ల ఆర్థిక నష్టం నమోదవడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఈ సైబర్‌నేరాలను అరికట్టాలంటేకేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలుసమన్వయంతో పనిచేయాలి.

-కె.రామారావు, నల్గొండజిల్లా

# భారత్ ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడాలి!

**చైనాకు సమర్థమైన సమాధానం ఇవ్వాలంటే వినియోగదారుల చేతుల్లోని బహిష్కరణ పిలుపు కంటే ప్రభుత్వ విధానాల్లో, పరిశ్రమల సామర్థ్యంలో, పరిశోధనా సంస్థల్లో మార్పు రావాలి. చైనాపై ఆధారపడే ప్రతి ఉత్పత్తికి ప్రత్యామ్నాయాన్ని ఒక్కరోజులో సృష్టించడం సాధ్యం కాదు. కానీ పది, ఇరవై సంవత్సరాల దీర్ఘకాలిక ప్రణాళికతో వ్యూహాత్మక రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని నిర్మించడం మాత్రం సాధ్యమే. దిగుమతుల మూలాలను వైవిధ్యీకరించాలి. ఒకే దేశంపై ఆధారపడకుండా జపాన్, దక్షిణ కొరియా, యూరప్, అమెరికా, ఆగ్నేయాసియా దేశాలతో సాంకేతిక, పారిశ్రామిక భాగస్వామ్యాలను పెంచుకోవాలి. అదే సమయంలో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో స్థానంకల్పించాలి. చైనాతో వాణిజ్యాన్ని పూర్తిగా తెంచుకోవడం కన్నా, చైనాతో సమానంగా పోటీ చేయగల స్థాయికి భారత్ ఎదగడం అసలు లక్ష్యం కావాలి.**

నందూరి రవిశంకర్

చైనీస్ ఉత్పత్తులను బహిష్కరించాలనే పిలుపులు కొత్తవేమీ కావు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తిన ప్రతిసారీ ప్రపంచంలోని అనేక దేశాల్లో ఈ నినాదం మారుమోగుతూనే ఉంటుంది. భారత్‌లో 1962 యుద్ధం అనంతరం మొదలైన చైనా వ్యతిరేక భావోద్వేగాలు, 2020గల్వాన్ ఘర్షణల తర్వాత మరింత ఉధృతమయ్యాయి. ఐరోపా దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలు, జాతీయ భద్రతపై ఆందోళనలు చైనా ఉత్పత్తులపై అనుమానాలను పెంచాయి. అమెరికా వాణిజ్యపరమైన ఆంక్షలు, భారీ సుంకాలు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ వంటి చర్యలకు దిగింది. వియత్నాం, ఫిలిప్పీన్స్, జపాన్ వంటి దేశాల్లోనూ భౌగోళిక వివాదాలు చైనా వ్యతిరేక భావనలకు ఆజ్యం పోస్తున్నాయి. అయితే ఒక కీలకమైన ప్రశ్నకు మాత్రం ఈ బహిష్కరణ ఉద్యమాలు సమాధానం చెప్పలేకపోతున్నాయి. చైనా ఉత్పత్తులను నిజంగా ప్రపంచ మార్కెట్ల నుంచి దూరం చేయగలిగాయా? సమాధానం స్పష్టంగా లేదు. రాజకీయంగా చైనాను వ్యతిరేకిస్తున్న దేశాలే ఆర్థికంగా చైనాపైనే ఆధారపడాల్సి వస్తోంది. వినియోగదారులు చైనా వస్తువులను బహిష్కరించాలని పిలుపునిస్తున్నా, సరసమైన ధర, విస్తృత లభ్యత, భారీ ఉత్పత్తి సామర్థ్యం కారణంగా ఆ వస్తువులు మళ్లీ మార్కెట్లలోకి చేరుతున్నాయి. ఇది కేవలం చైనా బలమేకాదు. ప్రపంచ సరఫరా గొలుసుల్లో అది ఎంత లోతుగా పాతుకుపోయిందో సూచించే వాస్తవం. వాణిజ్యం భావోద్వేగాలతో నడవదు. ధర, నాణ్యత, సరఫరా, సాంకేతిక సామర్థ్యం, మార్కెట్ అవసరం వంటి అంశాలే చివరికి వినియోగదారుడి నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. చైనాను రాజకీయంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, చైనా ఉత్పత్తులు తక్కువ ధరకులభిస్తే వాటిని కొనుగోలు చేయడానికి ప్రపంచ వినియోగదారులు వెనుకాడటం లేదు. ఇదే చైనా ఆర్థిక వ్యూహానికి ఉన్న బలమైన పునాది. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పారిశ్రామిక విడిభాగాలు, సోలార్ పరికరాలు, రసాయనాలు, ఔషధ పరిశ్రమకు అవసరమైన ముడిసరకులు. ఇలా అనేక రంగాల్లో చైనా ప్రపంచ ఉత్పత్తి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది. ఒక దేశం చైనా నుంచి తుది ఉత్పత్తుల దిగుమతులను తగ్గించినా, ఆ ఉత్పత్తి తయారీలో ఉపయోగించే విడిభాగాలు, యంత్రాలు లేదా ముడిసరకుల రూపంలో చైనాతో సంబంధం కొనసాగుతూనే ఉంటుంది. అందుకే చైనా వస్తువులను బహిష్కరించండి అనే పిలుపు వినడానికి దేశభక్తి నినాదంలా అనిపించినా, దాని ఆర్థిక ప్రభావం పరిమితమే. బహిష్కరణకంటే ప్రత్యామ్నాయ ఉత్పత్తిసామర్థ్యాన్ని నిర్మించడం ఎంతో ముఖ్యమైనది. చైనా ఆర్థిక శక్తిగా ఎదగడం ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదు. భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, పారిశ్రామిక విధానాలు, ఎగుమతులకు ప్రోత్సాహం, పరిశోధన అభివృద్ధికి ప్రాధాన్యం, ప్రపంచ వాణిజ్యంతో అనుసంధానం ఇవన్నీ దశాబ్దాలపాటు అమలు చేసిన వ్యూహంలో భాగం. విస్తీర్ణం, జనాభా, సహజ వనరులు వంటి ప్రయోజనాలను పారిశ్రామిక సామర్థ్యంగా మార్చుకోవడంలో చైనా విజయవంతమైంది. ప్రపంచానికి అవసరమైన వస్తువులను పెద్దఎత్తున, తక్కువ ధరకు, వేగంగా ఉత్పత్తి చేసే కేంద్రంగా ఎదిగింది. ఫలితంగా రాజకీయంగా చైనాను దూరంగా ఉంచాలనుకునే దేశాలకూ ఆర్థికంగా దాని నుంచి పూర్తిగా విడిపోవడం కష్టసాధ్యమైంది. ఈ వాస్తవాన్ని అమెరికా, ఐరోపా దేశాలు కూడా గుర్తించాయి. అందుకే అవి కేవలం బహిష్కరణ పిలుపులతో ఆగిపోవడం లేదు. దేశీయ తయారీకి ప్రోత్సాహకాలు, వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడులు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, చైనా ఉత్పత్తులపై సుంకాలు వంటి చర్యలను చేపడుతున్నాయి.



ఇది భారత్‌కు కూడా కీలకమైన పాఠం. చైనాతో సరిహద్దు వివాదాలు, గల్వాన్ ఘర్షణలు, భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నప్పటికీ భారత్ ఆర్థికంగా చైనాపై ఆధారపడాల్సి వస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' వోకల్ ఫర్‌లోకల్, ఆత్మనిర్భర్ భారత్, వంటి కార్యక్రమాల లక్ష్యం ఇదే ఆధారపడటాన్ని తగ్గించడం. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే ప్రయాణం ఇంకా పూర్తికాలేదు. భారత పరిశ్రమలకు అవసరమైన పారిశ్రామిక విడిభాగాలు, ఎలక్ట్రానిక్ భాగాలు, ముడి సరకులు, యంత్ర పరికరాల విషయంలో చైనా కీలక సరఫరాదారుగా ఉంది. ఫలితంగా చైనా నుంచి భారత దిగుమతులు గత దశాబ్దంలో గణనీయంగా పెరిగాయి. అదే సమయంలో చైనాకు భారత ఎగుమతులు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఈ అసమతుల్యత కొనసాగితే ద్వైపాక్షిక వాణిజ్య లోటు మరింత విస్తరించే ప్రమాదం ఉంది. ఇది కేవలం వాణిజ్య లోటు సమస్య కాదు. ఒక దేశం కీలక ఉత్పత్తుల కోసం మరో దేశంపై అధికంగా ఆధారపడితే, అది ఆర్థిక భద్రతకు సంబంధించిన అంశంగా మారుతుంది. యుద్ధ సమయంలో ఆయుధాలు ఎంత కీలకమో, ఆర్థిక పోటీ సమయంలో సరఫరా గొలుసుల నియంత్రణ అంతే కీలకం. చైనా ఉత్పత్తుల విషయంలో ఆర్థిక అంశాలతో పాటు డేటాభద్రత, సైబర్ భద్రత, జాతీయ భద్రత వంటి అంశాలూప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, యాప్‌లు, కమ్యూనికేషన్ పరికరాలు కోట్లాది మంది వినియోగదారుల వ్యక్తిగత సమాచారంతో ముడిపడి ఉంటాయి. అందువల్ల ఏ దేశమైనా విదేశీ సాంకేతిక ఉత్పత్తులవిషయంలో భద్రతాప్రమాణాలను కఠినంగా పరిశీలించాల్సిందే. అయితే భద్రత పేరుతో ప్రతి చైనా ఉత్పత్తినీ తిరస్కరించడం పరిష్కారం కాదు. సాంకేతిక సామర్థ్యాన్ని మనమే అభివృద్ధి చేసుకోవడం, డేటా రక్షణ చట్టాలను బలోపేతం చేయడం, దేశీయ పరిశోధనకు పెట్టుబడులు పెంచడం, నమ్మకమైన అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి ప్రత్యామ్నాయ సాంకేతిక పర్యావరణాన్ని నిర్మించడం అవసరం. భారత్ ముందున్న అతిపెద్ద అపోహ ఇదే. ఆత్మనిర్భరత అంటే ప్రతి వస్తువునూ దేశంలోనే తయారు చేసుకోవడం కాదు. ప్రపంచ వాణిజ్యంతో సంబంధాలు తెంచుకోవడం అంతకన్నా కాదు. అవసరమైన చోట దిగుమతులు చేసుకుంటూనే, వ్యూహాత్మక రంగాల్లో విదేశీ ఆధారపడటాన్ని తగ్గించడమే నిజమైన స్వావలంబన. రక్షణ, పునరుత్పాదక ఇంధనం, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు ఫలితాలు ఇస్తున్నాయి. ఇదే నమూనాను సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, యంత్ర పరికరాలు, అధునాతన తయారీ సాంకేతికత, కీలక రసాయనాలు వంటి రంగాలకు విస్తరించాలి. దేశీయ పరిశ్రమలకు కేవలం రక్షణ కల్పిస్తేసరిపోదు. ప్రపంచస్థాయినాణ్యత, ధర, ఉత్పాదకతను సాధించేలా వాటిని తీర్చిదిద్దాలి. లేకపోతే చైనా ఉత్పత్తులను నిషేధించినా వినియోగదారులు అధిక ధరలకు తక్కువ నాణ్యత కలిగిన ప్రత్యామ్నాయాలను కొనుగోలు చేయాల్సి వస్తుంది. అది దీర్ఘకాలికంగా దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేయదు. చైనాకు సమర్థమైన సమాధానం ఇవ్వాలంటే వినియోగదారుల చేతుల్లోని బహిష్కరణ పిలుపు కంటే ప్రభుత్వ విధానాల్లో, పరిశ్రమల సామర్థ్యంలో, పరిశోధనా సంస్థల్లో మార్పు రావాలి. చైనాపై ఆధారపడే ప్రతి ఉత్పత్తికి ప్రత్యామ్నాయాన్ని ఒక్కరోజులో సృష్టించడం సాధ్యం కాదు. కానీ పది, ఇరవై సంవత్సరాల దీర్ఘకాలిక ప్రణాళికతో వ్యూహాత్మక రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని నిర్మించడం మాత్రం సాధ్యమే. దిగుమతుల మూలాలను వైవిధ్యీకరించాలి. ఒకే దేశంపై ఆధారపడకుండా జపాన్, దక్షిణ కొరియా, యూరప్, అమెరికా, ఆగ్నేయాసియా దేశాలతో సాంకేతిక, పారిశ్రామిక భాగస్వామ్యాలను పెంచుకోవాలి. అదే సమయంలో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో స్థానంకల్పించాలి. చైనాతో వాణిజ్యాన్ని పూర్తిగా తెంచుకోవడం కన్నా, చైనాతో సమానంగా పోటీ చేయగలస్థాయికి భారత్ ఎదగడం అసలు లక్ష్యంకావాలి. ●

# ప్రజల ధైర్యమే ఏసిబికి అసలైన ఆయుధం!



కొలను వెంకటేశ్వర రెడ్డి

ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు సేవ చేయాల్సిన చోటు. కానీ అక్కడికి వెళ్లిన సామాన్యుడికి నిబంధనల కంటే ముందే ఇంత ఇస్తే పని త్వరగా అవుతుంది అనే మాట ఎదురైతే, అది కేవలం లంచం కాదు, ప్రజల హక్కును డబ్బుకు అమ్మే ప్రయత్నం. భూమి రికార్డులు, రిజిస్ట్రేషన్లు, నిర్మాణ అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు, ధ్రువపత్రాలు, సేవ ఏదైనా లంచం అడుగుతున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో 2024 నుంచి 2026 మధ్య ఏసీబీ నమోదు చేసిన కేసులు, నిర్వహించిన ట్రాప్‌లు, అక్రమాస్తుల దర్యాప్తులు ఈ సమస్య తీవ్రతను గుర్తుచేస్తున్నాయి. 2024లో 152 కేసుల్లో 223 మంది అరెస్టు కాగా, 2025లో 199 కేసుల్లో 273మంది అరెస్టయ్యారని పేర్కొన్న గణాంకాలు పరిస్థితిని తెలియజేస్తున్నాయి. 2026లోనూ కేసుల నమోదు కొనసాగుతోంది. ఇవి కేవలం సంఖ్యలు కావు, ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి ఏస్థాయిలో ఉందో ప్రశ్నించే పరిణామాలు చిన్న లంచం కూడా పెద్ద సమస్యే. అవినీతి అంటే కోట్ల రూపాయల అక్రమాస్తులు మాత్రమే కాదు. రూ.500 అడిగినా అవినీతే, రూ.5,000 అడిగినా అవినీతే. ఇచ్చేద్దాం, పని త్వరగా అయిపోతుంది అనే ధోరణి అవినీతికి సామాజిక అంగీకారం కల్పిస్తుంది. చిన్న మొత్తాలను పట్టించుకోకపోతే అవినీతిపరుడికి మరింత పెద్ద మొత్తాలు అడిగే ధైర్యం వస్తుంది. అందుకే లంచం అడిగినప్పుడు మౌనంగా ఉండటం సమస్యను మరింత పెంచుతుంది. ఫిర్యాదు చేస్తే నా పని ఆగిపోతుంది, తర్వాత ఇబ్బందులు వస్తాయి అనేభయాలు సహజమే. కానీ ప్రతిఒక్కరూ మౌనంగా ఉంటే అవినీతి వ్యవస్థలో మరింత బలపడుతుంది. ఏసీబీ ట్రాప్‌లో లంచం తీసుకుంటూ ఒక అధికారి పట్టుబడటం అవసరమైన చర్య. కానీ దర్యాప్తు అక్కడితో ఆగకూడదు. అధికారిక ఆదాయానికి మించి భారీగా ఆస్తులు ఉన్నట్లు అనుమానం ఉంటే, వాటి మూలాలను లోతుగా పరిశీలించాలి. ఆస్తులు ఎవరి పేర్లలో ఉన్నాయి? బినామీ లావాదేవీలు ఉన్నాయా? బ్యాంకు లావాదేవీలు ఏమిటి? ఆదాయానికి ఆస్తులకు మధ్య వ్యత్యాసం ఎంత? వంటి అంశాలు వెలుగులోకి రావాలి. కొన్ని అక్రమాస్తుల కేసుల్లో వందల కోట్ల మార్కెట్ విలువ ఉన్న ఆస్తులు బయటపడుతున్నాయన్న వివరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆరోపణలను తుది నిజాలుగా చూడకూడదు. చట్టబద్ధమైన విచారణ, ఆధారాలపరిశీలన, న్యాయపరమైన నిర్ణయమే అంతిమ ప్రమాణం. ప్రజలే ఏసీబీకి కళ్లూ, చెవులూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ నిరంతరం ఉండటం సాధ్యం కాదు. అవినీతి ఎక్కడ జరుగుతుందో ముందుగా తెలిసేది అక్కడికి వెళ్లే పౌరుడికే. అందుకే ప్రజల సహకారం అత్యంత కీలకం. లంచం అడిగితే అధికారి పేరు, హోదా, కార్యాలయం, పని, అడిగిన మొత్తం వంటి వివరాలను గుర్తుంచుకుని ఏసీబీకి అధికారిక మార్గంలో ఫిర్యాదు చేయాలి. ఏసీబీ సూచన లేకుండా స్వయంగా ట్రాప్ ఏర్పాటు చేయడం, అధికారితో గొడవ పడటం లేదా ప్రమాదకరంగా ఆధారాలు సేకరించడం మాత్రం చేయకూడదు. ఏసీబీ దాడులు అవినీతిపై భయాన్ని పెంచగలవు. కానీ అవినీతికి శాశ్వత పరిష్కారం వ్యవస్థలో పారదర్శకత పెరగడమే. ప్రభుత్వ సేవల డిజిటలీకరణ, ఫైళ్ల ఆన్‌లైన్ ట్రాకింగ్, నిర్ణీత కాలపరిమితి, అధికారుల జవాబుదారీతనం పెరగాలి. ప్రజలు తమ దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంటే మధ్యవర్తుల పాత్ర తగ్గుతుంది. అవినీతిని ఒక్క ఏసీబీతో నిర్మూలించడం సాధ్యం కాదు. ప్రభుత్వం, అధికారులు, న్యాయవ్యవస్థ, మీడియా, ప్రజలు, అందరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. ఒకరి ఫిర్యాదు ఒక కేసును వెలుగులోకి తెస్తుంది. ప్రజల సమిష్టి ధైర్యం ఒక వ్యవస్థను మార్చగలదు. లంచం అడిగితే భయపడకుండా, చట్టబద్ధమైన మార్గంలో ఫిర్యాదు చేయాలి. ప్రజల ధైర్యమే అవినీతికి నిజమైన భయం. ●

# మన ప్రజాస్వామ్యం ఎటు పయనిస్తోంది!



మేకిరి దామోదర్

మన దేశం, రాష్ట్రంలో రాజకీయాలు ప్రజలను కలపాల్సింది పోయి, కులాలు, మతాల పేరుతో విడదీస్తే ప్రజాస్వామ్యం ఎటు పయనిస్తున్నట్లు? ప్రజాసేవ చేయాల్సిన నాయకులే పరస్పర విద్వేషాలకు వేదికలు సృష్టిస్తే.. రాజ్యాంగంపై చేసిన ప్రమాణానికి విలువ ఏమిటి? తెలంగాణలోని తాజా రాజకీయ పరిణామాలు ఈ ప్రశ్నలను ప్రతి పౌరుడి ముందూ నిలుపుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల వేళ ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీలకు సెక్యూరిటీ సిబ్బందికి, తోపులాటలఘర్షణలో స్పీకర్‌ను దూషించడతో సభలో కన్నీరు పెట్టుకో వడం, గొడవ చేసిన వారిని బహిష్కరించడం, ఆ తరువాత కేసులు. ఈ పరిణామాలతో ప్రజల సమస్యలు కనుమరుగై, కాలం, ధనం కరిగిపోయింది. ఒకరి కార్యక్రమాలు, ఆచారా లు, ప్రదేశాలను మరొకరు అపవిత్రంగా చిత్రీకరించడం, పసుపు నీళ్ల చల్లి శుద్ధి చేయడం వంటి చర్యలు రాజకీయ సంస్కృతిలోకి రావడం ఆందోళన కలిగించే పరిణామం. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టడం కాదు, ప్రజల విశ్వాసాన్ని గౌరవించడం. భిన్నాభిప్రాయాలను సహించడం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం. ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షించడం కూడా ప్రజాస్వామ్య బాధ్యతలే. అధికార ప్రతిపక్షంలో ఎవరున్నా రాజకీయ ప్రత్యర్థిని శత్రువుగా, భిన్న వర్గాన్ని పరాయిగా చూసే ధోరణి పెరిగితే ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించేది ఎవరు? ఎలా!. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను అందించింది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు స్వీకరిస్తారు. ఆ ప్రమాణం కేవలం అధికారిక కార్యక్రమంలో పలికే మాట కాదు. ప్రజల పట్ల, రాజ్యాంగం పట్ల స్వీకరించే పవిత్రమైన బాధ్యత. అందుకే కులం, మతం, ప్రాంతం, భాష వంటి అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించి ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. రాజకీయ పార్టీలు వేర్వేరు సిద్ధాంతాలను కలిగి ఉండవచ్చు. నాయకుల మధ్య తీవ్రమైన రాజకీయ పోటీ ఉండవచ్చు. కానీ ఆ పోటీ ప్రజాస్వామ్య పరిమితులను దాటకూడదు. 'కలిసి ఉంటే కలదు సుఖం' అనేదే మన సామాజిక జీవనానికి చక్కని మార్గదర్శకం. భిన్నత్వమే భారతదేశ బలం. భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులు కలిసి జీవించడం మన దేశ ప్రత్యేకత. అలాంటి సమాజంలో విభజన రాజకీయాలకు ప్రాధాన్యం పెరగడం భవిష్యత్తుకు ప్రమాద సంకేతం. రాజకీయ నాయకులు ప్రజ



లకు ఆదర్శంగా నిలవాల్సిన వారు. వారి మాటలు, చేతలు సమాజంపై ప్రభావం చూపుతాయి. ఒక నాయకుడు విద్వేష పూరిత వ్యాఖ్య చేస్తే దాని ప్రభావం వేలాది మంది అనుచరులపై పడవచ్చు. అందుకే అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రతి నాయకుడు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. రాజకీయ పార్టీలు ఏర్పడింది ప్రజల సమస్యలను పరిష్కరించడానికి. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, రహదారులు, భద్రత, సామాజిక న్యాయం అందించడానికి. కానీ ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టి కులం, మతం, వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలే రాజకీయ చర్చకు కేంద్రంగా మారితే ప్రజలకు ప్రయోజనం ఏమిటి?, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కావాలి. రైతుకు పంటకు గిట్టుబాటు ధర కావాలి. విద్యార్థికి నాణ్యమైన విద్య కావాలి. సామాన్యుడికి అందుబాటులో వైద్యం కావాలి. పేద కుటుంబానికి భద్రమైన జీవనం కావాలి. ఇవే ప్రజల అసలు ప్రశ్నలు. వీటికి సమాధానాలు చెప్పాల్సిన రాజకీయ వ్యవస్థ ప్రజల దృష్టిని కుల, మత వివాదాల వైపు మళ్లిస్తే అది ప్రజాసేవకు న్యాయం చేసినట్ల అవుతుందా!. గాంధీ, నేతాజీ, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమర యోధులు దేశం కోసం త్యాగాలు చేశారు. వారి కలల భారతదేశం విభేదాలతో కాదు ఐక్యతతో నిర్మించాల్సిన దేశం. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం, గౌరవప్రదమైన జీవనానికి పునాది వేశారు. అలాంటి మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూనే వారి ఆశయాలకు విరుద్ధంగా రాజకీయాలు సాగితే అది ఆత్మపరిశీలన చేయాల్సిన సమయం కాదా?. రాజకీయ ప్రత్యర్థిని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ వ్యక్తిగత అవమానాలు, కులమత ప్రేరేపిత వ్యాఖ్యలు, సామాజిక విభజనకు దారితీసే చర్యలు ప్రజాస్వామ్యానికి మంచివి కావు. 'విత్తిన విత్తును బట్టి పంట' అన్నట్లు రాజకీయాల్లో విద్వేషాలను విత్తితే సమాజంలో అసహనమే పండుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే కేవలం రాజ్యాంగం ఉంటేనే సరిపోదు. దానిని గౌరవించే రాజకీయ నాయకత్వం, అప్రమత్తమైన ప్రజలు, బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీలు అవసరం. ప్రజలు కూడా కులం, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధి, పాలన, నైతికత, ఆధారంగా నాయకులను ప్రశ్నించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను మాత్రమే కాదు, ఎన్నికల తర్వాత నాయకుల ప్రవర్తనను కూడా ప్రజలు గమనించాలి. ప్రజా సమస్యలపై ఎవరు మాట్లాడుతున్నారు? రాజ్యాంగ విలువలను ఎవరు కాపాడు తున్నారు? సమాజాన్ని ఎవరు కలుపుతున్నారు? ఎవరు విడదీస్తున్నారు? అనేది పరిశీలిస్తూ అవసరమైన మేరకు, ప్రజాప్రతినిధుల బాధ్యతాయుతమైన జవాబుదారుతనాన్ని గుర్తుచేయాలి. రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలకు రాజకీయ సంస్కృతిని నేర్పాలి. ప్రత్యర్థి పార్టీపై రాజకీయ పోరాటం చేయవచ్చు.. కానీ ప్రజల మధ్య శాశ్వత విభేదాలు సృష్టించే స్థాయికి పోటీని తీసుకెళ్ల కూడదు. అధికార మార్పు సహజం. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ సమాజంలో ఏర్పడిన చీలికలు పూడ్చడానికి తరాలు పట్టవచ్చు. అందుకే కుల, మతాల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచనకు అన్ని పార్టీల నాయకులు స్వస్తి పలకాలి. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు భారత్, చైనా సహాయం

## శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు మోడీ, జిన్‌పింగ్ సిద్ధం: రష్యా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు శాంతి చర్చలను సులభతరం చేసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ముందుకొచ్చారని రష్యా తెలిపింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ఈ ప్రతిపాదన చేసినట్లు పేర్కొంది. మోడీ, జిన్‌పింగ్‌ల ప్రతిపాదనను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వాగతించారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటివరకు పెద్దగా ఫలించని నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోడీ, జిన్‌పింగ్, పుతిన్ మధ్య సాన్నిహిత్యం స్పష్టంగా కనిపించింది. సదస్సు తొలిరోజు ముగ్గురు నేతలు చిరునవ్వులతో చేతులు పట్టుకుని ఉన్న ఫొటో ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో ముగ్గురు కీలక నేతలు ఐక్యతను ప్రదర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా, ఉక్రెయిన్ శాంతి చర్చలకు మోడీ సహకారాన్ని రష్యా స్వాగతించడం ఇదే తొలిసారి కాదు. ప్రస్తుతం అమెరికా కూడా నిలిచిపోయిన శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు మార్గాలను అన్వేషిస్తున్న



సమయంలో రష్యా నుంచి వచ్చిన ఈ ప్రకటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యాలో తొలిసారిగా సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్షుడు పుతిన్ మద్దతు ఉన్న యునైటెడ్ రష్యా పార్టీ మరోసారి పార్లమెంటులో ఆధిపత్యం కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి వీలైనంత త్వరగా ముగింపు పలకాలని ఆయన కోరారు. అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ మాస్కో, కీవ్‌లను సందర్శించి యుద్ధానికి ముగింపు పలికేందుకు మార్గాలను అన్వేషించారు. భారత్ కీలక వారధిగా రష్యా, ఉక్రెయిన్‌తో ఒకేసారి సంబంధాలు కొనసాగిస్తున్న కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటి. దీంతో ఇరు దేశాల మధ్య భారత్ ఒక కీలక వారధిగా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. "మాస్కో, టెహ్రాన్, పశ్చిమ దేశాలతో ఒకేసారి మాట్లాడగల అరుదైన సామర్థ్యం భారత్‌కు ఉంది. ఆ ప్రాప్యత వాస్తవమే" అని ఇండిక్ రీసెర్చర్స్ ఫోరం థింక్‌ట్యాంక్ డైరెక్టర్ శ్రీనివాసన్ బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి ప్రారంభించినప్పటి నుంచి భారత్ శాంతి చర్చలకు పిలుపునిస్తూ వస్తోంది. రష్యా నుంచి తక్కువ ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, యుద్ధానికి ముగింపు పలకాలని భారత్ పలు సందర్భాల్లో రష్యాను కోరింది. గత నెలలో బిష్కెక్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశంలో మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధం ముగిసే దిశగా వెళ్లాలి" అని పుతిన్‌కు సూచించారు. "యుద్ధంలో గడిచే ప్రతి రోజు మానవాళిని వెనక్కి నెడుతుంది" అని మోడీ అన్నారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ ముఖాముఖి సమావేశమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో మియామీలో జరిగే జీ20 సదస్సు సందర్భంగా ఈ భేటీ జరిగే అవకాశం ఉందని సమాచారం.

పుతిన్ కూడా సదస్సుకు హాజరవుతే తాను మియామీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని జెలెన్స్కీ ఇప్పటికే ప్రకటించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత పరిష్కారం కోసం అంతర్జాతీయ స్థాయిలో దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్న వేళ, భారత్ మధ్యవర్తిత్వ పాత్రపై రష్యా చేసిన తాజా ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.



## జిన్‌పింగ్ అసౌకర్యంపై ఆరాతీసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** దేశరాజధానిలోని భారత్ మండపంలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపి, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఈ ఘటన సదస్సు ప్రారంభ సెషన్‌లో జరిగింది. మోడీ ప్రసంగిస్తుండగా, వేదికపై ఉన్న జిన్‌పింగ్ కాస్త అసౌకర్యంగా కనిపించడాన్ని గమనించారు. వెంటనే ప్రసంగానికి విరామం ఇచ్చి, జిన్‌పింగ్ వైపు తిరిగారు. ఆయన పక్కనే ఉన్న అనువాదకుడిని ఉద్దేశించి, "ఆయన బాగున్నారా? అని మోడీ ప్రశ్నించారు. కొద్ది క్షణాల తర్వాత మరోసారి అదే ప్రశ్న అడగగా, జిన్‌పింగ్ తలూపి ఫర్వాలేదని సూచించారు. అనంతరం మోడీ తన ప్రసంగాన్ని తిరిగి కొనసాగించారు. ఈ దృశ్యాలు దూరదర్శన్ ప్రసారం చేసిన ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. అయితే, జిన్‌పింగ్ అసౌకర్యానికి గురికావడానికి గల కారణాలు వెంటనే తెలియరాలేదు.


## ప్రపంచ శాంతికి ఐక్యంగా కృషి చేయాలి

### ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటర్రెస్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్ర ఘర్షణలతో సతమతమవుతున్న వేళ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ప్రపంచ శాంతికి పిలుపునిచ్చారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ఆయన మాట్లాడుతూ గాజా నుంచి మధ్యప్రాచ్యం, ఉక్రెయిన్, సూడాన్ వరకు ప్రపంచానికి శాంతి అత్యవసరమని నొక్కి చెప్పారు. సమ్మిళిత ప్రపంచ వృద్ధికి శాంతి పునాది అని, అది లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సదస్సులో ప్రత్యర్థి దేశాలైన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, సౌదీ విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి మధ్యప్రాచ్య నేతలు ఒకే వేదికపై ఉండటం గమనార్హం. వీరితో పాటు ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించి ఆహార, ఎరువుల సంక్షోభానికి కారణమైన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేతలందరినీ ఉద్దేశించి గుటెర్రస్ మాట్లాడుతూ ప్రతి దేశం ఐరాస చార్టర్, అంతర్జాతీయ చట్టాలకు లోబడి తమ బాధ్యతలను గౌరవించాలి. దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్రం వంటి సూత్రాలను పాటించాలి. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడంతో పాటు, అంతర్జాతీయ మానవతా, మానవ హక్కుల చట్టాలకు కట్టుబడి ఉండాలని హితవు పలికారు.




గుటెర్రస్ శాంతి పిలుపునకు బ్రిక్స్ కూటమి సానుకూలంగా స్పందించింది. శనివారం ఆమోదించిన ఉమ్మడి ప్రకటనలో పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో కాల్పుల విరమణ పాటించాలని, పాలస్తీనియన్ల హక్కులను కాపాడాలని కోరింది. అలాగే సూడాన్‌లో క్షీణిస్తున్న పరిస్థితి, మానవతా సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేస్తూ తక్షణమే శాశ్వత కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా నేతలు ఈ ప్రకటనపై సంతకాలు చేయడం దౌత్యపరమైన ముందడుగుగా భావిస్తున్నారు. గాజా, సూడాన్‌పై స్పందించిన బ్రిక్స్ కూటమి ఉక్రెయిన్ యుద్ధంపై మాత్రం తమ ఉమ్మడి ప్రకటనలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. గత ఏడాది బ్రెజిల్‌లో జరిగిన సదస్సులో కనీసం దీనిపై ప్రస్తావించిన కూటమి, ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.



## మోడీ గాలా డిన్నర్‌లో మలేసియా ప్రధాని హిందీ గీతం ఆలాపన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికర సాంస్కృతిక ఘట్టం చోటు చేసుకుంది. సదస్సుకు హాజరైన దేశాధినేతల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఒక పాత హిందీ పాట పాడి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన గానంతో ఆ సాయంత్రాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారు. తొలి రోజు రాత్రి ఢిల్లీలోని ప్రఖ్యాత భారత్ మండపంలో ఈ విందు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అన్వర్ ఇబ్రహీం, 1965 నాటి తీన్ దేవియా చిత్రంలోని కిషోర్ కుమార్ ఆలపించిన క్లాసిక్ గీతం "ఖ్వాబ్ హో తుమ్ యా కోయీ హకీకత్"ను పియానిస్ట్ సహకారంతో మధురంగా ఆలపించారు. ఎస్.డి. బర్మన్ స్వరపరిచిన ఈ గీతానికి మజ్రూహ్ సుల్తాన్‌పురి సాహిత్యం అందించారు. ఈ ప్రదర్శనకు సంబంధించిన వీడియోను అన్వర్ తన ఎక్స్ సోషల్ మీడియా ఖాతాలో స్వయంగా పంచుకున్నారు. "కొద్దిసేపు పాడేందుకు అనుమతి కోరుతున్నా" అనే అర్థం వచ్చేలా ఒక క్యాప్షన్ కూడా జతచేశారు. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్ అయింది. భారతీయ సినిమా, సంగీతం పట్ల అన్వర్ ఇబ్రహీంకు ఉన్న అభిమానంపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. ఆయన ఈ పాట పాడటం ఇదే మొదటిసారి కాదు. 2024లో భారత్‌కు వచ్చినప్పుడు కూడా ఇదే గీతాన్ని ఆలపించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

## మోడీ గాలా డిన్నర్ మిస్ అయిన జిన్‌పింగ్, క్రౌన్ ప్రిన్స్‌లు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సులో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకాలేదు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు ఇతర దేశాధినేతలు ఈ విందులో పాల్గొన్నారు. జిన్‌పింగ్ గైర్హాజరుపై చర్చ మొదలైనప్పటికీ, ఆయన విశ్రాంతి తీసుకునేందుకే హోటల్‌కు వెళ్లారని తెలిసింది. సదస్సులో పాల్గొని, ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం జిన్‌పింగ్ అలసట కారణంగా విశ్రాంతి తీసుకున్నట్లు సమాచారం. ఆయనతో పాటు అబు ధాబి క్రౌన్ ప్రిన్స్ కూడా సదస్సు ముగిశాక స్వదేశానికి తిరిగి వెళ్లడంతో విందుకు గైర్హాజ రయ్యారు. ఈనెల 12, 13 తేదీల్లో జరిగిన ఈ సదస్సులో 11 సభ్య దేశాలు, 10 భాగస్వామ్య దేశాలు పాలుపంచుకున్నాయి. ఇదిలా ఉండగా, ఈ సదస్సులో "న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. "ఈ డిక్లరేషన్‌పై ఏ సభ్య దేశం అభ్యంతరం చెప్పలేదు. ఇది చర్చల సారాంశాన్ని ప్రతిబింబిస్తూ, ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది" అని ప్రధాని వివరించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నియంత్రణ, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) సంస్కరణలు, ఉగ్రవాదాన్ని ఖండించడం వంటి కీలక అంశాలు ఈ డిక్లరేషన్‌లో ఉన్నాయి. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చైనా చేపడుతుందని జిన్‌పింగ్ ఇదే సదస్సులో ప్రకటించారు.

### భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..

# హైస్పీడ్ 'ఇవోల్గా' రైలు ప్రతిపాదన



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత్ తన పాతకాలపు రైల్వే వ్యవస్థను ఆధునీకరించే పనిలో ఉంది. ఈ నేపథ్యంలోనే వందేభారత్, వందే భారత్ స్లీపర్, నమో భారత్, బుల్లెట్ ట్రైన్ వంటి ప్రాజెక్టుల్ని తీసుకువచ్చింది. ఇదిలా ఉంటే, రష్యా తన హైస్పీడ్ ట్రైన్ టెక్నాలజీని భారత్‌కు ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఇన్నోప్రోమ్.ఇండియా కార్యక్రమంలో ఈ ప్రతిపాదనను సమర్పించినట్లు తెలుస్తోంది. రష్యాకు చెందిన ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ సంస్థ తన 'ఇవోల్గా హైస్పీడ్ రైలు'ను భారత్‌కు ఇవ్వాలనుకుంటోంది.

**గంటకు 360 కి.మీ. వేగం..**

రష్యా ప్రతిపాదించిన ఇవోల్గా హైస్పీడ్ రైలు గంటలకు 360 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. 8 బోగీలు ఉండే ఈ రైలు 642 మంది ప్రయాణికుల్ని తీసుకెళ్తుంది. దీని జీవిత కాలం 30 యేళ్లు. ఈ రైలు సుమారు 80 శాతం స్థానిక పరికరాలు ఉపయోగించి నిర్మించవచ్చని రష్యా ప్రతిపాదించింది. టెక్నాలజీ బదలీ, స్థానిక తయారీకి అవకాశం కల్పిస్తే ఇది భారత్ చేపడుతున్న 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర భారత్' లక్ష్యాలను నెరవేర్చినట్లు అవుతుంది.

**వందే భారత్‌లో భారత్‌లోకి ఎంట్రీ..**

ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ ఇప్పటికే భారత రైల్వే రంగంలో భాగస్వామిగా ఉంది. వందే భారత్ స్లీపరన రైళ్ల తయారీలో భారత్‌తో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 120 వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ ఒప్పందం కుదిరింది. ఈ అనుభవం ఆధారంగా రష్యా ఇప్పుడు భారత్‌కు హై స్పీడ్ రైలును ఆఫర్ చేస్తోంది.

**మౌలిక సదుపాయాలు ముఖ్యమే..**

హైస్పీడ్ రైలు పరుగులు తీయాలంటే దానికి అనుగుణంగా రైల్వే ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ, విద్యుదీకరణం, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ ఇలా అన్నింటిని చూసుకోవాల్సి ఉంటుంది. హైస్పీడ్ రైళ్లకు తగ్గట్టుగా ట్రాక్ మార్పులు చేయాల్సి ఉంటుంది. దీంతో రష్యా ప్రతిపాదనను అంగీకరించే ముందు రైలు వేగంతోపాటు మొత్తం ప్రాజెక్టు వ్యయం, భద్రత, నిర్వహణ, స్థానిక తయారీ, టెక్నాలజీ బదలీ వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవేళ ఇవోల్గా ప్లాన్ కార్యరూపం దాలిస్తే భారత్-రష్యా సహకారం ఇప్పుడు రైల్వేకు విస్తరించినట్లు అవుతుంది. రైళ్లను నేరుగా దిగుమతి చేసుకోకుండా స్థానికంగా ఉత్పత్తి చేయడం వల్ల భారతీయ పరిశ్రమలకు సాంకేతికంగా కలిసి వస్తుంది. ఇక్కడ ఉద్యోగాలు, ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది.

# 5.05 కి.మీ పొడవైన టేబుల్ గిన్నిస్ రికార్డు

## పిల్లల మానసిక వైద్యశాల నిర్మాణానికి నిధుల సేకరణ

**బుఖారెస్ట్, సెప్టెంబరు 13:** రొమేనియా రాజధాని బుకారెస్ట్‌లో వేలాది మంది ప్రజలు ఒకే చోట చేరి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. పిల్లల కోసం దేశంలోనే తొలి ప్రత్యేక మానసిక వైద్యశాల నిర్మాణానికి నిధులు సమీకరించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 20 వేల మంది పాల్గొన్నారు. యూనిరీ బులేవార్డ్ నుంచి రాజ్యాంగ కూడలి వరకు సుమారు 5,055 మీటర్ల పొడవున ఏర్పాటు చేసిన భారీ టేబుల్‌పై ప్రజలు కూర్చున్నారు. కమ్యూనిస్టు కాలానికి చెందిన భారీ పార్లమెంట్ భవనం ముందు ఈ కార్యక్రమం జరిగింది. రొమేనియాకు చెందిన బ్లూమ్ ది వరల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుంచి ధ్రువీకరణ లభించింది. రీసైకిల్ చేసిన పదార్థాలతో తయారు చేసిన ప్రపంచంలోనే అత్యంత పొడవైన టేబుల్‌గా ఈ రికార్డు నమోదైంది. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన అనేక టేబుళ్లను పూలు, తినుబండారాలతో అలంకరించారు. సుమారు 20 వేల మంది ఒకే టేబుల్ చుట్టూ చేరి సామాజిక సేవా కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సీనియర్



అడ్జుడికేటర్, అధికారిక జడ్జి జోవాన్ బ్రెంట్ మాట్లాడుతూ రికార్డు సాధించడమే కాకుండా దానిని ఒక మంచి సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగించడం అభినందనీయమని అన్నారు. 20 వేల మంది ఒకే టేబుల్ చుట్టూ, ఒకే లక్ష్యం కోసం చేరుకున్నారు. రికార్డులు సాధించడంతో పాటు వాటిని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు మళ్లించడం చాలా సంతోషకరమని ఆమె పేర్కొన్నారు. బుకారెస్ట్‌లోని ఒబ్రెజియా ఆసుపత్రి ప్రాంగణంలో 3,900 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న పిల్లల మానసిక వైద్య కేంద్రానికి ఈనిధులు వినియోగించనున్నారు. ఈ ప్రాజెక్టును మెట్రోపోలిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ విరాళాలు, స్పాన్సర్‌షిప్‌లతో చేపడుతున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి సుమారు 16.5 మిలియన్ యూరోలు ఖర్చవుతుందని అంచనా. ప్రస్తుతం ఒబ్రెజియా ఆసుపత్రిలోని పిల్లల మానసిక వైద్య విభాగం పాతది, రద్దీగా ఉందని ఫౌండేషన్ తెలిపింది.

పిల్లల వైద్య, మానసిక అవసరాలను ప్రస్తుత సదుపాయాలు పూర్తిగా తీర్చలేకపోతున్నాయని పేర్కొంది. కొత్త ఆసుపత్రి ద్వారా ప్రతి సంవత్సరం తీవ్రమైన మానసిక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న 5,700 మందికి పైగా పిల్లలకు సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టును చేపడుతున్నారు.



### 2029కి ఎన్‌డియే పాలిత రాష్ట్రాల్లో

# ఉమ్మడి పౌర స్మృతి

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**ముంబై, సెప్టెంబరు 13:** మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి అంశాలకు సంబంధించిన ఉమ్మడి వ్యక్తిగత చట్టాలను రూపొందించే లక్ష్యంతో ఉన్న ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని, 2029 నాటికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే పాలనలో ఉన్న మొత్తం 21 రాష్ట్రాల్లో అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యుసిసిని ప్రవేశపెట్టామని తెలిపారు. ఆదివారం ముంబైలో విలేకరుల సమా వేశంలో అమిత్ షా ప్రభుత్వం భద్రతా విధా నాన్ని ప్రస్తావిస్తూ, సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, 'ఆపరేషన్ సింధూర్' వంటి చర్యల ద్వారా ఉగ్రవాదం పట్ల 'సున్నా సహనం' విధానాన్ని నెలకొల్పామని, అన్ని రంగాల్లోనూ భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని షా తెలిపారు. 2014కు ముందు ఉన్న అవినీతి, కులతత్వం, వారసత్వ రాజకీయాల యుగం నుండి, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం హయాంలో భారతదేశం "పనితీరు ఆధారిత రాజకీయాల్ల దిశగా అడుగులు వేసిందని షా పేర్కొన్నారు. "ఇండియా ఫస్ట్" (భారతదేశానికే ప్రథమ ప్రాధాన్యత) అనే సూత్రం ప్రభుత్వ విధానానికి దిశానిర్దేశం చేస్తోందని, జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా దేశ విదేశాంగ, రక్షణ విధానాలు బలపడ్డాయని ఆయన చెప్పారు. భారతదేశ ఆర్థిక వృద్ధిని కూడా షా ప్రస్తావించారు. "ఫ్రాజైల్ ఫైవ్" (అతి బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థలు) జాబితా నుండి దేశం అగ్రశ్రేణి ఐదు ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదిగిందని ఆయన అన్నారు.

మొదటి త్రైమాసికంలో 7.8శాతం జిడిపి వృద్ధిని ఎత్తిచూపుతూ, ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలోనూ భారతదేశం ముందంజలో ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఆర్టికల్ 370, నక్సలిజం, ఈశాన్య ప్రాంత పరిస్థితుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఆయన వివరించారు. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశమని, నిరసన తెలిపే హక్కును గౌరవిస్తారని షా అన్నారు.

## చైనా సముద్ర గర్భంలో బంగారం, వెండి నిక్షేపాలు

**బీజింగ్, సెప్టెంబరు 13:** చైనా శాస్త్రవేత్తలు సముద్ర గర్భంలో ఓ భారీ గని నిధిని కనుగొన్నారు. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో చేపట్టిన పరిశోధనల్లో అత్యంత విలువైన బంగారం, వెండి నిక్షేపాలు పెద్ద మొత్తంలో ఉన్నట్లు గుర్తించారు. భూమిపై లభించే గనులతో పోలిస్తే ఇక్కడ బంగారం, వెండి నిల్వలు గణనీయంగా అధిక స్థాయిలో ఉండటం విశేషం. సింఘువా యూనివర్సిటీ, షాంఘై జియావో టాంగ్ యూనివర్సిటీ సహా పలు సంస్థల పరిశోధకులు 'జియాంగ్ యాంగ్ హాంగ్ 10' అనే నౌకలో ఈ యాత్రను చేపట్టారు. సేకరించిన నమూనాలను నౌకలోని ల్యాబ్‌లోనే విశ్లేషించగా ఆశ్చర్యపరిచే ఫలితాలు వచ్చాయి. ఇక్కడి ఖనిజాల్లో ప్రతి టన్నుకు 15.4 గ్రాముల వరకు బంగారం, 1,271 గ్రాముల వరకు వెండి ఉన్నట్లు తేలింది. ఈ నిక్షేపాలు చైనా ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలోని సముద్ర భాగంలో ఉన్నాయి. సముద్ర అంతర్భాగంలో 700 నుంచి 1,500 మీటర్ల లోతులో ఈ హైడ్రోథర్మల్ క్షేత్రం ఉంది. ఇక్కడ సముద్రపు నీటి ఉష్ణోగ్రత 315 డిగ్రీల సెల్సియస్‌కుపైగా



ఉన్నట్లు గుర్తించారు. మూడు పెద్ద శంఖాకార నిర్మాణాలతో ఉన్న ఈ ఖనిజ క్షేత్రం భవిష్యత్తులో ప్రపంచస్థాయి సముద్రగర్భ నిక్షేపంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండితోపాటు రాగి, ఇనుము, జింక్ వంటి ఇతర కీలక ఖనిజాలు కూడా ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. ఈ నిక్షేపాల పూర్తిస్థాయి పరిమాణం, ఆర్థిక ప్రయోజనాలను అంచనా వేయడానికి 2027లో మరింత కచ్చితత్వంతో కూడిన సర్వేలు చేపట్టాలని చైనా యోచిస్తోంది. అయితే ఇంత లోతులో ఉన్న హైడ్రో థర్మల్ క్షేత్రాల నుంచి ఖనిజాలను వెలికితీయడం సాంకేతికంగా చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. ప్రస్తుతం ఇలాంటి మైనింగ్ కార్యకలాపాలు ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదు.

## 19వ బ్రిక్స్ సదస్సులు వచ్చే యేడాది చైనాలో: జిన్‌పింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత్ వేదికగా 18వ బ్రిక్స్ సమ్మిట్ కొనసాగుతోంది. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఈ సదస్సుకు భారత్ అధ్యక్షత వహిస్తోంది. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ వాణిజ్యం, కృత్రిమ మేధస్సు, సరిహద్దు చెల్లింపులు, యుద్ధాలు, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల నేతలు చర్చిస్తున్నారు. ఇదే సమయంలో 19వ బ్రిక్స్ సమ్మిట్‌కు సంబంధించిన కీలక ప్రకటన వెలువడింది.

2027లో 19వ బ్రిక్స్ సమ్మిట్‌ను చైనా అధ్యక్షతన నిర్వహించనున్నట్లు చైనా అధ్య క్షుడు షీ జిన్‌పింగ్ ప్రకటించారు. చైనా ఆతిథ్యా నికి బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు అంగీకారం తెలిపాయి.

# సంక్షిప్త వార్తలు

## ట్రంప్ నివాసానికి 1.93 మిలియన్ డాలర్లు



**న్యూయార్క్, సెప్టెంబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిన్ననాటి నివాసానికి భారీ ధర పలికింది. న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో ఉన్న ట్యూడర్ శైలిలోని ఈ ఇల్లు తాజాగా 1.93 మిలియన్ డాలర్లకు విక్రయమైంది. అయితే కొన్నేళ్ల క్రితం వరకు నిరక్ష్యానికి గురై, బూజు పట్టి, పిల్లులతో నిండిపోయిన ఈ ఇంటిని ప్రస్తుతం పూర్తిగా ఆధునీకరిం చారు. ట్రంప్ తన నాలుగేళ్ల వయసు వరకు ఈ ఇంట్లోనే నివసించారు. ఆయన తండ్రి, ప్రముఖ డెవలపర్ ఫ్రెడ్ ట్రంప్, 1940లో క్వీన్స్‌లోని ఖరీదైన జమైకా ఎస్టేట్స్ ప్రాంతంలో ఈ ఇంటిని నిర్మించారు.

## జైపూర్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయిన విమానం



**జైపూర్, సెప్టెంబరు 13:** భోపాల్ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో జైపూర్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటన ఆదివారం ఉదయం జరిగింది. విమానంలోని ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారు. ఎయిరిండియా సంస్థకు చెందిన ఏఐ1886 అనే విమానం మధ్యప్రదేశ్, భోపాల్ నుంచి ఆదివారం ఉదయం ఢిల్లీకి బయల్దేరింది. ఉదయం 8.25 గంటలకు భోపాల్ నుంచి బయల్దేరాల్సి ఉంది. కాస్త ఆలస్యంగా 8.47 గంటలకు బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం ఈ విమానం ఉదయం 9.55 గంటలకు ఢిల్లీలో ల్యాండ్ అవ్వాలి. కానీ, విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా రాజస్థాన్‌లోని జైపూర్‌కు మళ్లించాల్సి వచ్చింది. చివరకు 9.40 గంటల సమయంలో జైపూర్‌లో సేఫ్‌గా ల్యాండ్ అయింది.

## గోవాలో 'గోవా ఫస్ట్' పేరుతో ఆప్-జీఎఫ్‌పీ కూటమి



**పనాజీ, సెప్టెంబరు 13:** గోవా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ, విజయ్ సర్దేశాయ్ నేతృత్వంలోని గోవా ఫార్వర్డ్ పార్టీ మధ్య ముందస్తు ఎన్నికల పొత్తు అధికారికంగా ఖరారైంది. ఈ కొత్త రాజకీయ కూటమికి గోవా ఫస్ట్ అనే పేరు పెట్టినట్లు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ప్రకటించారు. ఈ కూటమి బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఏర్పడిందని కేజ్రీవాల్ తెలిపారు. ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం పోటీ పడుతున్నట్లు కనిపించినప్పటికీ, తెరవెనుక రెండు పార్టీలు కలిసి రాజకీయ ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

## కృత్రిమమేధ సాంకేతికతను కట్టడిచేయాల్సిందే

**న్యూయార్కు, సెప్టెంబరు 13:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏఐ సాంకేతికత అభివృద్ధి వేగాన్ని తగ్గించాలని, భద్రతాపరమైన ప్రమాదాలు తీవ్రమవుతున్నాయని ప్రముఖ ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ సీఈఓ డేరియో అమొడెయ్ కీలక పిలుపునిచ్చారు. అనూహ్యంగా ఆయన వాదనకు ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్, ఎక్స్‌ఏఐ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ వంటి టెక్ దిగ్గజాలు బహిరంగంగా మద్దతు తెలపడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## జుట్టు మేకప్‌ల కోసమే రూ.4.7లక్షల డాలర్ల వ్యయం



**టెల్అవీవ్, సెప్టెంబరు 13:** ఇజ్రాయెల్ ప్రధానమంత్రులు తమ జుట్టు, మేకప్ కోసం గత ఏడేళ్లలో ప్రజాధనం నుంచి భారీగా ఖర్చు చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. 2019 నుంచి 2026 ఆగస్టు మధ్య కాలంలో సుమారు 4.7లక్షల డాలర్లు (దాదాపు రూ. 4.49 కోట్లు) ఈ అవసరాల కోసం వెచ్చించగా, ఇందులో ఏకంగా 90శాతం ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన భార్య సారా నెతన్యాహు హయాంలోనే జరగడం గమనార్హం. న్యాయవాది యారావింక్లర్‌షాలిట్ దాఖలు చేసిన అభ్యర్థనతో ఈ వివరాలు బయటకు వచ్చాయి.

## ఇండోనేసియా తీరంలో పడవ గల్లంతు

**జకార్తా, సెప్టెంబరు 13:** ఇండోనేసియా తీరంలో 240 మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ గల్లంతైంది. ఈ ఘటనపై సమాచారం అం దుకున్న రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఇండోనేసియాలోని ఈస్ట్‌జావా ప్రావిన్స్ నుంచి బోర్నియో దీవుల్లోని దక్షిణ కాలిమంటాన్ వెళ్తుండగా శనివారం ఈ ఘటన జరిగింది.



ఆదివారం టిమ్స్‌లో మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

# ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### టిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆస్పత్రికి చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు. వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించడంపై రాజనర్సింహ చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పడిపోయిన ఉద్యాన సాగు

### 1.72 లక్షల ఎకరాల్లో పంటల కోత

### గత యేడాది కంటే 2 లక్షల ఎకరాల్లో తగ్గిన విస్తీర్ణం

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు తెలంగాణలో ఆహార, వాణిజ్య పంటలతో పాటు, ఉద్యాన పంటల సాగుపైనా తీవ్ర ప్రభావం చూపాయి. గత ఏడాది కంటే ఈ సారి పంటల సాగు పడిపోయింది. రాష్ట్రంలో ఈసారి వర్షాభావం కారణంగా వరి సాగు తగ్గుతుందని, దాని స్థానంలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెరుగుతుందని రైతులు, అధికారులు భావించారు. అయితే దానికి భిన్నంగా వ్యవసాయ పంటలతో పాటు, ఉద్యాన పంటల సాగు కూడా భారీగా తగ్గుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలో గత ఏడాది ఇదే సమయానికి 11,24,001 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయగా, ఈ ఏడాది అది 9,51,134 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. ఈ మేరకు దీనికి సంబంధించి ఉద్యాన శాఖ బుధవారం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో వెల్లడించింది. దీంతో మొత్తం 1,72,867 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు తగ్గినట్లు స్పష్టమైంది. కూరగాయలు, పసుపు, మిర్చి తదితర పంటల సాగు గణనీయంగా తగ్గిపోవడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా అధికారులు పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరగడం వల్ల 2023 నుంచి 2025 వరకు ఉద్యాన పంటల సాగు క్రమంగా తగ్గుతూ వచ్చింది. సాధారణంగా తెలంగాణలో ఏప్రిల్ నుంచి జులై వరకు ఉద్యాన పంటల ప్రధాన సాగు సీజన్‌గా ఉంటుంది. ఈ సమయంలో 2023లో 12,03,380 ఎకరాలు, 2024లో 11,39,832 ఎకరాలు, 2025లో 11,24,001 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం కేవలం 9,51,134 ఎకరాల్లోనే ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. పంటల వారీగా సాగు పరిస్థితి నివేదికలో పేర్కొన్నట్లుగా గత ఏడాది ఇదే సమయానికి టమాటా, బెండ, బీరతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరలు కలిపి 53,405 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి అవి 19,259 ఎకరాలకు పరిమితమయ్యాయి.

దీంతో కూరగాయల సాగు 34,146 ఎకరాలు తగ్గింది. పసుపు, మిర్చి, అల్లం, వెల్లుల్లి, ఉల్లి, ఇతర మసాలా దినుసుల సాగు కూడా భారీగా క్షీణించింది. గత ఏడాది 1,81,735 ఎకరాల్లో సాగు చేసిన ఈ పంటలు ప్రస్తుతం 41,395 ఎకరాల్లో మాత్రమే ఉన్నాయి. అంటే ఈ విభాగంలోనే 1,40,340 ఎకరాల సాగు తగ్గింది. అలాగే మామిడి, నిమ్మ, దానిమ్మ, జామ వంటి పండ్ల తోటల విస్తీర్ణంలో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. గత ఏడాది 4,52,921 ఎకరాల్లో ఉన్న ఈ తోటలు ప్రస్తుతం 4,52,104 ఎకరాల్లో కొనసాగుతున్నాయి. ఇక ఆయిల్‌పాం సాగు మాత్రం పెరుగుదల నమోదు చేసింది. గత ఏడాది 3,10,776 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పాం, ఇతర సంబంధిత పంటలు ఈసారి 3,20,111 ఎకరాలకు చేరాయి. దీంతో కొత్తగా 9,335 ఎకరాల్లో ఈ పంటల సాగు పెరిగింది. అయితే పూల పంటలు, ఔషధ మొక్కల సాగు కూడా ఈసారి గణనీయంగా తగ్గినట్లు ఉద్యాన శాఖ నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితులు మెరుగుపడితే రానున్న రోజుల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముందని నివేదికలో అధికారులు స్పష్టం చేశారు.

# వసుధైక కుటుంబ వ్యవస్థ భారతీయ సంస్కృతికి పునాది

### శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

### ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పొన్నం కుటుంబం ఆదర్శం-దిక్సూచి : మంత్రి జూపల్లి

### ఈ యేడాది నుండి విద్య సామాజిక కళారంగాలతోపాటు వ్యవసాయరంగ ప్రముఖులకు పొన్నం సత్తయ్య జీవనసాఫల్య పురస్కార ప్రదానం : మంత్రి పొన్నం

### వైభవంగా పొన్నం సత్తయ్య జీవనసాఫల్య పురస్కారాల ప్రదానోత్సవం




గొట్టే కనకవ్వను పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న సుఖేందర్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, కృష్ణారావు, లక్ష్మణ్‌కుమార్, హరగోపాల్, పొన్నం ప్రభాకర్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** అనాది కాలంగా వస్తున్న వసుధైక కుటుంబ వ్యవస్థ భారతీయ సంస్కృతికి పునాదని, అందుకు తార్కాణమే పొన్నం కుటుంబమని తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో పొన్నం సత్తయ్యగౌడ్ 16వ వర్ధంతి ని పురస్కరించుకుని జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి విశిష్ట అతిథులు పిసిసి చీఫ్ బి.మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, తదితరులతో కలిసి ముందుగా జ్యోతిప్రకాసనంచేసి పొన్నం సత్తయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. అనంతరం వ్యవసాయం-ఎం.కోదండరెడ్డి; సాహిత్యం-వెలిచాల కొండలరావు; కళలు-గొట్టే కనకవ్వలను ఘనంగా సత్కరించి పొన్నం సోదరులు తమ తండ్రిని స్మరించుకుంటూ గత నాలుగేళ్లుగా ప్రతీయేటా ఆయా రంగాల ప్రముఖులకు అందిస్తున్న పొన్నం సత్తయ్య జీవనసాఫల్య పురస్కారం, పురస్కారంతోపాటు 50వేల రూపాయల నగదు బహుమతి ప్రదానం చేసి తండ్రిపేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేస్తున్న వారి కృషిని ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్స రాలుగా విద్య, సామాజిక, కళారంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులతోపాటు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు ఈ సంవత్సరం నుండి వ్యవసాయ రంగంలో విశేష కృషిచేస్తున్న ప్రముఖులకు పొన్నం సత్తయ్య జీవనసాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొదటిసారిగా రైతుల హక్కులు, సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగా భివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్న ఎం.కోదండరెడ్డి వ్యవసాయ రంగంలో ఈ పురస్కారం ఇస్తున్నట్లు వెల్లడిం చారు. మా తల్లిదండ్రులు పెద్దగా చదువు కోకపోయినా మాకు విద్యతోపాటు క్రమశిక్షణ, విలువలు, సమాజంపట్ల బాధ్యతను నేర్పించారన్నారు. కుటుంబం ఐక్యంగా, ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతీయేటా ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ విశదీకరించారు. పిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పిల్లలు జీవితంలో గొప్పగా ఎదిగి ప్రయోజకులుగా నిల వడం చూసినప్పుడు తండ్రికికల్గే ఆనందం వర్ణనాతీ తమని, సత్తయ్య పెద్దకుమారుడు అశోక్‌గౌడ్ న్యాయ రంగంలో, రెండో కుమారుడు రవిచంద్రగౌడ్ జర్న లిజంలో మూడో కుమారుడు ప్రభాకర్‌గౌడ్ రాజకీయరంగంలో అద్భుతంగా రాణిస్తున్నారని, ఇద్దరు కుమార్తెలు మంచిస్థాయిలో స్థిరపడ్డారని వివరించారు.

రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పొన్నం కుటుంబం ఆదర్శం-దిక్సూచి, నిలు వెత్తు నిదర్శనమన్నారు.

ప్రేమానుబంధాలు, ఆప్యా యతలు, పరస్పర సహకారం కుటుంబ ఐక్యతకు ప్రతి బింబాలని, ఆస్తులకన్నా పొన్నం సత్తయ్య విలువలతో కూడిన గొప్ప వారసత్వ సంపద, మంచి ఆలోచనా విధానాలు, ధైర్యంతో కష్టాలను ఎదుర్కొనేతత్వం, సమా జం పట్ల బాధ్యతనే తరగని సంపదను ఇచ్చారన్నారు. వీటివల్లే మంత్రి ప్రభాకర్ ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా విలువలతో కూడిన రాజకీయాలు నెరుపుతున్నారని అభినందించారు.

పొన్నం సత్తయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా వారి ఆలోచనలు, విలువలు, ఆశయాలు నేటికీ మనకు స్ఫూర్తిగా ఉన్నాయన్నారు. కుటుంబాల్లో ప్రేమ, గౌరవం, పరస్పర సహకారం పెరిగితే సమాజంలో శాంతి, సామరస్యాలు పెరుగు తాయని పొన్నం కుటుంబాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులిచ్చే ఆస్తులకన్నా నేర్పించే సంస్కారం, సంప్రదాయం, మానవత్వం జీవితానికి నిజమైన సంపద అని, అందుకు నిలువెత్తు నిదర్శనం పొన్నం సత్తయ్యగౌడ్ అని ప్రొఫెసర్ హరగోపాల్ స్పష్టం చేశారు. ఆధునిక సమాజంలో మానవసంబంధాలు బలహీనపడి కోపం, హింస, హత్యలు, విభేదాలు పెచ్చుపెరిగి సమాజం అత లాకుతలమౌతున్న వేళ పొన్నం సత్తయ్య చూపినమార్గం శిరోధార్యమన్నారు.

తల్లిదండ్రుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ స్మరించుకుంటూ గౌరవించడం, వారి ఆశ యాలను కొనసాగించడం పిల్లలకుదక్కే నిజమైన గౌరవ మని హరగోపాల్ నొక్కివక్కాణించారు. ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తదితరులు ప్రసంగించి పొన్నం సత్తయ్యగౌడ్‌కు ఘననివాళులర్పించారు.

# ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు ఈ వారంలోనే పత్రాలు

### 6,643 మంది క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి - 5,521 మంది అర్హులుగా నిర్ధారణ

### బ్రోకర్లు, మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దు : హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్

**హైదరాబాద్,సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజి గృహాల లక్కీడ్రా ద్వారా మొత్తం 7,340 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, వారిలో ఇప్పటివరకు 6,643 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి కాగా, 5,521 మంది అర్హులుగా నిర్ధారించబడ్డారని తెలం గాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ తెలిపారు.మిగిలిన అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలనను కూడా ఈ వారంలోనే పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హు లుగా నిర్ధారించబడిన లబ్ధిదారులకు ఈ వారంలోనే అధికారిక కేటాయింపు పత్రాలు (అలాట్‌మెంట్ లెటర్స్) జారీ చేస్తామని తెలిపారు. లక్కీడ్రాలో ఎంపికైన అభ్య ర్థులు తమకు ఇల్లు కేటాయించబడుతుందా లేదా అనే ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన, అర్హత నిర్ధారణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు బ్రోకర్లు, మధ్య వర్తులు ఇల్లు మంజూరు చేయిస్తామని లేదా అధికారులతో మాట్లాడి సహాయం చేస్తామని చెబుతూ అమాయక లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.'గృహాల కేటాయింపు ప్రక్రియలో బ్రోకర్లు, మధ్యవర్తులు లేదా ఇతర వ్యక్తులకు ఎలాంటి పాత్ర లేదు. లబ్ధిదారులు ఎవరికీ లంచం, కమీషన్ లేదా ఇతర రూపంలో డబ్బులు చెల్లించవద్దు. గృహాల కేటాయింపు పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన అర్హతలు, అధికారిక ప్రక్రియ ఆధారంగానే జరుగుతుంది అని వి.పి. గౌతమ్ స్పష్టం చేశారు. గృహానికి సంబంధించిన మొదటి విడత మొత్తాన్ని చెల్లించాల్సిన అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు, చెల్లించాల్సిన మొత్తం, చెల్లింపు గడువు, ఇతర సూచనలను కేటాయింపు పత్రంతోపాటే అధికారికంగా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. కేటాయింపు పత్రంలో పేర్కొన్న అధికారిక బ్యాంకు ఖాతాకు మాత్రమే నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలని సూచించారు.ఇతర వ్యక్తులు తెలిపే ఖాతాలకు లేదా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు జమ చేయ వద్దని హెచ్చరించారు. ఇల్లు మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగినా లేదా అనధికారిక ఖాతాలకు చెల్లించాలని కోరినా వెంటనే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.లబ్ధిదారులు గృహాల కేటాయింపు, క్షేత్రస్థాయి పరిశీలన, కేటాయింపు పత్రాలు, మొదటి విడత చెల్లింపు తదితర అధికారిక సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చునని పేర్కొన్నారు. తెలంగాణ హౌజింగ్ బోర్డు అధికారికంగా జారీ చేసే ప్రకటనలు,కేటాయింపు పత్రాలు,సంబంధిత అధికారుల సూచనలను మాత్రమే విశ్వసించాలని వైస్‌చైర్మన్, హౌసింగ్ కమిషనర్ లబ్దిదారులకు విజ్ఞప్తి చేశారు.

# గ్యాస్ బుకింగ్ పరిమితి 25 రోజులకు కుదింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** భారత ప్రభుత్వం గ్యాస్‌బుకింగ్ పరిమితి 25 రోజులకు తగ్గించడంతో వినియోగదారులకు ఊరట లభిం చింది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఈ యేడాది మార్చి నుంచి గ్యాస్ రీఫిల్ బుకింగ్‌లపై కేంద్రప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో పట్టణ, గ్రామీణ వినియోగదారులు పొదుపుగా గ్యాసు వినియోగిస్తున్నారు. ఒక సిలిండర్ బుక్ చేసిన తర్వాత మళ్లీ సిలిండర్ కోసం పట్టణ ప్రాంతాల వారు 35 రోజుల తర్వాత, గ్రామీణ ప్రాంతాలవారు 45 రోజుల తర్వాత బుకింగ్ చేసుకోవడానికి పరిమితి విధించారు. తాజాగా కేంద్రం 25 రోజులకే గ్యాస్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దీంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.యుద్ధకాలం నాటినుంచి కొత్త గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేయడం లేదు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రం కొత్త కనెక్షన్లను జారీచేస్తే వేలాది మంది వినియోగదారులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఎప్పుడు అనుమతి ఇస్తుందోనని చాలా మంది ఎదురుచూస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 1.3కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఐఒసిఎల్,హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ గ్యాస్ కంపెనీలు వారి అధీకృత ఏజెన్సీలతో వినియోగదారులకు నిరంతరం వంటగ్యాస్ సరఫరా చేస్తారు.రోజుకు రెండున్న లక్షల సిలెండర్లు రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల నుంచి డిమాండ్ ఉంటుంది. కేంద్రం ఆంక్షలు విధించినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం చాలా తగ్గింది. గతంలో 30-35 రోజులకు ఒకసారి ఖాళీ అయ్యే సిలిండర్ను 45 -50 రోజుల వరకు పొదుపుగా వాడుకున్నారు. చాలా మంది కట్టెల పొయ్యిలను ఉపయోగించి గ్యాస్ను ఆదా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు సైతం కట్టెల పొయ్యిపైనే వంటలు చేశారు. తాజాగా కేంద్రం ఆంక్షలు సడలించడంతో మళ్లీ 25 రోజుల వ్యవధిలోనే సిలిండర్ బుక్ చేసుకోవడానికి అవకాశం వచ్చింది. అదే విధంగా కొత్త కనెక్షన్ కోసం వేచి చూసే వినియోగదారులు కూడా తమకు అనుకూలంగా తీపివార్త వినిపించాలని కోరుకుంటున్నారు.



# గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో మాజీ కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మాజీ కేంద్రమంత్రి డా. మహేంద్ర నాథ్ పాండే ఆదివారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మాజీ కేంద్రమంత్రి డా. మహేంద్రనాథ్‌పాండే పరస్పరం వివిధ సమకాలీన అంశాలపై చర్చించారు.

# తెలంగాణ భవన్‌ను నాటకాలకు అద్దెకివ్వండి!

### జబర్దస్త్ కామెడీ షో కూడా దిగదుడుపే

### బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీపై మెట్టు సాయికుమార్ సెటైర్లు

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణభవన్‌లో బిఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీపై తెలంగాణ మత్స్య అభివృద్ధి సహకార సంస్థ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ మేరకు ఆదివారం గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మీడి యాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు మాక్ అసెంబ్లీ పేరుతో కపట నాటకాలు, డ్రామాలు ప్రదర్శించారని ఎద్దేవా చేశారు. ఆ కార్యక్రమాన్ని చూస్తే జబర్దస్త్ కామెడీ షో కూడా దిగదుడుపేనని, ఇకపై తెలంగాణ భవన్‌ను నాటకాలకు అద్దెకివ్వడం మంచిదని వ్యాఖ్యానించారు.సురభి నాటక కంపెనీలు రంగస్థలం నుంచి సినిమాల వరకు ఎంతోమంది గొప్ప కళాకారులను అందించాయని, అయితే తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేతలు ప్రదర్శించిన నటన వాటన్నింటినీ మించిపోయిందని సాయికుమార్ అన్నారు. కెటిఆర్, హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని తదితరులకు 'నవరస సార్వభౌమ కళాప్రపూర్ణ, కళా తపస్వి' వంటి బిరుదులు సరిపోతాయని అన్నారు. వచ్చే యేడాది వారందరికీ గద్దర్ అవార్డులు ఇవ్వాల్సిందేనని సెటైర్ వేశారు. పేజీల కొద్దీ డైలాగులు చెబుతూ, కపట ఏడుపులతో కార్యక్రమాన్ని రక్తికట్టించారని విమర్శించారు. ఇక్కడ నాటకాలు వేయబడును అంటూ బోర్డు పెట్టండని సలహా ఇచ్చారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న సిఆర్‌పి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

# సిఆర్‌పిలను రెగ్యులర్ చేయాలి


### ప్రామిస్‌డే సందర్భంగా సిఆర్‌పి యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** సీఆర్‌పీలను రెగ్యులర్ చేసి, ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఆర్‌పీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాద్య నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సీఆర్‌పీ యూనియన్ తెంగాణ (ఏఐటియూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈధర్నాకు పాద్య నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఆర్‌పీలను రెగ్గులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 2023, సెప్టెంబర్ 13న వరంగల్ లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆ హామీని గుర్తు చేస్తూ సెప్టెంబర్ 13ను ప్రామిస్‌డేగా నిర్వహిస్తున్నామని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ సలహాదారులు బాలరాజు మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీని తక్షణమే అమలుచేసి, సీ ఆర్‌పీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐటియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా సీఆర్‌పీల సమస్యలు పరిష్కారం కాలేదని ఆరో పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్ట దేవేందర్, కార్యదర్శి పోలే రమేష్, ఉపాధ్యక్షులు సేవియా, రాష్ట్ర నాయకులు మల్లేష్, యూసఫ్ అలీ, శివరాజ్, కృష్ణశంకర్, మధునాయక్, యాదగిరి, జలంధర్, సుదర్శన్, అశోక్, వెంకటేష్, నర్సింహ, లింగం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో నడిచింది కాంగ్రెస్ - బిఆర్ఎస్ పార్టీల నాటకమే

### రూ.33 వేల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదు?

### లక్షల కోట్ల భూదోపిడీ గుట్టు విప్పా: బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఐదు రోజులుగా శాసనసభ సమావేశాలు సాగుతున్న తీరును రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా సమస్యలను నిలదీస్తున్న బీజేపీ గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బీజేపీ బాధ్యతాయుతంగా అవినీతి, భూ అక్రమాలపై గళమెత్తుతుంటే మంత్రులు మైకులు కట్ చేయిస్తూ అసెంబ్లీని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మొదటి మూడు రోజుల పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై ఒకరినొకరు దూషించుకుంటూ ఉద్దేశపూర్వకంగా సభ సమయాన్ని వృథా చేశాయని, చివరి రోజున 22ఏ నిషేధిత జాబితాపై చర్చ పేరుతో సంబంధిత మంత్రి ఏకంగా నాలుగు గంటల పాటు మతిభ్రమించినట్లు మాట్లాడారే తప్ప 50 లక్షల మంది రైతులు, పేద వర్గాలకు సంబంధించిన సమస్య పరిష్కారానికి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 22ఏ సెక్షన్లను కోర్టు నిర్ణయించిందని మంత్రి చెప్పడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని, చట్టాలు చేసేది చట్టసభలు, జీవోలు ఇచ్చేది ప్రభుత్వమే తప్ప కోర్టులు కావని స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలపై నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, 13 వేల లావాదేవీల ద్వారా దాదాపు 23 లక్షల ఎకరాల ఆస్తులు అన్యాక్రాంత మయ్యాయని మంత్రులే సభలో అంగీకరించిన వీడియో రికార్డులను ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. ఇంత భారీ కుంభకోణం జరిగిందని తెలిసినా ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, భూములను ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని నిలదీశారు. రిజిస్ట్రేషన్ అనేది టైటిల్ డీడ్ కాదని, తప్పుడు రిజిస్ట్రేషన్లను రద్దు చేసే పూర్తి అధికారం ప్రభుత్వానికి ఉన్నా ఎందుకు తాత్సారం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. దోపిడీ జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ఆడిట్ నివేదికను ప్రజల ముందు ఎందుకు ఉంచడం లేదని, గతంలో వేసిన సిట్ కాకుండా కొత్తగా వేసిన సెట్ కేవలం సెట్టింగ్‌లు చేసుకునేందుకేనా అని ప్రశ్నించారు. ఈ మొత్తం భూ బాగోతంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అనే పేరుతో హైదరాబాద్ పరిసరాల్లోని వేలాది ఎకరాల అసైన్డ్ భూములను కారుచౌకగా కాజేసేందుకు కొత్త దందా మొదలుపెట్టారని ఏలేటి ఆరోపించారు. పేద అసైనీల నుంచి ముందే బాండ్ పేపర్లు, నోటరీలు రాయించుకొని, తర్వాత వారికే ఫ్రీహోల్డ్ కల్పిస్తున్నట్లు చట్టాలు తెచ్చి లక్షల కోట్ల విలువైన ఆస్తులను తమ పేర్ల మీద మార్చుకునే పథకం రచిస్తున్నారని విమర్శించారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని ఐడీపీఎల్ కు చెందిన 333 ఎకరాల విలువైన భూమి ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ, దాదాపు రూ.33 వేల కోట్ల విలువైన ఈ భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదని, ప్రభుత్వ పెద్దలకు ఇందులో 30 శాతం వాటాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. అక్రమాలు జరిగినట్లు తేలినా బాధ్యులైన అధికారులపై పీడీ యాక్ట్ పెట్టడం గానీ, సస్పెండ్ చేయడం గానీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

హైడ్రా పేరిట ప్రభుత్వం పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. మూసీ నదికి 100 మీటర్ల దూరంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల చిన్న ఇళ్లను రాత్రికి రాత్రే బుల్డోజర్లతో కూల్చివేస్తున్న ప్రభుత్వం, మూసీ నది మధ్యలోనే మూడు ఎకరాల స్థలాన్ని ఆక్రమించిన పెద్దల జోలికి ఎందుకు వెళ్లడం లేదని, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇచ్చిన నోటీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకే చెందిన ప్రజాప్రతినిధుల భూవ్యవహారాలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు మౌనం వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు. మరోవైపు సంబంధిత మంత్రికి ఉన్న వ్యాపార ప్రయోజనాలు, అక్రమ మైనింగ్ వ్యవహారాలపై నోటీసులు రావడం, ప్రభుత్వంలో ఉంటూనే రూ.1,400 కోట్ల కాంట్రాక్టులను రివైజ్డ్ ఎస్టిమేషన్ల పేరుతో రూ.4,000 కోట్లకు పెంచుకోవడం ముమ్మాటికీ కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్, క్విడ్‌ప్రోకో కాదా అని సూటిగా ప్రశ్నించారు.

అధికారంలో ఉన్నామని విర్రవీగితే చూస్తూ ఊరుకోబోమని, తమ వద్ద 200లకు పైగా పక్కా ఆధారాలతో కూడిన కేసు స్టడీలు ఉన్నాయని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఆడుతున్న ఈ దోపిడీ నాటకాన్ని ప్రజల ముందు బట్టబయలు చేస్తామన్నారు. ఈ అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను, గౌరవ గవర్నర్‌ను కలుస్తామని, అవసరమైతే రాజ్యాంగ పుస్తకం చేతబట్టి తిరిగే రాహుల్ గాంధీ నివాసం ముందే ఢిల్లీలో ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ నీతిని దేశవ్యాప్తంగా ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

# అసెంబ్లీ ఘటనపై కెటిఆర్ పిఎ, పిఆర్ఒలకు నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పీఏ, పీఆర్ఓకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్ఓ మహేష్‌కు సైఫాబాద్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. అసెంబ్లీ గేట్3 వద్ద ఈ నెల 7న చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించి నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. నోటీసుల మేరకు మహేందర్‌రెడ్డి, మహేష్ రేపు సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరుకావాల్సి ఉంది. అసెంబ్లీ గేట్-3 వద్ద జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటన సమయంలో ఏం జరిగింది? అక్కడ ఎవరు ఉన్నారు? ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

# మంచిర్యాలలో రైలు కిందపడి తండ్రి, కుమారుడు ఆత్మహత్య

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** మంచిర్యాలలో ఆదివారం రైలు కింద పడి తండ్రి, కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులు ఎండపల్లి మండలం గొడిసెలపేటకు చెందిన దొంత మల్లేశ్, నాగరాజుగా గుర్తించారు. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితమే దొంత మల్లేశ్ భార్య క్యాన్సర్‌తో మృతి చెందారు.

# కోకాపేట్‌లో పల్టీలు కొట్టిన ఇన్నోవా క్రిస్టా

## ఇంటర్ విద్యార్థి దుర్మరణం

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** కోకాపేటలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బర్త్‌డే పార్టీ అనంతరం ఔటర్ రింగ్ రోడ్డుపై లాంగ్ డ్రైవ్‌కు వెళ్లిన 9 మంది మైనర్లలో ఒకరు దుర్మరణం చెందాడు. నియో పోలీస్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా క్రిస్టా వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో మదన్ మోహన్ రెడ్డి అనే ఇంటర్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. స్నేహితుడి పుట్టిన రోజున పార్టీకి వెళ్లిన విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డుపై లాంగ్ డ్రైవ్‌కు వెళ్లిన 9 మంది మైనర్లలో ఒకరు దుర్మరణం చెందాడు. నియో పోలీస్ వద్ద ఇన్నోవా క్రిస్టా పల్టీలు కొట్టడంతో ఇంటర్ విద్యార్థి అయిన మదన్ మోహన్ రెడ్డి మరణించాడు. మిగతా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా హైటెక్ సిటీలో తేజు కాలేజీలో ఇంటర్ చదువుతున్నట్టు సమాచారం. తమన్ వర్మ అనే విద్యార్థి బర్త్‌డే పార్టీకి వెళ్లి లాంగ్ డ్రైవ్ కోసం ఔటర్ రింగ్ రోడ్డుపైకి వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

# ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

## రైలుపై తెగిపడ్డ విద్యుత్ తీగలు.. రైలును నిలిపేసిన లోకో పైలెట్

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** హైదరాబాద్ మౌలాలి సమీపంలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుపై విద్యుత్ తీగలు తెగిపడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విజయవాడ నుంచి సికింద్రాబాద్ వస్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌పై విద్యుత్ తీగలు తెగిపడటంతో అప్రమత్తమైన లోకో పైలెట్ రైలును వెంటనే నిలిపివేశారు. విద్యుత్ తీగలు రైలుపై పడటంతో రైలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తతతో వ్యవహరించిన లోకో పైలెట్ రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బిసి కులగణనకు ప్రత్యేక కోడ్‌లు కేటాయించాలి

## మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా బీసీ కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన చేపట్టాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కులగణన చేస్తామని గతంలో హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పిందని ఆరోపించారు. బీసీ కులగణన అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. ఆదివారం ఢిల్లీలోని జవహర్ భవన్‌లో నిర్వహించిన ఓబీసీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణనను శాస్త్రీయంగా నిర్వహించాలంటే ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలంటే కులగణన కీలకమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీ కులాలకు కూడా ప్రత్యేక కోడ్‌లు కేటాయించాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో పిలుస్తున్న పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సమగ్ర జాబితా రూపొందించాలన్నారు. ధోబి-రజక, నాయీ బ్రాహ్మణ-మంగలి, గౌడ్-ఈడిగ, శ్రీశైన-నాడార్, ముదిరాజ్, ఫిషర్‌మెన్ తదితర కులాలకు రాష్ట్రాల వారీగా వేర్వేరు పేర్లు ఉన్నాయని తెలిపారు. కేవలం కులం పేరును అడిగి నమోదు చేస్తే స్పెల్లింగ్, ఉచ్చారణలోని చిన్నపాటి తేడాల కారణంగా ఒకే కులానికి చెందినవారు వేర్వేరు కులాలుగా నమోదయ్యే ప్రమాదం ఉందన్నారు. లక్షలాది కులాలు ఉన్నట్లు నమోదు చేసిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో 1931లో కులగణన నిర్వహించినప్పుడు సుమారు 4,300 కులాలు నమోదైన విషయాన్ని గుర్తుచేశారు. సరైన కుల జాబితా, కోడ్ వ్యవస్థ లేకుండా కులగణన నిర్వహిస్తే మళ్లీ అనేక రకాల పేర్లు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాల వారీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల జాబితాలను పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్తంగా ఓబీసీ కులాల సమగ్ర జాబితాను రూపొందించాలని కోరారు. ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ ఇవ్వాలని, అప్పుడే వృత్తి ఆధారిత కులాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. లేకపోతే బీసీ కులగణన పేరుతో మోసం చేసినట్లవుతుందని వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో లోక్‌అదాలత్ సక్సెస్..

**3,896 సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు**

**క్రిమినల్ కేసులు 1.51 లక్షలకు పైచిలుకు పరిష్కారం**

**కేసుల పరిష్కారం తొలి మూడు స్థానాల్లో హైదరాబాద్, ఖమ్మం, గద్వాల యూనిట్లు**

**తరువాతి స్థానంలో వరంగల్, మల్కాజిగిరి**

**హైదరాబాద్,సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించారు. సైబర్ నేరాల బాధితులకు రూ. 42.29 కోట్లు తిరిగి అందిచామని పోలీసుశాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందు కోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. డిజిపి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944 కేసులు), ఖమ్మం (10,955 కేసులు), గద్వాల (8,469 కేసులు), వరంగల్ (8,404 కేసులు), మల్కాజ్‌గిరి (8,109 కేసులు) ముందున్నాయి. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమష్టి కృషితో ఇంత పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించడం సాధ్యమైందని డిజిపి ఆనంద్ తెలిపారు. ఈ సమన్వయంతో కూడిన ప్రయత్నం వల్ల లోక్ అదాలత్ గొప్ప విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

# ఖైరతాబాద్ బడా గణేశ్, బాలాపూర్ గణేశ్ మండపాలను సందర్శించిన టిజిఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్

**వినాయక ఉత్సవాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష**

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వినాయక ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గణేష్ మండపాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా, విద్యుత్ భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు టీజీఎస్పీ డీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రముఖ ఖైరతాబాద్ బడా గణేష్ మండపాన్ని సీఎండీ సందర్శించి విద్యుత్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశమై విద్యుత్ సరఫరా, బ్యాకప్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గారితో సమావేశమైన సీఎండీ, మండప పరిసరాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు), ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా వ్యవస్థలు, అత్యవసర బ్యాకప్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వినాయక ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జన ఊరేగింపుల వరకు విద్యుత్ వ్యవస్థలను 24 గంటల పాటు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామని, అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించామని తెలిపారు.

అనంతరం సీఎండీ బాలాపూర్ గణేష్ మండపాన్ని సందర్శించి అక్కడి విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించారు.

బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి, ఇతర కమిటీ సభ్యులతో సమావేశమై ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాకు సంబంధించిన అవసరాలు, స్థానిక పరిస్థితులను తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. బాలాపూర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లు, భద్రతా ప్రమాణాలు, అత్యవసర స్పందన వ్యవస్థలను పరిశీలించిన సీఎండీ, వినాయక ఉత్సవాలు ముగిసే వరకు ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించుకునేలా కమిటీ సభ్యులకు సూచించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గణేష్ మండపాలకు అవసరమైన ఉచిత విద్యుత్ కనెక్షన్లు, ప్రత్యేక విద్యుత్ ఏర్పాట్లు, అత్యవసర సిబ్బంది నియామకం, 1912 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ వంటి చర్యలు చేపట్టామని సీఎండీ తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, డొల్లతనం బట్టబయలు

## సిరికొండ మధుసూదనాచారి

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన శాసన మండలి సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, డొల్లతనం బట్టబయలైందని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాసన సభ, మండలి సమావేశాల్లో ప్రభుత్వం వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. సభను నడిపే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, పోలీసుల మోహరింపు, లైవ్ కవరేజీలో వివక్ష చూస్తుంటే ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా జరగలేదని ఆరోపించారు. ప్రజా సమస్యలపై తామిచ్చిన 20 అంశాలను, వాయిదా తీర్మానాలను పక్కనపెట్టి, కేవలం బిల్లుల ఆమోదానికే ప్రాధాన్యత ఇస్తూ చర్చకు భయపడ్డారని పేర్కొన్నారు. చర్చలకు, పరిష్కారాలకు వేదికగా నిలబడాల్సిన కౌన్సిల్ ఆరు రోజులు కుట్రలకు వేదికలాగా అయ్యిందని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షాలకు ఇబ్బంది పెట్టడానికి, పాలకపక్షానికి ఇష్టారీతిన వ్యవహారించడానికి కారణమైందని దుయ్యబట్టారు. పలు ప్రధాన అంశాలపై సభా వాయిదా తీర్మాణాలు బాధ్యతగా ప్రవేశపెట్టగా ఏ ఒక్క అంశం మీద ప్రభుత్వం చర్చకు ముందుకు రాలేదని, ప్రజా సమస్యలు చర్చించడానికి నైతిక స్థైర్యం లేక చర్చకు అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు.

# దశలవారీగా అందుబాటులోకి సీప్లేన్ సేవలు



**అమరావతి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటక ఆకర్షణకు కీలక కార్యచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలను సీప్లేన్లతో అనుసంధానించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పది ప్రాంతాల్లో ఏరోడ్రోమ్‌లు అభివృద్ధి చేసి, దశల వారీగా సీప్లేన్ సేవలను అందుబాటులోకి తీసు కురావాలని నిర్ణయించింది. స్లీ ప్లేను నడిపేందుకు కేంద్రం సాయంతో వాటర్ డ్రోమ్‌ల నిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ త్వరలో టెండర్లు పిలవనుంది. ప్రతి ఏరోడ్రోమ్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేయనున్నారు. 10 ప్రాంతాల్లో కలిపి రూ.200 కోట్లతో మినీ విమానాశ్రయాల తరహాలో మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగానే 10 ప్రాంతాల్లో సీప్లేన్ సేవలను అందించేందుకు స్కై హోప్ ఏవియేషన్, మారిటైం ఎనర్జీ హెలీ ఎయిర్ సర్వీసెస్ మె ఎయిర్ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ రెండు సంస్థల ప్రతిపాదనలకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా రాష్ట్రంలో సీప్లేన్ సేవల ఏర్పాట్లు వేగవంతం చేసారు. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు సీప్లేన్ ప్రయాణానికి ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. గతేడాది నిర్వహించిన ఈ ట్రయల్ రన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సీప్లేన్‌లో శ్రీశైలం వరకు ప్రయాణించారు. ఇప్పుడు ఈ అనుభవాన్ని మరింత విస్తరించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విజయవాడ, శ్రీశైలం, తిరుపతి పరిధిలోని రాయలచెరువు, సూర్యలంక, గండికోట, కాకినాడ, విశాఖ, అరకు సమీపంలోని జోలాపుట్, లంబసింగి సమీపంలోని తాజంగి రిజర్వాయర్, పోలవరంలో ఏరోడ్రోమ్‌లు అభివృద్ధి చేయనున్నారు. 10 ప్రాంతాల్లో ఒకేసారి సీప్లేన్ సేవలు ప్రారంభించకుండా, ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి దశలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు. తొలిదశలో విజయవాడ, శ్రీశైలం, విశాఖ, లంబసింగి, సూర్యలంక, కాకినాడ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. ప్రారంభ దశలో ప్రయాణికుల సంఖ్య, ఆదాయం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేటర్లకు కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకం కింద విజిఎఫ్-లోటు భర్తీ నిధి ద్వారా కొంతకాలం ఆర్థిక సహాయం అందించనుంది. ఈ ఏరోడ్రోమ్‌లు కేవలం సీప్లేన్ల కోసమే కాకుండా పర్యాటక బోట్లకు కూడా ఉపయోగపడేలా డిజైన్ చేయనున్నారు. విజయవాడ, దిండి, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే పర్యా టక బోటింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రైవేట్ సంస్థలకు హౌస్‌బోట్ల నిర్వహణకు కూడా అనుమతులు ఇస్తున్నారు. సీప్లేన్ సేవలు, బోటింగ్, హౌస్‌బోట్ టూరిజంను అనుసంధానం చేసిపర్యాటకులకు మరింత మెరుగైన అనుభూతిని అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

**ఇన్‌స్టా పరిచయస్తులు పలు దఫాలుగా అత్యాచారం**

**మత్తు చాకెట్లు, సిగరెట్లు, గంజాయి, మద్యానికి బానిసగా మార్చి లొంగదీసుకున్న కామాందులు**

**2025 నుంచి నేటి వరకు కొనసాగిన ఆకృత్యాలు**

# అల్వాల్‌లో మైనర్ బాలికపై కీచక పర్వం

**హైదరాబాద్ (అల్వాల్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఇన్‌స్టా పరిచయం ఆమెను మత్తు పదార్థాలకు బానిస చేయగా ఇదే అదనుగా కామాందులు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ముక్కు మోహం తెలియని వారిని స్నేహితులుగా చేసుకుంటే జరిగే పరిణామాలకు ఇది పరాకాష్టగా నిలిచింది. సామాజిక మాంధ్యమాలు ద్వారా పరిచయమైన వ్యక్తులు రాక్షసత్వానికి మైనర్ బాలిక జీవితం బలైంది. రెండు సంవత్సరాలు నుంచి కొనసాగిన కీచక పర్వంలో 30 మంది నిందితులుగా తేలారు. అల్వాల్‌లో సంచలనంగా మారిన ఉదంతంలో తనపై జరిగిన లైంగిక దాడికి సంబంధించి వివరాలను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మైనర్ బాలిక ఈ విధంగా పేర్కొంది. అల్వాల్‌కు చెందిన 16 సంవత్సరాలు మైనర్ బాలిక ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పదవ తరగతి చదువుతున్న సమయంలో ఇన్‌స్టాలో జెర్రీ వరుణ్‌తో పరిచయమైంది. మైనర్ బాలికతో మాయ మాటలు చెప్పి నిందితుడు ఆమె నమ్మకాన్ని కూడగట్టుకున్నాడు. అనంతరం మత్తు చాకెట్లు, గంజాయి, మద్యాన్ని ఆమెకు అలవాటు చేశాడు. బాలిక మద్యం మత్తులోకి జారుకున్న తరువాత తన కారులో బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. జెర్రీ వరుణ్ ద్వారా పరిచయమైన రోమాల వరుణ్ బాలికతో స్నేహం చేసి మద్యం, సిగరెట్లు, గంజాయి తదితర మత్తు పదార్థాలు ఇస్తూ కొంపల్లిలోని నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకుని వెళ్ళి ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టాడు. 2025లో ఇన్‌స్టా ద్వారా డేవిడ్ వరుణ్ అనే యువకుడు బాలికకు పరిచయం అయ్యాడు.

అదే సంవత్సరం దసరా వేడుకలులో బాగంగా మచ్చబొల్లారం తోట పెంటారెడ్డి గార్డెన్స్‌లో జరిగిన వేడుకలులో మద్యం మత్తులో ఉన్న బాలికను ముద్దు పెట్టుకోవడంతో అప్పట్లో గొడవ జరిగింది. ఈ నెల 9వ తేదీన బాలిక తండ్రి కూతురి వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మందలించడం జరిగింది. తండ్రిపై కోపంతో ఇంటి నుంచి బాలిక బొల్లారం రైల్వే స్టేషన్‌కు వెళ్ళింది. రైల్వే స్టేషన్‌కు పరిచయస్తుడైన నీరజ్ వ్యక్తిని బాలిక పిలిచింది. నీరజ్ తన స్నేహితుడు విక్కీని అక్కడి రమ్మన్నాడు. ఇద్దరు యువకులు బాలికకు గంజాయి కలిపిన సిగరెట్లు తాగించడంతో ఆమె మత్తులోకి వెళ్ళింది. రైల్వే స్టేషన్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి బాలికను తీసుకుని వెళ్ళి మత్తులో ఉన్న ఆమెపై నీరజ్ అత్యాచారం చేశాడు. అనంతరం విక్కీ ఆమెను తన ఇంటికి తీసుకుని వెళ్ళి గంజాయి మత్తులోనే ఉన్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తరువాత విక్కీ తన స్నేహితుడు నిఖిల్‌తో కలిసి బాలికను స్కూటర్‌పై ఎక్కించుకుని దూలపల్లికి తీసుకుని వెళ్ళారు. అక్కడ మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వీరికి జత కలిశారు. నల్లరంగులో ఉన్న ద్రవ పదార్థాన్ని సిగరెట్‌లో కలిపి బలవంతంగా బాలికకు ఇచ్చారు. అనంతరం దూలపల్లిలోని ఓయో గదికి తీసుకుని వెళ్ళి విక్కీ, నిఖిల్ మరియు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బాలికపై ఆత్యాచారం చేశారు. హోటల్ రూము నుంచి బాలికను విక్కీ, నిఖిల్‌లు బొల్లారంలోని విక్కీ ఇంటికి తీసుకుని వచ్చి మరోసారి లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలికకు చెందిన మొబైల్ ఫోన్‌ను తమ వద్ద ఉంచుని ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ నెల 10వ తేదీన అక్కడి నుంచి తప్పించుకున్న బాలిక బొల్లారం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. విషయం తెలుసుకున్న విక్కీ అతని స్నేహితుడు గణేష్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ మరలా బాలికకు గంజాయి తాగించి రైలులో మేడ్చెల్‌కు తీసుకుని వెళ్ళారు. రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైలు బోగీలోకి తీసుకుని వెళ్ళి మరలా ఇరువురు ఆమెపై ఆత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం వారు మరో రైలులో మల్కాజిగిరి వైపు ప్రయాణించారు. ప్రయాణ సమయంలో బాలిక ఇతరుల సహాయం కోసం ప్రయత్నించడం జరిగింది. మల్కాజిగిరి వద్ద బాలికకు విక్కీ, గణేష్‌లు మత్తు మాత్రలు ఇచ్చి ఆటోలో దూల్‌పేట వైపుకు తీసుకుని వెళ్ళారు. ఇద్దరు నుంచి తప్పించుకోవడానికి ఆటోలో ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇద్దరు యువకులు ఆమెను వదివేశారు. అనంతరం మరో ఆటోలో మైనర్ బాలిక ఇంటికి చేరుకుంది. బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ యువకులు కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలు. మత్తు చాకెట్లు, మద్యంకు బానిసనగా చేసిన యువకులు బాలికను తమ లైంగిక వాంచ కోసం వాడుకున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. మాదక ద్రవ్యాలు, గంజాయి బహిరంగ మార్కెట్‌లో విచ్చల విడిగా లభ్యం అవుతుండడంతో దేశ భవిష్యత్తు అయిన యువత మత్తులోకి జారుకుంటోంది అనడానికి మైనర్ బాలిక ఉదంతం ఉదాహరణగా నిలుస్తోంది.

# తిరుమల సమాచారం

## శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి

**తిరుమల,సెప్టెంబరు 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివ రాహక్షేత్రమైన తిరుమలలో భూ వరాహస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం వరాహ జయంతి శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భా గంగా ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పు ణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేద మంత్రాల నడుమ మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అద నపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆల య డిప్యూటీ ఇఒ భాస్కర్, పారుపత్తేదార్ హి మత్‌గిరి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,సెప్టెంబరు 13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చక్కగా ఉన్నాయని, భక్తులకు సౌకర్యాలు బావున్నాయని అభినందించారు. ఆదివారం ఉదయం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్ కుమార్, రాష్ట్ర అగ్నిమాపక డిజి పివి వెంకటరమణ, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎమ్మెల్యే బండారు శ్రావణి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమల ఆలయానికి తొమ్మిది గొడుగులు సమర్పణ



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారికి తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా తిరునింద్రపూరుకు చెందిన భాష్యకార కైంకర్య ట్రస్ట్ ఆదివారం తొమ్మిది గొడుగులను సమర్పించారు. ట్రస్ట్ అధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు, ఫౌండర్ ట్రస్టీ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో తెచ్చిన గొడుగులను ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరికి వైభవ మండపం వద్ద అందజేశారు. గత తొమ్మిదేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా తొమ్మిది గొడుగులను శ్రీవారికి సమర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**భవిష్యత్తులో ఎస్వీబిసి వేదికగా**

## మరిన్ని భక్తి కార్యక్రమాలు

● **సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్**

**తిరుమల,సెప్టెంబరు 13ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తులో టిటిడి ఎస్వీబిసివేదికగా మరిన్ని భక్తి కార్యక్రమాలను నిర్వహించాలనే తన ఆకాం క్షను సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్ వ్యక్తం చేశారు. ఎస్వీబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మను ఆదివారం ఆర్‌పి పట్నాయక్ మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఇదరూ భక్తి సంగీత సిరీస్‌లు , ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్ర మాల ను ఎస్వీబిసి ద్వారా ప్రసారం చేయడానికి అవకాశాలను పరిశీలించారు. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న భారతదేశపు మొట్టమొదటి ప్రభుత్వ రంగ భక్తి ఛానల్ ఎస్వీబిసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం ప్రత్యక్ష ఆలయ కార్యక్రమాలు, పారాయణాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తన కంటెంట్‌ను విస్తరిస్తోంది. తిరుపతిలోని ఎస్వీబిసి కార్యాలయంలో శ్రీధర్ వర్మను కలిసి సంగీత ప్రాజెక్టుల గురించి వివరించారు.

# 50శాతం పెరిగిన ఆర్టీసి బస్సు చార్జీలు

**హైదరాబాద్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆర్టీసి ప్రయాణికులకు బిగ్ షాక్ తగిలింది.. వరుస పండగల సెలవుల నేపథ్యంలో ఆర్టీసి బస్సు చార్జీలు భారీగా పెంచినట్టు తెలుస్తోంది. సాధారణ రోజులతో పోల్చుతే ప్రస్తుతం స్పెషల్ బస్సుల్లో ఛార్జీలు 50 శాతం అదనంగా వసూలు చేస్తోంది ఆర్టీసీ. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, ఖమ్మం, కరీంనగర్, సత్తుపల్లికి వెళ్లే స్పెషల్ బస్సుల్లో ఈ చార్జీలు అమల్లో ఉండనున్నట్టు ఆర్టీసీ పేర్కొంది. అలాగే డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని బస్సుల్లో.. ఏసీ, ఆర్ నాన్ ఏసీ.. సర్వీస్‌ను బట్టి ఛార్జీలను వసూలు చేస్తోంది. ప్రస్తుతం పండుగ సీజన్‌లో నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోన్నట్టు ఇటీవలే ఆర్టీసి యాజమాన్యం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ సర్వీసుల్లో ఛార్జీలను సవరిస్తున్నట్టు ఆర్టీసీ పేర్కొంది. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం, ఈ సర్వీసుల ఛార్జీలను సవరించినట్టు పేర్కొంది. పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సులకు సాధారణ ఛార్జీల కంటే గరిష్టంగా 50 శాతం వరకు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్టు ఈ జీవోలో స్పష్టం చేసింది. సాధారణ రోజుల్లా కాకుండా పండుగల సీజన్‌లో నడిపే ప్రత్యేక బస్సులు.. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత.. తిరిగి ఖాళీగా రావాల్సి ఉంటుందని.. దీని వల్ల నిర్వహణ వ్యయంతో పాటు ఇందన వ్యయం భారీగా పెరుగుతుందని.. అందుకే వాటిని భర్తీ చేసేందుకు ప్రత్యేక సర్వీసుల్లో అదనపు ఛార్జీలను వసూలు చేస్తున్నట్టు ఆర్టీసీ తెలిపింది.

# వినాయక విగ్రహం ఏర్పాటు సందర్భంగా ఘర్షణ

## గొంతు కోసిన దుండగులు

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** నాలుగేళ్ల క్రితం జరిగిన ప్రేమ వ్యవహారంలో సహకరించాడన్న పాత కక్షలతో ఓ వ్యక్తిని గొంతు కోసి హత్య చేసిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తుకారాం గేట్ బుద్ధనగర్‌కు చెందిన కార్తిక్ (40) ఈ ఘటనలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కార్తిక్ ఇంటి ఎదురుగా నివసించే ఓ యువతి ప్రేమ వివాహానికి గతంలో కార్తిక్ సహకరించాడు. అప్పటి నుంచి యువతి కుటుంబ సభ్యులతో అతడికి విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్తీలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా యువతి తరఫు బంధువులు, కార్తిక్ మధ్య శనివారం రాత్రి గొడవ జరిగింది. ఇరువర్గాలు తీవ్రంగా ఘర్షణ పడటంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గొడవకు సంబంధించి సమాచారం అందడంతో లాలాగూడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటికే మళ్లీ ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సమయంలో యువతి తరఫున వచ్చిన సుమారు పది మంది వ్యక్తులు కార్తిక్‌పై దాడి చేసి గొంతు కోసినట్లు సమాచారం. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన కార్తిక్‌ను లాలాగూడ పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కార్తిక్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలిలోనే ఉండి ఉంటే హత్య జరిగి ఉండేది కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



## ఒకేవేదికపై మళ్లీ విజయ్ త్రిష, అజిత్

**లండన్, సెప్టెంబరు 13:** తమిళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటులు విజయ్, అజిత్ కుమార్ ఒకే వేదికపై కనిపించడంతో అభిమానుల్లో సందడి నెలకొంది. ఇంగ్లాండ్‌లోని సిల్వర్‌స్టోన్ రేసింగ్ సర్క్యూట్‌లో జరిగిన మిచెలిన్ లే మాన్స్ కప్ రేస్ సందర్భంగా విజయ్, అజిత్ కుమార్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ అజిత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు నటి త్రిష కృష్ణన్ కూడా రేసింగ్ సర్క్యూట్‌కు రావడంతో అభిమానుల దృష్టి మొత్తం ఈ కార్యక్రమంపైనే పడింది. సిల్వర్‌స్టోన్ రేసింగ్ సర్క్యూట్‌లో అజిత్ కుమార్‌ను కలిసేందుకు విజయ్ వేగంగా వెళ్లినట్లు వైరల్ వీడియోలో కనిపించింది. అనంతరం ఇద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అజిత్ కూడా విజయ్‌ను వ్యక్తిగతంగా స్వాగతించారు. మిచెలిన్ లే మాన్స్ కప్‌లో సిల్వర్‌స్టోన్ రౌండ్‌కు ముందు పోటీపడుతున్న ఈ కలయిక అభిమానులను ఆకట్టుకుంది. తమిళ సినీ పరిశ్రమలో ఇద్దరు ప్రముఖ నటులుగా గుర్తింపు పొందిన విజయ్, అజిత్ ఒకే కార్యక్రమంలో కనిపించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## నంబర్ వన్ ఆర్థికవ్యవస్థగా భారత్



**న్యూయార్క్, సెప్టెంబరు 13:** ప్రపంచ సంక్షోభాల మధ్య భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే చెప్పాయి. ఇప్పుడు అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన ఆర్థికవేత్త జెఫ్రీ సాక్స్ భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా మారతుందని సంచలన అంచనా వేశారు. సమీప భవిష్యత్తులో భారత్ అమెరికా, చైనాలను దాటి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని చెప్పారు. రాబోయే 25యేళ్లలో అమెరికాను భారత్ అధిగమించి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని, చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికశక్తిగా అవతరించవచ్చని జెఫ్రీ సాక్స్ చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రం నిర్ణయాత్మకంగా ఆసియా వైపు మారుతోందని సాక్స్ పేర్కొన్నారు. భారత్- చైనాలు ఒకరికి ఒకరు అవసరమని అన్నారు. ఈ రెండు ఆసియా దిగ్గజాలు ప్రపంచ ఆర్థిక శక్తులుగా మారుతాయని, అదే సమయంలో అమెరికా మూడో స్థానానికి పడిపోతుందని జోస్యం చెప్పారు. చైనాతో భారత్‌కు లోతైన ఆర్థిక, సాంకేతిక సంబంధాలు భారత్ ఎదిగే వేగాన్ని మరింత పెంచొచ్చని వెల్లడించారు. చైనా, ఆసియాన్, ఆఫ్రికా, గల్ఫ్ దేశాలతో భారతదేశ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలు మరింత ముఖ్యమైనవిగా మారతాయని ఆయన అన్నారు.

## ముక్కలు కాబోతున్న గ్రేట్‌బ్రిటన్..!




**లండన్, సెప్టెంబరు 13:** యునైటెడ్ కింగ్‌డమ్ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ నేతలు తమ ప్రాంతాలకు స్వయం నిర్ణయం హక్కు, స్వాతంత్ర్యం దిశగా కీలక అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కార్డిఫ్‌లో జరిగే సమావేశంలో యుకె నుంచి స్వాతంత్రం సాధించేందుకు డిక్లరేషన్‌పై సంతకం చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న వెస్ట్ మినిస్టర్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ జాన్ స్విన్నీ, వేల్స్ ఫస్ట్ మినిస్టర్ రున్ అప్స్ ఐయోర్వెత్, ఉత్తర ఐర్లాండ్ నాయకత్వంతో పాటు సిన్ ఫెయిన్ అధ్యక్షురాలు మేరీ లూ మెక్‌డొనాల్డ్ ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ నేతలంతా స్వయం నిర్ణయ హక్కును సమర్థిస్తూ జాయింట్ డిక్లరేషన్‌పై సంతకం చేసే అవకాశం ఉంది. ఇటీవల ఎన్నికల ఫలితాలు స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌లో రాజ్యాంగ మార్పులకు అనుకూలంగా ఉన్న పార్టీలు సత్తా చాటాయి. స్కాట్లాండ్ ఫస్ల మినిస్టర్ జాన్ స్విన్నీఈ బ్రేక్ అప్ పరిణామాన్ని యూకే రాజ్యాంగ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడికి సంకేతంగా అభివర్ణించారు. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌కు తొలిసారిగా స్వాతంత్ర్య అనుకూల ఫస్ట్ మినిస్టర్లు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత రాజ్యాంగ స్థితి శాశ్వతం కాదని, వెస్ట్‌మినిస్టర్ ప్రభుత్వం యుకె తర్వాతి భవిష్యత్తుపై సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు.

## బ్రిక్స్ సదస్సు.. తపాలా బిళ్లలు విడుదల




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రపంచ వేదికపై కీలక పాత్ర పోషిస్తున్న బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా భారత్ ప్రత్యేక స్మారక తపాలా బిళ్లలను విడుదల చేసింది. 2026 సెప్టెంబర్ 12న న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా భారత తపాలా శాఖ ఈ రెండు ప్రత్యేక తపాలా బిళ్లలను ఆవిష్కరించింది. గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ సాధించిన ప్రగతి, సభ్య దేశాల మధ్య సహకారం, ఐక్యతతో పాటు ఈ కూటమిలో భారత్ పోషించిన కీలక పాత్రను గుర్తు చేసుకునేలా ఈ ప్రత్యేక తపాలా బిళ్లలను రూపొందించారు. 12న న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత తపాలా శాఖ రెండు స్మారక తపాలా బిళ్లలను విడుదల చేసింది. ఈ రెండు బిళ్లలపై రెండు దశాబ్దాల పరస్పర సహకారం 2006-26 అనే సందేశాన్ని హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ముద్రించారు. అభివృద్ధి, సహకారం వంటి అంశాల్లో సాధారణ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఇది అందిస్తుంది.

## చెత్తపేరుతో రూ.1200 కోట్ల కుంభకోణం

### - వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ చంద్రశేఖరరెడ్డి

**నెల్లూరు(విద్య), సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** చెత్త పేరుతో కూటమి ప్రభుత్వ హయాంలో రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం నగరంలోని స్థానిక పొదలకూరు రోడ్డులోని వైయస్ఆర్సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కుంభకోణంలో మంత్రి నారాయణ హస్తం ఉందన్నారు. మున్సిపాలిటీలో చెత్త యార్డులు ఎప్పటినుంచో ఉన్నాయని, లెగసి వేస్ట్ తొలగింపు పేరుతో రూ.1200 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. 2019కి ముందు పట్టణాల్లో కుప్పదొడ్ల రోడ్లపై దర్శనం ఇచ్చేవని తమ హయాంలో వాటిని పరిశుభ్రంగా నిర్వహించమన్నారు. గతంలో, ప్రస్తుతం చెత్తకుప్పల నిర్వహణపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు.

# నా భూమి బిజెపి బిల్డర్లే కబ్జాచేసారు!

### ప్రధాని మోడీని కలిసి మాజీ క్లాస్‌మేట్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రధాని మోడీని ఆయన మాజీ క్లాస్‌మేట్ కలుసుకున్నారు. బిల్డర్ సంస్థలు తన భూమిని ఆక్రమించినట్లు ఆయన ఆరోపించారు. చాలా కాలంగా వివాదం కొనసాగుతున్న ఈ అంశంపై సిబిఐతో విచారణ జరిపించాలని కోరారు. ఈ మేరకు ఒక లేఖను మోడీకి అందజేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని మీరాభయందర్‌కు చెందిన 81 యేళ్ల అస్గరలీ వోహ్రా గతంలో గుజరాత్‌లోని వడ్నగర్‌లో ఉన్న బిఎన్ స్కూల్‌లో మోడీతో కలిసి చదువుకున్నారు. ఈనెల 8న తన భార్యతో కలిసి మాజీ క్లాస్‌మేట్ అయిన ప్రధాని మోడీని ఆయన కలిశారు. మీరాభయందర్‌లో దశాబ్దాలుగా ఉన్న భూమి వివాదంపై సిబిఐ విచారణ కోరారు. 1989లో భయందర్ ఈస్ట్‌లోని నవ్‌గఢ్ రోడ్డులో ఉన్న 2,810 చదరపు మీటర్ల భూమిని తాను రిజిస్టర్డ్ ఒప్పందం ద్వారా చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు వోహ్రా తెలిపారు. ఆ భూమిని తాను ఎప్పుడూ అమ్మలేదు లేదా బదిలీ చేయలేదని చెప్పారు. అయితే బిజెపి ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు అనుబంధంగా ఉన్న బిల్డర్లు నకిలీ పత్రాలతో తన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. 2011లో స్వయం బిల్డర్స్‌తో కుమ్మక్కై నకిలీ పత్రాలు తయారు చేశారని, ఆ తర్వాత తన ప్రమేయం లేకుండా ఆస్తిని రెండు భాగాలుగా విభజించారని ఆయన ఆరోపించారు. అయితే తన భూమిలోని ఒక భాగం స్వయం బిల్డర్స్ స్వాధీనంలో ఉండగా, బిజెపి ఎమ్మెల్యే నరేంద్ర మోహతాతో సంబంధాలున్న సెవెన్ ఎలెవెన్ కన్స్ట్రక్షన్స్ నియంత్రణలో మరో భాగం ఉన్నదని వోహ్రా తెలిపారు. తనకు యాజమాన్యపు హక్కులు ఉన్నప్పటికీ, మీరాభయందర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం వివాదాస్పద భూమిపై నిర్మాణ అనుమతి మంజూరు చేసిందని ఆయన ఆరోపించారు. పత్రాలను తారుమారు చేయడంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ, స్థానిక పోలీస్ అధికారులు విఫలమయ్యారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు 2015లో జరిగిన నకిలీ పత్రాల ఆరోపణలకు సంబంధించి తాను ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా ఆ విషయం కోర్టుకు చేరిందని వోహ్రా తెలిపారు. కేసు నమోదైన దాదాపు 11 సంవత్సరాల తర్వాత, అంటే ఈ ఏడాదిలో ఆ కేసుపై సిఐడి నివేదిక సమర్పించిందని చెప్పారు. రాజకీయ ఒత్తిడితో అధికారులు వ్యవహరించడం వల్ల ఈ ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. తనకు ముందస్తు నోటీసు ఇవ్వకుండా లేదా తన వాదన వినిపించే అవకాశం కల్పించకుండా 2025లో తనపై ఎదురు కేసు దాఖలు చేశారని వోహ్రా ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోడీని ఆయన కోరారు. వివరాలతో కూడిన ఒక లేఖను ఆయనకు అందజేశారు.

ప్రధాని మోడీతో ఆయన మాజీ క్లాస్‌మేట్ వోహ్రా సమావేశం తర్వాత స్థానిక మున్సిపల్ అధికారులు ఈ భూ వివాదంపై స్పందించారు. సెప్టెంబర్ 16న విచారణకు షెడ్యూల్ చేశారు. స్వయం బిల్డర్స్, సెవెన్ ఎలెవెన్ కన్స్ట్రక్షన్స్ ప్రతినిధులు హాజరు కావాలని ఆదేశించారు.

## 9/11 దాడుల కంటే ముందే భారత్‌పై బిన్‌లాడెన్ కుట్ర



**వాషింగ్టన్, సెప్టెంబరు 13:** అమెరికాపై 2001 సెప్టెంబర్ 11న జరిగిన భయానక ఉగ్రదాడులకు కొన్ని సంవత్సరాల ముందే, అల్‌ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్ భారతదేశంలో కూడా దాడులు చేయడానికి ప్రణాళికలు రచించినట్లు వెల్లడైంది. 1998 నాటి సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రహస్య నివేదికతో ఈ సంచలన విషయం బయట పడింది. 9/11 దాడుల 25వ వార్షికోత్సవం సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్‌లకు సమర్పించిన 100 కంటే ఎక్కువ పేజీల రహస్య నివేదికలను సిఐఎ బయటపెట్టింది. ఆగస్టు 28, 1998 నాటి ప్రెసిడెన్షియల్ డైలీ బ్రీఫ్‌కు 'బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఎ థ్రెట్' అని పేరు పెట్టారు. అందులో లాడెన్ దాడులు చేయాలని భావించిన దేశాల జాబితాలో భారతదేశం కూడా ఉంది. ఈజిప్ట్, అరేబియా ద్వీపకల్పం ముఖ్యంగా కువైట్, సౌదీ అరేబియా, యెమెన్, భారత్, పాకిస్థాన్, ఉగాండా, నైజీరియాలలో దాడులకు లాడెన్ ప్లాన్ చేశాడు. ఈ పత్రంలో భారతదేశంలోని టార్గెట్ ప్లేస్, దాడికి కరెక్ట్ తేదీ లేదా ఆపరేషనల్ ప్లాన్ వివరాలు మాత్రం పేర్కొనలేదు. ఈ సమాచారానికి ఆధారమైన ఇంటెలిజెన్స్ సోర్స్‌ను కూడా గోప్యంగా ఉంచారు. సుమారు 60కి పైగా దేశాల్లో ఉన్న నెట్‌వర్క్, అనుబంధ ఉగ్రవాద సంస్థల సహాయంతో బిన్ లాడెన్ ఈ దాడులకు పాల్పడే అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేసింది. అమెరికా, బ్రిటన్‌లపై మరిన్ని దాడులు చేసేందుకు మార్గాలను వెతికాడని, అయితే ఏ నిర్దిష్ట ప్రదేశం లేదా సమయాన్ని సూచించలేదని పేర్కొంది. తిరానా, బాకు నగరాల్లో దాడులకు సిద్ధమవుతున్న లాడెన్ అనుచరులను అరెస్ట్ చేయడంలో అమెరికా అధికారుల సాయం అందిందని ఈ అంచనా వెల్లడించింది. ఉత్తర అమెరికా, యూరప్, తూర్పు ఆసియా ప్రాంతాల్లో బిన్ లాడెన్‌కు ఉన్న బలమైన వ్యవస్థల వల్ల, అక్కడ అమెరికా ప్రయోజనాలపై దాడులు జరుగుతాయన్న నివేదికలకు మరింత బలం చేకూరింది.


## ఉమ్మడి ధాన్యాల మార్కెట్‌తోపాటు బీమా వ్యవస్థ మేలు

### బ్రిక్స్ ముగింపు సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ దేశాలకు ఉమ్మడి ధాన్యాల మార్కెట్‌తో పాటు కొత్త బీమా వ్యవస్థ ఉంటే బాగుంటుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి బ్రిక్ సభ్య దేశాల మధ్య బలమైన ఆర్థిక సహకారం ఉండాలని ఆయన సూచించారు. 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిర్గతంగా ఆర్థిక ఒత్తిడి ఉన్నా క్యాపిటల్, లేబర్, టెక్నాలజీని ఇచ్చిపుచ్చుకొనే శక్తిసామర్థ్యాలు బ్రిక్స్ సభ్య దేశాలకు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తాను ప్రతిపాదించిన ఇన్సూరెన్స్ మెకానిజం రష్యాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. "పశ్చిమ దేశాల ఆంక్షల కారణంగా రష్యా ఇంధన ఎగుమతులపై బాగా ప్రభావం పడింది. రష్యా చమురును రవాణా చేసే నౌకలకు బీమా సదుపాయం కల్పించకుండా వెస్టర్న్ కంపెనీలను జీ7, యూరోపియన్ యూనియన్, యుకె అడ్డుకున్నాయి" అని పుతిన్ పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు స్థాపించిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ పనితీరు అద్భుతంగా ఉందని పుతిన్ ప్రశంసించారు. 140 బిలియన్ డాలర్ల రూ.13 లక్షల కోట్లు విలువైన ప్రాజెక్టులను ఆ బ్యాంకు సమర్థంగా నిర్వహిస్తున్నదని కొనియాడారు. ఇక అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సమగ్ర విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందని బ్రిక్స్ దేశాలతో పాటు గ్లోబల్ సౌత్ దేశాలను కూడా ఆయన కోరారు. భద్రతా ముప్పులను సమిష్టిగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. బ్రిక్స్ సమావేశాల్లో పెరుగుతున్న దేశాల భాగస్వామ్యం ఈ కూటమిపై అంతర్జాతీయ ఆసక్తి పెరుగుతోందనడానికి నిదర్శనమని పుతిన్ పేర్కొన్నారు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం, సమిష్టిగా సమస్యలను పరిష్కరించడం, అంతర్జాతీయ చట్టాలను గౌరవించడం, ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని సూత్రాలను పాటించడం వంటి అంశాలకు బ్రిక్స్ ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు.

# అజిత్ ధోవల్‌కు హాయ్ చెప్పిన పుతిన్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ సదస్సులో చోటుచేసుకున్న ఓ ఆసక్తికర సన్నివేశం ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమావేశమైన సమయంలో ఈ ఘట్టం ఆవిష్కృతమైంది. మోడీతో మాట్లాడుతున్న పుతిన్ ఆయన వెనుక నిలబడి ఉన్న జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్‌ను గమనించారు. వెంటనే చిరునవ్వు చిందిస్తూ, చేయి పైకెత్తి ఆయనకు ఓ ప్రత్యేకమైన సైగతో పలకరించారు. దీనికి బదులుగా దోవల్ కూడా నవ్వుతూ స్పందించారు. కేవలం రెండు సెకన్ల పాటు జరిగిన ఈ పలకరింపును సోషల్ మీడియాలో స్పైటుస్పై సెల్యూట్, ఇంటెలిజెన్స్ బ్రదర్‌హుడ్ అంటూ నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. భారత ఇంటెలిజెన్స్ వ్యవస్థతో దోవల్‌కు ఉన్న సుదీర్ఘ అనుబంధం మరోసారి బయటపడింది. పుతిన్, దోవల్ ఇద్దరికి ఇంటెలిజెన్స్ రంగంలో విశేషమైన నేపథ్యం ఉండటమే ఈ ప్రత్యేక బాండింగ్‌కు కారణం అని నిపుణులు చెబుతున్నారు. పుతిన్ గతంలో సోవియట్ యూనియన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కెజీబీలో 16యేళ్ల పాటు పనిచేశారు. లెఫ్టినెంట్ కల్నల్‌గా పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత రష్యా అధ్యక్షుడిగా ఎదిగారు.

మరోవైపు, అజిత్ దోవల్ భారత ఇంటెలిజెన్స్ బ్యూరోలో 33యేళ్ల పాటు సేవలందించారు. పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ఏడేళ్ల పాటు అండర్ కవర్ ఏజెంట్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం దేశ వ్యూహాత్మక, భద్రతా వ్యవహారాల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న మూడు ప్రధాన పోలికలను విశ్లేషకులు ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ఎదుటివారి బాడీ లాంగ్వేజ్‌ను ఇట్టే పసిగట్టడం, హార్డ్ పవర్‌ను విశ్వసించడం, తీవ్రమైన జాతీయవాద దృక్పథం కలిగి ఉండటం ఈ ఇద్దరిలోని ఉమ్మడి లక్షణాలు అని చెబుతున్నారు.

# సరిహద్దులపై భారత్ - చైనా వేర్వేరు విధానాలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల సమావేశం అనంతరం ఇరు దేశాలు విడుదల చేసిన అధికారిక ప్రకటనలు భారత్- చైనా సరిహద్దు వివాదంపై రెండు దేశాల వేర్వేరు విధానాలను స్పష్టం చేస్తున్నాయి. చైనా తన ప్రకటనలో సరిహద్దు వివాదాన్ని, ద్వైపాక్షిక సంబంధాలను పక్కపక్కనే సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించింది. సరిహద్దుల్లో శాంతిభద్రతలను కాపాడుకుంటూనే, రెండు అంశాల్లోనూ ఒకదానికొకటి పరస్పర సహకారాన్ని అందిస్తూ పురోగతి సాధించాలని పేర్కొంది. సరిహద్దు సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోయినా, ఇతర ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవచ్చనే సంకేతాన్ని చైనా ఇచ్చింది. అయితే భారత్ మాత్రం దీనిపై పూర్తి స్పష్టమైన, విభిన్నమైన వైఖరిని ప్రదర్శించింది. సరిహద్దుల్లో శాంతిభద్రతలు నెలకొనడం అనేది ఇరు దేశాల మధ్య విస్తృత సంబంధాలు కొనసాగడానికి అత్యంత ప్రాథమిక పునాది అని ప్రధాని మోడీ బలంగా పునరుద్ఘాటించారు. సరిహద్దు వ్యవహారాలకు సంబంధించి గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు, అవగాహనలను రెండు దేశాలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. రెండు దేశాల ప్రకటనల్లోని ప్రధాన వ్యత్యాసం ప్రాధాన్యతా క్రమంలోనే కనిపిస్తోంది. సరిహద్దు సమస్య ముగియకపోయినా మిగిలిన సంబంధాల్లో ముందుకు వెళ్లవచ్చని చైనా భావిస్తుంటే, సరిహద్దు వద్ద ప్రశాంత వాతావరణం ఉంటేనే ఇతర అంశాల్లో ముందడుగు వేయడం సాధ్యమవుతుందని భారత్ తేల్చిచెప్పింది. ఏది ఏమైనప్పటికీ, రెండు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సరిహద్దు వివాదానికి న్యాయమైన, సహేతుకమైన, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడానికి ఇద్దరు నాయకులు తమ కట్టుబాటును వ్యక్తం చేశారు.

### నోయిడా కార్మికుల నిరసన కేసు:

## హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టుకు జిల్లా మేజిస్ట్రేట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** నోయిడా కార్మికుల నిరసనకు సంబంధించి జాతీయ భద్రతా చట్టం కింద ఓ విద్యార్థిని నిర్బంధించిన వ్యవహారంలో రూ.5 లక్షల పరిహారాన్ని తన జీతం నుంచి వసూలు చేయాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ గౌతమ్ బుద్ధనగర్ జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ 2న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఢిల్లీ యూనివర్సిటీలో చరిత్రలో పట్టభద్రురాలైన 25 ఏళ్ల ఆకృతి చౌదరిని నిర్బంధించడాన్ని కొట్టివేసింది. ఆమెపై మరే ఇతర కేసు లేకపోతే వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. తన అరెస్టును సవాల్ చేస్తూ ఆకృతి చౌదరి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ఆమె నిర్బంధానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కథనం కల్పితంగా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల తీరుపై కూడా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తప్పిదపూరిత అధికార యంత్రాంగం ఇదే విధంగా నిరంకుశ ధోరణిని కొనసాగిస్తే ఉత్తరప్రదేశ్ ఒక ఆర్వెలియన్ డిస్టోపియాగా మారే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. ఆకృతి చౌదరికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్‌తో పాటు, కేసుకు బాధ్యులైన ఇతర అధికారుల నుంచి, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వరకు, వారి జీతాల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. సెప్టెంబర్ 9న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో హాజరై, నిర్బంధ ఉత్తర్వులను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

## రాహుల్, ప్రియాంకలతో మలేసియా ప్రధాని భేటీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** బ్రిక్స్ సదస్సు కోసం ఇండియా వచ్చిన మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఢిల్లీలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిశారు. అక్కడే రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీని కూడా కలుసుకున్నారు. ఆదివారం ఉదయం ఢిల్లీలోని రాహుల్ గాంధీ నివాసంలో ఆయనను కలిశారు. రాహుల్ నివాసంలో ఆయన సోదరి ప్రియాంకా గాంధీ కూడా ఉన్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. దీనికి సంబంధించిన ఫొటోల్ని కాంగ్రెస్ తాజాగా విడుదల చేసింది. అన్వర్ ఇబ్రహీం తన పర్యటన సందర్భంగా దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను గుర్తుచేసుకున్నారు. ఆయనతో తనకున్న సాన్నిహిత్యం గురించి ప్రస్తావించారు.

## కోవూరులో పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ



**కోవూరు (నెల్లూరు), సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** కోవూరు పట్టణంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆవిష్కరించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన ఒక మహనీయుడి త్యాగాన్ని మన మధ్య శాశ్వతంగా నిలబెడుతున్నామని ఎంపి, ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలనే లక్ష్యంతో శ్రీ పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి, 58 రోజుల పాటు తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారని తెలిపారు. చివరకు ప్రాణత్యాగం చేసిన ఆయన త్యాగం దేశవ్యాప్తంగా ఉద్యమానికి కారణమైందని, ఆయన మరణించిన నాలుగు రోజుల్లోనే 1952 డిసెంబర్ 19న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును ప్రకటించారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. సొంత నిధులతో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గాదిరాజు అశోక్‌ని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘం నేతలు, తదితరులు ఉన్నారు.

## 60యేళ్ల కన్నీళ్లకు 20 రోజుల్లో పరిష్కారం

### - సర్వేపల్లి కాలువకట్ట నిర్వాసితులకు శాశ్వత పట్టాలు



**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** దశాబ్దాలుగా వెంటాడుతున్న సమస్యకు తెరపడింది. అరవై ఏళ్లుగా ఇంటి పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేదల కల నెరవేరబోతోంది. సమస్యను తన దృష్టికి తీసుకొచ్చిన కేవలం 20 రోజుల వ్యవధిలోనే అన్ని శాఖలను సమన్వయం చేసి, క్యాబినెట్ ఆమోదం సాధించి 1,215 మంది నిర్వాసితులకు శాశ్వత పట్టాల మార్గాన్ని సుగమం చేసిన మంత్రి నారాయణ. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్టపై మంత్రి నారాయణ ఆదివారం పర్యటించారు. కల సాకారం చేయబోతున్న మంత్రి తమ ప్రాంతానికి రావటంతో నిర్వాసితుల దారిపొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఓ స్థానిక మహిళ మంత్రి నారాయణ పాదాలకు పాలాభిషేకం చేసి, దిష్టితీయడం అక్కడి భావోద్వేగ వాతావరణానికి అద్దం పట్టింది. కాలువకట్టలపై నివసిస్తున్న పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. ఈ సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకురాగానే ఆగస్టు 7న అధికారులను వెంటబెట్టుకుని స్వయంగా కాలువకట్టపై పర్యటించి పరిస్థితిని పరిశీలించానన్నారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా సమస్యలను సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపట్టామని చెప్పారు. అన్ని శాఖలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సమస్యను కొలిక్కి తెచ్చామని, చివరకు క్యాబినెట్‌లో ప్రతిపాదన పెట్టి 1,215 మంది నిర్వాసితులకు శాశ్వత పట్టాల మంజూరుకు ఆమోదం పొందామని వివరించారు.

## అల్పాహారమే!

పిల్లలు పొద్దున్నే కదుపునిండా తిని బడికెళ్లాలని అందరు కోరుకుంటారు. కానీ ఆలస్యంగా నిద్రలేవడమో, సమయానికి వంట పూర్తికాకపోవడమో.. ఇలా పలు కారణాల వల్ల అది అన్ని రోజులూ సాధ్యం కాకపోవచ్చు. పిల్లలు తినలేదని



యువదంపతులు బాధపడుతుంటే కొందరు పెద్దవాళ్లు మా చిన్నప్పుడు టిఫిన్ తినే అలవాటే లేదు. సూర్యుడు నడినెత్తికొచ్చాకే ఓ ముద్ద తినేవాళ్లం అంటారు. ఇంకొందరేమో అసలు చాలా దేశాల్లో టిఫిన్ తినే అలవాటే లేదు. తెలుసా! అనేస్తారు. ఇలాంటి అపోహలపైనే సరికొత్త పరిశోధన చేశారు ఇంగ్లండు ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ, మెక్సికో యూనివర్సిటాడ్ డి లాస్ అమెరికాస్ సంస్థల శాస్త్రవేత్తలు. ఇందుకోసం 42 దేశాల్లోని, లక్షన్నర మంది 10-17 ఏళ్ల మధ్య ఉన్న విద్యా ర్థుల ఆహారపుటలవాట్లనీ వాళ్ల మానసికోస్థితుల్నీ పరిశీలించారు. అందర్నీ చూశాక బ్రేక్‌ఫాస్ట్ తినకున్నా అన్నీ పనులూ చురుగ్గా చేసే పిల్లలున్నారు. కానీ వాళ్లలో మానసికానందం లేదు. సదా చిరునవ్వు చిందించే తత్వం కనిపించదు. అదే అల్పాహారం తినేవాళ్లలో ఆ ఆనందంపాలు ఎక్కువ. సహనం కూడా మెండుగా ఉంటోంది. బ్రేక్‌ఫాస్ట్ తిననివాళ్లతో పోలిస్తే వీళ్లు మానవ సంబంధాల్లోనూ రాణిస్తున్నారు అని తేల్చారు శాస్త్రవేత్తలు. కాబట్టి, పక్కవాళ్ల మాటలు పట్టించుకోకుండా పిల్లలు అల్పాహారం తినడం తప్పనిసరి చేయమంటున్నారు.

## మండపం అలంకరణ..




చిన్నా, పెద్దా మెచ్చే వినాయకచవితి పండగలో గణేశుడి ఆసనం.. అలంకరణది ప్రత్యేక స్థానం. ఇతరుల కంటే వైవిధ్యంగా మండపాన్ని తీర్చిదిద్దడానికి పోటీలు పడుతుంటారు. అయితే ఈ సారి మీకంత శ్రమ అక్కర్లేకుండా రెడీమేడ్‌గా దొరుకుతున్నాయివి. కోరుకున్నట్టు కస్టమైజ్ చేసే ఈ డెకార్ స్టాండులనీ, అలంకరణ సామగ్రిని అందిస్తున్నారు వెండర్లు. వీటితో క్షణాల్లో విఘ్నేశ్వరుడికి కొలువు వేదికను తీర్చిదిద్దొచ్చు. అంతేకాదు, తర్వాత వాటిని జాగ్రత్తగా వాడుకోవచ్చు. వాటినోసారి మీరూ చూసేయండి.









## తొలిపూజలివిగో..



శ్రావణ భాద్రపద మాసాలు కురిపించిన వర్షంతో పుడమి తల్లి పలకరించి పురుడు పోసుకుంటుంది. అనేక వృక్ష జాతులు, పచ్చని ఆకులు పచ్చని చీర కట్టి ప్రకృతికి ప్రత్యేక సౌందర్యాన్ని సమకూర్చి అనేక లక్షల జీవరాశికి ఆహారం చేకూర్చే ఆహ్లాద కాలం భాద్రపదం. ఔషధాలు అందించే చక్కని సమయం. వేదకాలం మొదలుకొని, ఆధునిక సమకాలీన సాహితీవేత్త వరకు భూగోళం మొదలు, ఖగోళం వరకు విస్తరించిన నిత్య స్ఫూర్తి మూర్తి వినాయకుడు. చంద్రమాన భాద్రపదం నిజానికి సృష్టికి భాద్రపదం.

మన దేశంలో ఎక్కువగా కొలువబడే దైవం వినాయకుడు. గణపతిని విఘ్ననాయకుడనిగా తలు స్తారు. ఏ శుభకార్యమైన సరే ఎటువంటి విఘ్నములు కలగకుండా నిరాటకంగా జరిగిపోవాలంటే ముందుగా విఘ్నేశ్వరుడికి పూజ చేయడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. వినాయకుని పూజ భద్రపద శుద్ధ చతుర్థశి నాడు వస్తుంది. ఆరోజు ప్రజలు మూర్తిని ప్రతిష్టించి అత్యంత వైభవంగా పూజలు చేసుకుంటారు. ఇంత గొప్ప పూజలందు కుంటున్న వినాయకుడు స్థూల కాయుడు. ఏనుగు తల, విరిగిన దంతం, పెద్ద బొజ్జ, ఎలుక వాహనం! ఆయన పుట్టుక గురించి రకరకాల గాధలున్నాయి. అందులో బాగా వాడుకలో ఉన్నది పార్వతీదేవి సృష్టి. ఒకరోజు పార్వతీదేవి స్నానానికి పోతూ స్నానాల గదికి కాపలాగా శరీరానికి రాసుకునే పసుపుతో బొమ్మను చేసి ప్రాణం పోసిందని చెబుతారు. ఎవరినీ లోనికి రానీయకుండా పార్వతీదేవి చేసిన కట్టడి అది. జీవం పొందిన ఆ పసుపు ముద్దకు శివుడని తెలియక శివుడ్ని అడ్డగించి, యుద్ధం చేసి చివరికి శివుని చేత చంపబడతాడు. ఈ సంఘట న పార్వతీదేవికి తెలిసి బాధపడుతుండగా ఆమెను ఓదార్చటానికి ఒక ఏనుగు చంపి, దాని తలను చని పోయిన బాలుడికి అతికించారని కథనం. పరమేశ్వరుడిని దర్శించటానికి వచ్చిన పరశురామునితో యుద్ధం చేసినప్పుడు దంతం విరిగిందని చుబుతారు. ఇలా గణపతికి సంబంధించిన అనేక కథలున్నాయి. ఒకసారి గణపతి ఎలుకను ఎక్కి ఏడు లోకాలు తిరగడానికి బయలు దేరుతాడు. ఆ సమయంలో వినాయకుని రూపాన్ని చూసి నవ్వుతాడు చంద్రుడు. గణపతి కోపంతో చందమామను ఎవరు చూసినా అపనిందల పాలవుతారని శాపం ఇస్తాడు. శాపంతో భయపడిన చంద్రుడు సముద్ర గర్భాన దాక్కుంటాడు. లోకమంతా చీకటిమయం అయి పోతుంది. దేవతల కోరిక మీదట గణపతి శాంతించి ఒక్క చవితినాడు చంద్రుడుని చూస్తే నీలాపనిందలు కలుగుతాయని సవరణ చేస్తాడు. ఏది ఏమైనా భాద్రపద శుద్ధ చవితినాడు వినాయకుని జన్మదినంగా ప్రజలు జరుపుకుంటారు. ఆరోజు మట్టితో మూర్తిని చేసి అలంకరించిన పీఠం మీద బియ్యం పోసి మూర్తిని ఆవాహన చేసి, ఇరవై ఒక్క ఆకులతో పూజ చేస్తారు. ఆయనకు అత్యంత ప్రీతికరమైన ఉండ్రాళ్ళను నైవేద్యంగా సమర్పిస్తారు. 'విగతోనాయకః వినాయక', అంటే నాయకుడు లేని సర్వ స్వతంత్రుడు, ప్రథమ ఘనాలకే కాదు మానవ శరీరంలో ములాధార స్థానానికి అధిపతి గణపతే. 21 సంఖ్య గణపతికి ఇష్టమైన సంఖ్య.



"ఏకవింశతి" పాత్రములతో అనగా 21 పత్రములన్ని ఆయుర్వేద ఔషద గుణాలు కలిగి ఉండటం విశేషం. ఆ 21 పత్రాలు తులసీ పత్రం ,విష్ణు క్రాంత పత్రం, దేవ దారు పత్రం,బిల్వ పత్రం, దుర్వా రాయుగ్మమ్, శమి పత్రం ,అశ్వత్త పత్రం, అర్జున(మద్ది) పత్రం,అర్కా పత్రం, సింధువార పత్రం,మరువక పత్రం,బృహతి పత్రం, అపామార్గ పత్రం,కర వీర పత్రం,చుర పత్రం,బదరి పత్రం, దాడిమి పత్రం, జాజి పత్రం, గండంకి పత్రం, మాచి పత్రం,దుత్తురా (ఉమ్మెత్త) పత్రం. ఈ విధంగా పృద్వి నుండి వచ్చిన అనేక ఔషధాలతో ఆరాధించి సకల రోగాలను నయం చెలు కోవడానికే. ఈ విధంగా సంపూర్ణమైన జాగ్రతకు సంకేతం పాత్రులు. మేధా సంపత్తికి చిహ్నం గజాణనుడు. నిశిత పరిశీలకుడు గణపతి. ఇలా అనేక రకాలుగా చెప్పుకో వచ్చు. వినాయక చతుర్ధి రోజున చేరువు నుండి తెచ్చిన మట్టితో వినాయకుని ప్రతిమను చేసి తిరిగి అక్కడే నిమజ్జనం చేయడం విశేషం. వీలైనంత వరకు మట్టితో చేసిన చిన్న విగ్ర హాన్ని పూజించాలి. దేవుడిని మనసారా కొలవాలి, అంతేగాని ఆడంబరంగా కాదు.మట్టి విగ్రహాన్ని ఇంట్లోనే ఓ బకెట్ నీళ్లలో నిమజ్జనం చేసి కరిగాక చెట్టుకి పోయాలి కళా హృదయం ఉన్న వాళ్ళైతే చేతులతోనే చేసేస్తుంటారు. మనస్సు ంటూ ఉండాలేగాని, ఇలా ఎన్నో మార్గాలు ఉంటాయి. పద్దతి ఏదైనా పండగను పర్యావరణానికి హాని లేకుండా జరువు కోవడమే ముఖ్యం.ఎన్నో ఆధునిక సంప్రదాయ విశేషాలు కల్గిన ఈ భాద్రపద శుద్ధ చతుర్ధి రోజున ఆ మహా గణపతిని ప్రతీ వారు తమకు నచ్చిన విధంగా బుద్ధి కుశలతతో, శ్రద్ధ, భక్తులను, విద్యా, వివేకాలను ప్రసాదిం చాల్సి ందిగా వినాయకుని వేడుకుంటే అన్ని శుభాలే ప్రసాదిస్తాడు ఆ భక్త సులభుడు. ఈ వినాయక చవితి రోజున ఆ భక్త సులబుని స్మరించు కుంటు...ఆ లంబోధరుని ఆశీస్సు లు పొందుదాం.

**- కాయల నాగేంద్ర**

## నవ్వుని నటించొద్దు !



నవ్వు ఆరోగ్యానికి మంచిదేనని వినడమే కాదు, లాఫింగ్ యోగాలంటూ దానికోసం సమయాన్ని కేటాయించుకుని మరీ సాధన చేస్తున్నాం. ఒక్కోసారి కొంతమంది మాట్లాడే మాటలు మనకి తెప్పిస్తున్నా నవ్వుతూనే సమాధానం చెబుతుంటాం. మనసు బాగోకపోతే ఆ బాధ బయటకు కనిపించకుండా చిరునవ్వుని చిందిస్తూ మోహంలో ఆ లోటు కనపడకుండా దాచేస్తాం. ఒక్కోసారి కొంతమంది వేసే జోక్సి మనకి నవ్వు రాదు కానీ మొహ మాటం కొద్దీ నవ్వాల్సి న పరిస్థితి, అంతేకాదు, చేసే పనిలో ఒత్తిడికి గురైతే ఆ భయం కనిపించకుండా ఉల్లాసంగా కనిపించేందుకు నకిలీ చిరునవ్వుల్ని ప్రదర్శిస్తాం. ఈ నవ్వునే 'ప్లాస్టిక్ స్మైల్' అంటున్నారు. ఇలాంటి నవ్వు ఆరోగ్యానికి మేలు చేయకపోగా అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆక్యుపేషన్ హెల్త్ సైకాలజీ నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇలా నకిలీ నవ్వుని ప్రదర్శించే వారు వ్యక్తిగత భావోద్వేగాలను మనసులోనే దాచుకుంటున్నారు. దీనివల్ల ఒత్తిడి పెరిగి మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది.

## మసాలా చాయ్ ..

అన్నం తినడంలో ఆలస్యాలూ ఉండొచ్చు కానీ. చాయ్ విషయంలో అలాంటివే ఉండవు. పొద్దున్నే వేడివేడిగా కాస్త టీ తాగితే నిద్రమత్తు వదిలిపోయి చురుగ్గా ఉంటుంది. ఇక అక్కణ్ణించి రాత్రి లోగా ఎన్నిసార్లు తాగితే అంత హుషారు. మనకు ఇంతగా ఇష్టమైన చాయ్ మరింత ప్రత్యేకంగా ఉంటే ఇంకెంత బాగుంటుందోకదూ ! అందుకోసం 'చాయ్ మసాలా పొడి' ఉంటే



చాలు. ఎలా చేయాలంటారా.. కడాయిలో 50 గ్రాముల యాలకులు, 30 గ్రాముల మిరియాలు, 25 గ్రాముల లవంగాలు, రెండు అంగుళాల దాల్చినచెక్క, ఒక టేబుల్‌స్పూన్ సోంపులను తక్కువ సెగ మీద.. మంచి వాసన వచ్చేదాకా వేయించి, పళ్లెంలోకి తీయాలి. తర్వాత 40 గ్రాముల శొంఠిని కూడా అలాగే ఘుమాయించేదాకా వేగనిచ్చి, పళ్లెంలో వేయాలి. ఈసారి తులసి విత్తనాలు కంకులు 8, సంగం జాజికాయను వేయించాలి. అన్నీ చల్లారాక.. మెత్తగా గ్రైండ్ చేసి సీసాలో భద్రం చేసుకోవాలి. టీ కాచేటప్పుడు.. ఈపొడి కాస్త జోడించారంటే ఇకఆ అద్భుతమైన రుచీ, పరిమళాల గురించి చెప్పడానికి మాటలు సరిపోవు.. ఆస్వాదించి ఆనందించాల్సిందే.

## 'మహేంద్రగిరి వారాహి'కి అద్భుతమైన రెస్పాన్స్



హీరో సుమంత్ డివైన్ బ్లాక్ బస్టర్ థ్రిల్లర్. 'మహేంద్రగిరి వారాహి'. స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ ప్రత్యేక పాత్రలో నటించారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా నిర్మించారు. ప్రెస్‌మీట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ..'చాలా కాలంగా కొంతమంది ఇండస్ట్రీ పీపుల్, అలాగే నా ఫ్యాన్స్ నుంచి విషెస్ అందుకోలేదు. నిన్నటి నుంచి ఆ అభినందనలు మొదలయ్యాయి. మహేంద్రగిరి వారాహిని గురించి ప్రేక్షకులు, అభిమానులు చాలా గొప్పగా మాట్లాడుతున్నారు. గ్రౌండ్ లెవెల్‌లో టాక్ చాలా పాజిటివ్‌గా ఉంది. చాలాకాలం తర్వాత నా స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి కంగ్రాజులేషన్స్ అందుకున్నాను. చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. మాకు సపోర్ట్ చేసిన మీడియాకి, ప్రేక్షకులకు థాంక్యూ. తప్పకుండా ఈ వీకెండ్ సినిమా చూడండి. మేము చాలా మంచి సినిమా చేశాం. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది" అన్నారు. డైరెక్టర్ సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ.. 'సినిమా చూసిన ప్రతి ఒక్కరి దగ్గర నుంచి చాలా పాజిటివ్ రెస్పాన్స్ వస్తుంది. క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులకు ఎలా కనెక్ట్ అవుతుందో అనే ఒక చిన్న భయం ఉండేది. ఆడియన్స్ వాటిని చాలా ఎంజాయ్ చేశారు. రిలీజ్ అయిన అన్ని సినిమాల్లో మాది నంబర్ వన్‌లో ఉందని ఆడియన్స్ చెప్తున్నారు. చాలా హ్యాపీగా ఉంది' అన్నారు. వంశీ చాగంటి మాట్లాడుతూ..'సినిమా చూసిన అందరూ కూడా చాలా హ్యాపీగా ఫీల్ అయ్యారు. ఒక మంచి సినిమా చూసామని ఫీలింగ్‌తో వెళ్తున్నారు. సినిమా ట్రెండింగ్‌లో ఉంది. మీరందరూ తప్పకుండా ఈ పండగ సెలవుల్లో సినిమా చూడండి' అన్నారు. మీనాక్షి మాట్లాడుతూ.. 'మీ అందరికీ సినిమా నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. తప్పకుండా సినిమా అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాత మధు మాట్లాడుతూ.. 'గ్రౌండ్‌లో ఈ సినిమాకి మంచి రెస్పాన్స్ వుంది. అలాగే హిందీలో కూడా మెల్లగా పికప్ అవుతుంది. చాలా మంచి సినిమా చేశాం. తప్పకుండా ఆడియన్స్ అందరూ థియేటర్స్‌కి వెళ్లి చూడండి"అన్నారు.

## 'హ్యాపీ జర్నీ' ట్రైలర్ లాంచ్



ఒక్కో వ్యక్తికి ఒక్కో రకంగా అనిపించే ప్రయాణం.. 'హ్యాపీ జర్నీ'లో అదే ఆలోచనను ఏడుగురు మహిళల జీవితాలు, అనుభవాల ద్వారా ఆసక్తికరంగా చూపించారు. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైకీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న ఖహ్యాపీ జర్నీఖ చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అభిరామ్ నాయుడు మాట్లాడుతూ.. 'మన పేరెంట్స్ మీద మనకి చాలా ప్రేమ ఉంటుంది. కాకపోతే దాన్ని చూపించుకునే విధానం చాలా తక్కువ. ఇలాంటి ఎమోషన్స్ అన్నీ ఈ సినిమాలో చూపిస్తాం' అన్నారు. పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ 'నాకు ప్రతి సినిమాకి తెలుగు ప్రేక్షకులు ఎంతో అభిమానం, ప్రేమ ఇచ్చారు. ఈ సినిమాతో నాకు ఎంతో మంది మంచి ఫ్రెండ్స్ దొరికారు. ఈ సినిమా బ్యూటిఫుల్ జర్నీ. మా నిర్మాతలు మమ్మల్ని ఎంతో కేర్‌తో చూసుకున్నారు' అన్నారు. వంశీ మాట్లాడుతూ.. 'ఇలాంటి లైట్ మూమెంట్స్, ఎమోషన్, ఫన్ సినిమాలు చేయడం చాలా కష్టం. కానీ మా డైరెక్టర్ చాలా అద్భుతంగా చేశారు' అన్నారు. పృథ్వీ మాట్లాడుతూ.. 'ఇందులో చాలా మంచి క్యారెక్టర్ చేశాను. ఈ సినిమా మీఅందరికీ చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది' అన్నారు. రవి శివతేజ మాట్లాడుతూ 'సెప్టెంబర్ 18న ఈ సినిమా వస్తుంది. కచ్చితంగా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. మా డైరెక్టర్ ఒక మంచి సినిమా ఇవ్వాలని నిరంతరం కష్టపడ్డారు' అన్నారు. సునయన మాట్లాడుతూ.. 'సపోర్ట్ చేసిన అందరికీ థాంక్యూ. నిర్మాతలు అద్భుతమైన సినిమా చేశారు. ఇందులో ప్రతిదీ ఒరిజినల్‌గా ఉంటుంది. సినిమా అద్భుతంగా వచ్చింది' అన్నారు. జినీషా మాట్లాడుతూ.. 'ఇందులో చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. అన్ని జనరేషన్స్‌కు నచ్చే ఇలాంటి ఒక సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు.



## 'తెల్ల కాగితం' సాంగ్ రిలీజ్

కె. శ్రీదేవి సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్న చిత్రం 'తెల్ల కాగితం'. హర్ష రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న ఈ సినిమాకి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు నందు సవిరిగాన అందిస్తున్నారు. ఈ మూవీకి రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, టీజర్ అన్నీ కూడా ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా ఈ మూవీ నుంచి 'తెలుసా తెలుసా' అంటూ సాగే ఓ మెలోడీ గీతాన్ని సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. ఈ పాటకు సురేష్ బనిశెట్టి సాహిత్యం.. అనుదీప్ దేవ్, లిప్సిక గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక విజయ్ బుల్గానిన్ ఇచ్చిన మెలోడీ ట్యూన్‌ను మనసుని హత్తుకునేలా ఉంది. లిరికల్ వీడియో ఎంతో అందంగా కనిపిస్తోంది. హీరో, హీరోయిన్ల జంట.. వారిద్దరి మధ్య ప్రేమ సన్నివేశాలు ఈ పాటకు అదనపు ఆకర్షణ కానున్నాయి. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రఫర్ కె.వి గుహన్ కెమెరామెన్‌గా, కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. అక్టోబర్ 2న గ్రాండ్‌గా ఈ ఈ మూవీని విడుదల చేయబోతోన్నారు.

## 'శ్రీరస్తు' త్వరలో రిలీజ్



ప్రణమ్ దేవరాజ్ హీరోగా, సంజనా ఆనంద్ హీరోయిన్ నటిస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'శ్రీరస్తు'. హరి క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శంకర్ రెడ్డి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. పెండ్లిమడుగు హరి కృష్ణ గౌడ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏకకాలంలో తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతను ఆకట్టుకునే కామెడీతో ఈ చిత్రం యూత్ ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ అంశాలతో తెరకెక్కుతోంది. హీరో హీరోయిన్ పాత్రల మధ్య ప్రేమకథ సినిమాకు ముఖ్యమైన అంశంగా ఉండనుంది. ఈ చిత్రంలో ప్రజ్వల్ దేవరాజ్ ఒక ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. సుమన్, దేవి ప్రసాద్, అమని, చైత్ర రాయ్, ప్రసాద్ బెహ్రా, రవి ప్రకాష్, రవి శివ తేజ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

## 'పిఠాపురంలో... అలా మొదలైంది' ప్రి రిలీజ్ ఈవెంట్



డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో.. అలా మొదలైంది'. ఈ సినిమాని మహేష్ చంద్ర సినిమా టీమ్, ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మిం చారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి హైదరాబాద్ లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు సుమన్ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా.. సుమన్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్‌తో నాకు 25 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. ఆయన క్లారిటీతో ఉండే అద్భుతమైన దర్శకుడు. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' మంచి విజయం సాధించాలి. కొత్త కంటెంట్‌తో, ఫ్రెష్ సబ్జెక్ట్‌తో ఆయన తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను' అన్నారు. ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'చంద్ర మహేష్ యోగ్యుడైన దర్శకుడు. ఈ చిత్రంతో చంద్ర మహేష్‌కి మంచి విజయం దక్కాలి. చైతన్య రెడ్డి ఈ మూవీని రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్ చాలా మంచి వ్యక్తి. ఆయన ఎంతో కష్టపడి ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ మూవీని నిర్మించిన దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి నిర్మాతలకు మంచి లాభాలు దక్కాలి. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తీసిన ఈ చిత్రం మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, 'చంద్ర మహేష్ ఎలాంటి దర్శకుడో నాకు ముందు నుంచీ తెలుసు. ఈ కథ చెప్పినప్పుడే నా పాత్ర తాలూకు డెప్త్ ఏమిటో అర్థమైంది. ఎన్నో కష్టనష్టాలు భరించి ఈ సినిమా తీశాడు తను. ప్రపంచంలో వున్న తెలుగువారందరూ కనెక్ట్ అయ్యే కంటెంట్ ఇది. ఈ సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడూ పది మందికి గొప్పగా చెబుతాడు. మై హార్ట్ ఫెల్ట్ థాంక్స్ టు చంద్రమహేష్. ఒక సీనియర్ నటుడుగా మీ అందరికీ దణ్ణంపెట్టి చెబుతున్నా. దయచేసి ఒక మంచి సినిమాని థియేటర్‌కి వెళ్లి చూడండి' అన్నారు. తెలంగాణ ఛాంబర్ సెక్రటరీ అనంత గిరి మాట్లాడుతూ .. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' అని టైటిల్ చూసినప్పుడే సినిమా హిట్ అవుతుందని అనుకున్నాను. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ .. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' సినిమాకి మనసుతో పాటు ప్రాణం పెట్టి పని చేశాను. మూవీ అద్భుతంగా వచ్చింది. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన నా ఆర్టిస్టులందరికీ థాంక్స్. ప్రతీ ఒక్కరూ తమ తమ పాత్రల్లో జీవించేశారు. ఈ సినిమాని కుటుంబ సమేతంగా చూడండి. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. దర్శకుడు రాం ప్రసాద్ మాట్లాడుతూ 'పిఠాపురంలో.. అలా మొదలైంది' చిత్రం ఫ్యామిలీ సెంటిమెంట్‌తో రాబోతోంది. ఇలాంటి సినిమాలు థియేటర్లోనే చూడాలి. ఈమూవీ మంచి విజయం సాధించాలని కోరుకుం టున్నాను' అని అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ 'పిఠాపురంలో.. అలా మొదలైంద్ధి సినిమా సెప్టెంబర్ 18న విడుదలవుతోంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను ' అని అన్నారు. దర్శకుడు వీర శంకర్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్ నాకు మంచి మిత్రుడు. ప్రస్తుతం ఉన్న తరానికి నచ్చేలా సినిమాని తెరకెక్కించాడు. 'పిఠాపురంలో.. అలా మొదలైంది' మూవీ ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది. ఇలాంటి ఫీల్ గుడ్ మూవీని మీడియా సపోర్ట్ చేయాలి' అని అన్నారు. దర్శక రచయిత బీవీఎస్ రవి మాట్లాడుతూ ..'ప్రేమలు, పెళ్లిళ్ల అనే కాన్సెప్ట్ ఉన్నంత వరకు 'పిఠాపురంలో.. అలా మొదలైంది' ఉంటుంది. తండ్రీకి, కూతురికి జరిగే అద్భుతమైన సంఘర్షణ ఇందులో ఉంటుంది. ఈ సినిమాని అందరూ తప్పకుండా చూడండ్ఙి అని అన్నారు.

## 'ముగ్గురు కోతులు' నుంచి సాంగ్ విడుదల



జీఎస్ఆర్ క్రియేషన్స్ సమర్పణలో, స్కై ఫ్లేర్ నెట్‌వర్క్స్ సహ సమర్పణలో శోభారాణి గరిమెల్ల నిర్మాణంలో కార్తీక్ గరిమెల్ల తెరకెక్కిస్తున్న చిత్రం 'ముగ్గురు కోతులు'. ఈ మూవీలో తేజ కొండపల్లి, గణేష్ బొడ్డ, దేవాన్ష్ ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా.. వర్షిక పాశం హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్, 'ముగ్గురు కోతులు' టైటిల్ సాంగ్ ఇలా వరుసగా విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ఆడియెన్స్‌లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటి వరకు విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రంలోని 'చిల్లర సాంగ్'ను యాటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన 'ముగ్గురు కోతులు' చిత్ర బృందానికి తన బెస్ట్ విషెస్ తెలియజేశారు. 'చిల్లర సాంగ్ఙ అంటూ సాగే ఈ పాటకు ఎస్. సుహాస్ అందించిన సాహిత్యం, గాత్రం, బాణీ ఎంతో క్యాచీగా ఉన్నాయి. గణేష్ బొడ్డ, సుహాస్ ఎస్ సంయుక్తంగా రాసిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. ఇక ఈ లిరికల్ వీడియోలో ముగ్గురు హీరోలు సరదాగా చిల్ అవుతున్న సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఖతార్ క్లాసిక్ నుంచి
# అనాహత్ నిష్క్రమణ



**దోహా:** బెల్జియంకు చెందిన ప్రపంచ నంబర్ 9 టిన్నె గిలిస్‌తో ఐదు గేమ్‌ల పోరాటం తర్వాత భారత స్క్వాష్ స్టార్, టీనేజ్ షట్లర్ అనహత్ సింగ్ ఖాతర్ క్లాసిక్ నుండి నిష్క్రమించింది. దోహాలో ఆదివారం నాడు పిఎస్ఎ ప్లాటినం ఈవెంట్ మహిళల రెండో రౌండ్‌లో అనాహత్, టిన్నే గిలిస్‌తో జరిగిన ఉత్సాహభరితమైన ఐదుగేమ్‌ల పోరాటం తర్వాత ఓటమి చెందింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 20వ స్థానంలో ఉన్న అనాహత్ తనకంటే ఉన్నత ర్యాంకులో ఉన్న ప్రత్యర్థిపై మరో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. కానీ 2-1 ఆధిక్యం సాధించిన తర్వాత తన పునరాగమనాన్ని పూర్తి చేయలేకపోయింది. ఎనిమిదో సీడ్ గిలిస్ తొలి గేమ్‌ను 11-4 తేడాతో గెలిచి, బలమైన ఆరంభాన్ని ఇచ్చింది. అనాహత్ మరింత తీవ్రతతో స్పందించి, తర్వాతి రెండు గేమ్‌లను 11-8, 11-9 తేడాతో గెలుచుకుని, క్వార్టర్ ఫైనల్స్‌కు చేరడానికి ఒక గేమ్ దూరంలో నిలిచింది. అయితే నాలుగో గేమ్‌ను 11-4తో గెలిచి పోటీని సమం చేసిన బెల్జియన్ క్రీడాకారిణి, నిర్ణయాత్మక గేమ్‌లో 11-3తో ఆధిపత్యం చెలాయించి తదుపరి రౌండ్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది. అలాగే పురుషుల తొలి రౌండ్‌లో 24వ ర్యాంకు ఆటగాడైన అభయ్, స్విట్జర్లాండ్‌కు చెందిన 22వ ప్రపంచ ర్యాంకర్ డిమిత్రి స్టెయిన్‌మాన్ చేతిలో 7-11, 9-11, 1214 తేడాతో ఓడిపోగా, 38వ ప్రపంచ ర్యాంకర్ చోత్రాని, రెండో ర్యాంకు ఆటగాడైన న్యూజిలాండ్ ఆటగాడు పాల్ కాల్ చేతిలో 11-2, 11-3, 11-1 తేడాతో పరాజయం పాలయ్యాడు.

# యుఎస్ ఓపెన్ రాణిగా రైబాకినా
## సబలెంకా సంచలన ఓటమి



**న్యూయార్క్:** ఎలెనా రైబాకినా, రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్ అయిన అరీనా సబలెంకాను 6-4, 5-7, 6-2 తేడాతో ఓడించి యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రైబాకినా 2 గంటల 21 నిమిషాల్లో విజయాన్ని పూర్తి చేసింది. రైబాకినా న్యూయార్క్ టైటిల్‌ను గెలుచుకోవడంతో, ప్రపంచ నంబర్ 1గా సబలెంకా 99 వారాల పాలనకు కూడా తెరపడింది. యూఎస్ ఓపెన్ విజయం 2026లో రైబాకినాకు మూడవ టైటిల్ కాగా, ఆమె కెరీర్‌లో ఇది 14వది. ఆమె విజయంతో డబ్ల్యూటిఎ టూర్‌లో సబలెంకాపై ఆమె హెడ్‌టుహెడ్ రికార్డు 810కి మెరుగుపడింది. 2016లో ఈ ఘనత సాధించిన ఏంజెలిక్ కెర్బర్, 2024లో సబలెంకాల తర్వాత, 2000 సంవత్సరం నుండి ఒకే సీజన్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు యూఎస్ ఓపెన్ రెండింటినీ గెలిచిన మూడవ క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. సబలెంకాను ఓడించడం ద్వారా, 2002లో సెరెనా విలియమ్స్ తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో డిఫెండింగ్ మహిళల సింగిల్స్ ఛాంపియన్‌ను ఓడించిన మొదటి క్రీడాకారిణిగా రైబాకినా నిలిచింది. 2012లో విలియమ్స్ విక్టోరియా అజరెంకాను ఓడించిన తర్వాత, యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో ప్రస్తుత ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణిని ఓడించిన మొదటి క్రీడాకారిణి కూడా ఈమెనే. ఈ ఓటమితో, 2023 నుండి ప్రతి సంవత్సరం కనీసం ఒక గ్రాండ్ స్లామ్ టైటిల్ గెలుస్తూ వస్తున్న తన అద్భుతమైన పరంపరను కొనసాగించాలన్న సబలెంకా ఆశలు ముగిశాయి. ఆమె 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్‌లో రైబాకినాను ఓడించి తన మొదటి మేజర్‌ను కైవసం చేసుకుంది.



## మహిళల హాకీ ఆసియా కప్..
# భారత్‌కు టైటిల్

**మోకీ (చైనా):** హోరాహోరీ ఫైనల్ పోరులో చైనాను 1-0 తేడాతో ఓడించి, ఏహెచ్ఎఫ్ జూనియర్ ఆసియా కప్ టైటిల్‌ను వరుసగా మూడోసారి గెలుచుకోవడం ద్వారా భారత మహిళల జట్టు జూనియర్ హాకీ ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది. మోకీలో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో సానికా చంద్రకాంత్ మానే ఆరంభంలోనే చేసిన గోల్ నిర్ణయాత్మకంగా నిలిచింది. 17వ నిమిషంలో సానికా గోల్ చేయడంతో, డిఫెండింగ్ ఛాంపియన్లు తమ ఖండాంతర కిరీటాన్ని నిలబెట్టుకున్నారు. టైటిల్ పోరు ఇరు జట్లలోనూ ఆందోళనకర వాతావరణంతో ప్రారంభమైంది, తొలి దశలో ఏ జట్టూ పట్టు సాధించలేకపోయింది. రెండో క్వార్టర్ ప్రారంభమైన రెండు నిమిషాలకే, సానికా చైనీస్ సర్కిల్‌లోకి బంతిని చాకచక్యంగా మళ్లించగా, అది భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకువచ్చింది. భారత్ తమ 1-0 స్వల్ప ఆధిక్యంలో ఉండగా, రెండో అర్ధభాగం ఉత్కంఠభరితంగా మారింది. చైనా నూతనోత్సాహంతో ఆటను పునఃప్రారంభించి, మూడవ క్వార్టర్ ప్రారంభమైన ఏడు నిమిషాలకే స్కోరును సమం చేసేందుకు చేరువైంది. అయితే, భారత జట్టు ఆ పాస్ లక్ష్యాన్ని చేరకముందే అడ్డుకుంది. ఆఖరి క్వార్టర్ చైనా సమం చేసే గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది, కానీ భారత్ తమ స్వల్ప ఆధిక్యాన్ని కాపాడుకుని 1-0తో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసి ట్రోఫీని కైవసం చేసుకుంది.

# టీమిండియాకు నాన్ స్టాప్

**6 నెలల్లో 41 మ్యాచ్‌లు**
**ప్లేయర్లకు రొటేషన్ పాలసీ**



**న్యూఢిల్లీ:** శ్రీలంకతో టెస్ట్ సిరీస్ తర్వాత దొరికిన చిన్నపాటి విరామం ముగియడంతో టీమిండియా మళ్ళీ అంతర్జాతీయ మ్యాచ్‌లతో బిజీ కానుంది. రాబోయే ఐపీఎల్ 2027 సీజన్ ప్రారంభమయ్యే వరకు టీమిండియా ఏకంగా 41 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ బిజీ షెడ్యూల్‌లో ఏడు టెస్టులు, 14 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ భారీ షెడ్యూల్ ఆటగాళ్లపై తీవ్ర ప్రభావం చూపకుండా, వారి ఫిట్‌నెస్‌ను కాపాడటానికి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నెల 13 ఆదివారం నుంచి సొంతగడ్డపై ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌తో భారత క్రికెట్ సందడి మళ్ళీ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ సెప్టెంబర్ 17 వరకు జరుగుతుంది. ఆఫ్ఘనిస్తాన్ సిరీస్ ముగియగానే, భారత్ సొంతగడ్డపై వెస్టిండీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌లో తలపడుతుంది. ఈ సిరీస్ ఈ నెల 27న ప్రారంభమై అక్టోబర్ 16 వరకు కొనసాగుతుంది. సరిగ్గా అదే సమయంలో, శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని మరొక ఇండియన్ టీం జపాన్‌లో జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొననుంది. అలాగే, ఈ నెల 22న జపాన్‌తో ఏకైక చారిత్రాత్మక టీ20 మ్యాచ్ కూడా ఆడనుంది. ఇక అక్టోబర్ చివర్లో టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్తుంది. అక్కడ రెండు టెస్టులు, ఐదు వన్డేలు, ఐదు టీ20ల సుదీర్ఘ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు జరుగుతుంది. డిసెంబర్ 13 నుంచి 27 మధ్య శ్రీలంకతో మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ జరగనుంది. కొత్త సంవత్సరం జనవరి 3 నుంచి 7 మధ్య జింబాబ్వేతో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ బిజీ షెడ్యూల్ కారణంగా కీలకమైన ఆటగాళ్లు గాయాల పాలయ్యే ప్రమాదం ఉండటంతో, బీసీసీఐ ఉన్నత అధికారులు రివ్యూ మీటింగ్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టార్ ప్లేయర్లకు తగిన విశ్రాంతిని ఇస్తూ, రొటేషన్ పాలసీని అమలు చేయాలని నిర్ణయించారు. సీనియర్లకు కాలానుగుణంగా రెస్ట్ ఇస్తూ, యంగ్ ప్లేయర్లను రిజర్వ్ బెంచ్ ద్వారా రంగంలోకి దించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ పాలసీ ద్వారా కీలక ఆటగాళ్లకు శారీరక, మానసిక విశ్రాంతి లభించి, పెద్ద టోర్నమెంట్‌ల ముందు వారు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండేలా చూస్తారు. ఇక ఫైనల్ టచ్ గా ఆస్ట్రేలియాతో ఢీ కొట్టనుంది. భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల ప్రతిష్టాత్మక బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ జనవరి 21 నుంచి ఫిబ్రవరి 27 మధ్య జరగనుంది. ఈ సిరీస్‌తో టీమిండియా అంతర్జాతీయ షెడ్యూల్ ముగుస్తుంది. ఆ తర్వాత మార్చి మొదటి వారంలో ఐపీఎల్ 2027 హంగామా షురూ కానుంది.



## ఆసియా ఛాంపియన్‌షిప్‌లో
# తన్వి పత్రికి టైటిల్

**చైనా:** బ్యాడ్మింటన్ ఆసియా అండర్17 ఛాంపియన్‌షిప్‌లో భారత్ టీనేజర్ తన్వి పత్రి మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. చైనాలోని చెంగ్డూలో ఆదివారం జరిగిన ఆసియా అండర్17 ఛాంపియన్‌షిప్స్ 2026ను గెలుచుకోవడం ద్వారా 15 ఏళ్ల తన్వి పత్రి అంతర్జాతీయ వేదికపై తన అద్భుతమైన టాలెంట్‌ను కొనసాగించింది. భారత మహిళల సింగిల్స్ ఫైనల్‌లో తన్వి ఒక గేమ్ వెనుకబడినప్పటికీ, హోరాహోరీగా సాగిన మూడు గేమ్‌ల మ్యాచ్‌లో తన తోటి భారత క్రీడాకారిణి షైనా మణిముత్తును 11-15, 15-10, 15-12 తేడాతో ఓడించింది. ఇండోనేషియాలోని పొంటియానాక్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో తన తొలి సీనియర్ అంతర్జాతీయ టైటిల్‌ను గెలుచుకున్న కొద్ది వారాలకే, తన్వి ఇప్పుడు జూనియర్ సర్క్యూట్‌లో ఖండాంతర టైటిల్‌ను కైవసం చేసుకుంది. రెండో సీడ్ క్రీడాకారిణి టైటిల్ గెలుచుకునే క్రమంలో పలు అద్భుతమైన విజయాలు నమోదు చేసింది. ఈ క్రమంలో ఆమె బలమైన చైనా జట్టుకు చెందిన ముగ్గురు షట్లర్లను, ఒక జపాన్ షట్లర్‌ను ఓడించింది. గతేడాది దీక్షా సుధాకర్ స్వర్ణం సాధించి, ఈ ఈవెంట్‌లో దేశానికి మొట్టమొదటి విజయాన్ని అందించిన తర్వాత, ఈ విజయంతో భారతదేశం వరుసగా రెండోసారి మహిళల సింగిల్స్ అండర్17 ఆసియా టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదిత్య నేగి, తన్మయ్ వర్మల అండర్15 పురుషుల డబుల్స్ జోడీ సెమీఫైనల్స్‌లో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకోవడంతో భారతదేశానికి ఇదే ఏకైక ఫైనల్.

# ఈ వారం ఐపిఒల సందడి..
## ఎన్ఎస్ఇ మెగా ఐపిఒ సహా 11 ఇష్యూలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** గత వారం ఆరు ఐపిఒలకు పైగా మార్కెట్‌లోకి రావడంతో ప్రైమరీ మార్కెట్లలో నెలకొన్న సందడి ఈ వారం కూడా కొనసాగనుంది. ఈ వారంలో మొత్తం 11 ఐపిఒలు ఇన్వెస్టర్ల ముందుకు రానున్నాయి. వీటిలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మెగా ఐపిఒ కూడా ఉంది. ఈ ఇష్యూ ద్వారా ఏకంగా రూ.22,561.57 కోట్ల సమీకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 11 ఇష్యూలలో ఐదు మెయిన్‌బోర్డ్ ఐపిఒలు ఉన్నాయి. ఎన్ఎస్ఇతో పాటు హీరో మోటార్స్, ఎస్ఎస్‌రిటైల్, సోనాసెలెక్షన్ ఇండియా, జిందాల్ సుప్రీమ్ ఐపిఒలు ఉన్నాయి. ఈ ఐదు ఇష్యూల ద్వారా కలిపి రూ.24,328.02 కోట్ల నిధులను సమీకరించనున్నారు. మరోవైపు, ఎస్ఎంఇ ఐపిఒ విభాగంలోనూ ఈ వారం భారీ సందడి కనిపించనుంది. ఆక్సియమ్ గ్యాస్ ఇంజినీరింగ్ ఐపిఒ 18 నుంచి 22 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. స్పెక్ట్రా ఏ టెక్నాలజీ సొల్యూషన్స్, ఖేరియా ఆటోకాంప్ ఇష్యూలు 17 నుంచి 21 వరకు తెరుచుకోనున్నాయి. వామా వోవెన్‌ఫ్యాబ్, శక్తి పాలీటార్ప్, క్వాంటో అగ్రోవరల్డ్ ఐపిఒలు 15 నుంచి 17 వరకు అందుబాటులో ఉంటాయి. ఎన్నో రోజుల ఆలస్యం, సుదీర్ఘ నిరీక్షణ తర్వాత నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తన మెగా ఐపిఒను తీసుకురానుంది. ఎన్ఎస్ఇ ఐపిఒ మొత్తం ఇష్యూ పరిమాణం రూ.22,561.57 కోట్లు. ఇందులో పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 12.64 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఈ ఐపిఒ 17, 2026న ప్రారంభమై 21న ముగుస్తుంది. ఒక్కో షేరుకు రూ.1,700-రూ.1,785 ధరల శ్రేణిని నిర్ణయించారు. ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ సంస్థ హీరో మోటార్స్ రూ.1,000 కోట్ల ఐపిఒతో మార్కెట్‌లోకి రానుంది. ఇది ఇప్పటికే లిస్టయిన ఆటో దిగ్గజం హీరో మోటోకార్ప్‌కు భిన్నమైన సంస్థ. ఈ ఐపిఒ 16 నుంచి 18 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. ఇందులో రూ.600 కోట్ల ఫ్రెష్ ఇష్యూ, రూ.400 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. షేర్ల కేటాయింపు సెప్టెంబరు 21న జరిగే అవకాశం ఉంది. ఎన్ఎస్ఇ, ఐపిఒ ధరల శ్రేణిని రూ.79-రూ.84గా నిర్ణయించారు. అలాగే ఎస్ఎస్ రిటైల్ రూ.500 కోట్లు సమీకరిస్తుంది. సోనాసెలక్షన్ ఇండియా కూడా 141.57 కోట్లతో ఐపిఒకు వస్తోంది. జిందాల్ సుప్రీం ఐపిఒ రూ.124.88 కోట్ల సమీకరించే లక్ష్యంతో ఐపిఒకు వస్తోంది. ఒఎఫ్ఎస్ మొత్తం రూ.24.99 కోట్లవరకూ ఉంది.

# యుపిఐ చెల్లింపులో ట్యాప్ అండ్ ఫే ఫీచర్



**ముంబయి, సెప్టెంబరు 13:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త మార్పులు, కొత్త ఫీచర్లు అందుబాటులోకి వస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల రంగాన్ని మరింత వేగవంతం, సౌకర్యవంతం చేసేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో రెండు నూతన యుపిఐ ఫీచర్లను ఆవిష్కరించారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అజయ్ కుమార్ చౌదరి, ప్రముఖ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ దిగ్గజాల సమక్షంలో ఈ కొత్త ఫీచర్లను లాంచ్ చేశారు. డెబిట్, క్రెడిట్ కార్డుల మాదిరిగా ట్యాప్ అండ్ పేను యుపిఐలోనూ తీసుకువచ్చారు.

ఇక నుంచి మీ స్మార్ట్ ఫోన్ చూపిస్తే చాలు యుపిఐ పేమెంట్లు పూర్తికానున్నాయి. డిజిటల్ చెల్లింపులలో భద్రతను పెంచడంతో పాటు, కస్టమర్ అనుభవాన్ని, సమస్యల పరిష్కారాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కొత్త ఫీచర్లను తీసుకొచ్చారు. యుపిఐ ట్యాప్ అండ్ పే, ఎఐ ఆధారిత ప్లాట్‌ఫామ్ మై యుపిఐ అనే రెండు ఫీచర్లను తీసుకొచ్చారు. వీటితో డిజిటల్ చెల్లింపులకు మరింత వేగం, సౌలభ్యం, ఇంటెలిజెన్స్ తీసుకువచ్చేలా కొత్త యుపిఐ సామర్థ్యాలను జిఎఫ్ఎఫ్ 2026లో ఆవిష్కరించారు. ఇకపై ప్రతిసారీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదు. యుపిఐ పిన్ లేదా బయోమెట్రిక్ ప్రమాణీకరణ లేకుండా జరిగే పరిమితులను మీ బ్యాంక్ యాప్‌లో కంట్రోల్ చేసుకోవాలి. యూపీఐ ట్యాప్ అండ్ పేకు అనుగుణంగా అన్ని సెట్టింగ్స్, అనుమతులు ఇస్తే మీరు ఆపైన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయకుండానే మీరు నిర్దేశించుకున్న పరిమితి వరకు ట్యాప్ అండ్ పే ద్వారా పేమెంట్లు చాలా వేగంగా పూర్తి చేయవచ్చు.

**వాణిజ్యం**




# గ్లోబల్ స్థాయిలో 1.28 లక్షల టెక్ ఉద్యోగాలు ఔట్




**299 కంపెనీల్లో 1,28,536 మంది తొలగింపు**
**ఒరాకిల్‌లో అత్యధికంగా 21 వేల ఉద్యోగాల కోత**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రపంచ టెక్నాలజీ రంగంలో లేఆఫ్‌ల కుదపు తీవ్రం అయింది. టెక్ కంపెనీలు పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో ఖర్చులను తగ్గించడం, కృత్రిమ మేధస్సువైపు వనరులను మళ్లించడం వంటి చర్యల్లో భాగంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను తొలగిస్తున్నాయి. ఉద్యోగాల కోతలను ట్రాక్ చేసే లేఆఫ్స్‌డాట్‌ఎఫ్‌వైఐగణాంకాల ప్రకారం ఈనెల 10 నాటికి ప్రపంచవ్యాప్తంగా 299 టెక్నాలజీ కంపెనీల్లో 1,28,536 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ యేడాది టెక్ రంగంలో పునర్వ్యవస్థీకరణ ఎంత తీవ్రంగా కొనసాగుతోందో ఈ సంఖ్య స్పష్టం చేస్తోంది. సెప్టెంబరు మొదటి 10 రోజుల్లోనే 5,000కు పైగా టెక్ ఉద్యోగాల కోతలను కంపెనీలు ప్రకటించాయి. తాజా తొలగింపుల్లో ఉబర్, పేపాల్, యాపిల్, జొమాటో, ఒరాకిల్ వంటి కంపెనీలు ఉన్నాయి. గత యేడాది మొత్తం 278 కంపెనీల్లో 1,22,606 టెక్ ఉద్యోగాలు తొలగించగా.. 2026లో ఆ సంఖ్య ఇప్పటికే దాటిపోయింది. 2026లో ఇప్పటివరకు అత్యధిక ఉద్యోగాల కోతలు చేపట్టిన టెక్ కంపెనీగా ఒరాకిల్ నిలిచింది. ఆ సంస్థలో 21,000 ఉద్యోగాలు తగ్గించినట్లు సమాచారం. ఎఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లపై భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ఒరాకిల్ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అమెజాన్, డెల్, మెటాలోనూ భారీ కోతలు ఉద్యోగాల కోతల్లో అమెజాన్ రెండో స్థానంలో ఉంది. 2026లో ఇప్పటివరకు ఆ సంస్థలో 17,267 ఉద్యోగాలు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈకామర్స్, క్లౌడ్ దిగ్గజమైన అమెజాన్ ఏప్రిల్‌లో ఫ్లోరిడాలోని హోమ్‌స్టెడ్‌లో ఉన్న ఓ గోదామును తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ప్రకటించింది. దీంతో 600కు పైగా ఉద్యోగాలు ప్రభావితమయ్యాయి. మేలో అమెజాన్ తన విక్రయభాగస్వాముల విభాగంలోనూ ఉద్యోగాల కోతలను ప్రకటించింది. డెల్ 11,000 ఉద్యోగాల కోతతో తదుపరి స్థానంలో ఉంది. మార్చిలో సంస్థ ఉద్యోగుల సంఖ్యను తగ్గించనున్నట్లు ప్రకటించింది. మెటా కూడా ఈ యేడాది పలు దశల్లో పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. మార్చిలో వందలాది ఉద్యోగాలను తొలగించిన సంస్థ మేలో మరోసారి సుమారు 8,000 ఉద్యోగాలను తగ్గించింది. ఈనెల తొలి 10 రోజుల్లో టెక్ కంపెనీల్లో అత్యధిక ఉద్యోగాల కోతలను ప్రకటించిన సంస్థగా ఉబర్ నిలిచింది. రైడ్‌హెయిలింగ్ దిగ్గజం సుమారు 3,300 ఉద్యోగాలను తొలగించనుంది. పేపాల్ 2026లో ఇప్పటివరకు 4,760 ఉద్యోగాల కోతలను ప్రకటించింది. యాపిల్ సిరి, విజన్ ప్రో, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో 200కు పైగా ఉద్యోగాలను తగ్గించింది. విజన్ ప్రో టీమ్‌లో సుమారు 100 పోస్టులు, సిరి మరియు ఎఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ టీమ్‌లలో మరో 100కు పైగా ఉద్యోగాలు ప్రభావితమయ్యాయి. మైక్రోసాఫ్ట్ కూడా జూలైలో సుమారు 4,800 ఉద్యోగాలను, అంటే తన మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 2.1 శాతాన్ని తగ్గించింది. టిక్‌టాక్ ఆగస్టులో 250 ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. శాంసంగ్ జూలైలో 179 ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. టెక్సాస్‌కు తరలింపు వల్ల సుమారు 1,000 మంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉంది.

## ఫెడ్ నిర్ణయం, ముడి చమురు ధరలే
# ఈవారం మార్కెట్లకు దిక్సూచి



**ముంబై, సెప్టెంబరు 13:** అమెరికా ఫెడరల్ రిజర్వ్‌వడ్డీ రేట్ల నిర్ణయం, ముడి చమురు ధరల కదలికలు, ప్రపంచ కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధాన సంకేతాలు రానున్న సెలవులతో కూడిన వారంలో భారత స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. వరుసగా ఐదో వారం నష్టాలతో ముగిసిన నిఫ్టీ కీలకమైన మద్దతు స్థాయికి సమీపంలో ఉండటంతో మార్కెట్లపై ఒత్తిడి కొనసాగుతోంది. గణేశ్ చతుర్థి సందర్భంగా సోమవారం భారత మార్కెట్లకు సెలవు కావడంతో మంగళవారం నుంచే దేశీయ ఇన్వెస్టర్లు అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, ముడి చమురు ధరలు, బాండ్ ఈల్డ్స్‌పై స్పందించనున్నారు. బుధవారం వెలువడనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం, తాజా ఆర్థిక అంచనాలపై మార్కెట్ల దృష్టి కేంద్రీకృతం కానుంది. దీంతో దేశీయ ఈక్విటీల్లో బలహీనత విస్తృతంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. రంగాల వారీగా మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ రియల్టీ అత్యధికంగా నష్టపోయిన రంగంగా నిలవగా, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్ షేర్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. ఫెడ్ నిర్ణయంపైనే ప్రధాన దృష్టిఈ వారంలో ప్రపంచ మార్కెట్లకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం, ఫెడ్‌రిజర్వు ఆర్థిక అంచనాలు ప్రధాన ట్రిగ్గర్లుగా ఉండనున్నాయి. ద్రవ్యోల్బణ గణాంకాల నేపథ్యంలో 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు పెంపునకు అధిక అవకాశాలు ఉన్నాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. కేవలం వడ్డీ రేటు నిర్ణయంపైనే కాకుండా ఫెడ్ వ్యాఖ్యలు, భవిష్యత్ ద్రవ్యవిధానంపై ఇచ్చే సంకేతాలపైనా ఆధారపడి ఉంటుంది. వడ్డీ రేటులో మార్పు లేకపోవడం లేదా 25 బేసిస్ పాయింట్ల పెంపుతో పాటు సమతుల్యమైన మార్గదర్శకత్వం ఇవ్వడం జరిగితే ప్రస్తుతం మార్కెట్లు భయపడుతున్నంత కఠిన వైఖరి ఉండదని ఇన్వెస్టర్లు భావించే అవకాశం ఉంది. దీంతో మార్కెట్లలో స్వల్పకాలిక ర్యాలీకి అవకాశం ఉండొచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.